


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...

APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్య ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.



visit us @ http://epaper.suryaa.com

సంపుటి 17 | సంచిక 205

సోమవారం | 24 జూన్ 2024 | హైదరాబాద్

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు, వైశాఖ మాసం బహుళ తదియ రా.3.02, ఉత్తరాషాఢ సా.5.48, వర్జ్యం రా.9.38 నుంచి 11.10 వరకు
రాహుకాలం మ.1.30 నుంచి 3.00 వరకు దుర్ముహూర్తం మ.12.26 నుంచి 1.18 వరకు తిరిగి మ.3.03 నుంచి 3.55 వరకు

## వానలు వచ్చేస్తున్నాయ్



6 లో


- తెలుగు రాష్ట్రాలకు చల్ల చల్లని కూల్ న్యూస్
- ఏపీ, తెలంగాణలో వర్షాలు కురుస్తాయని వెల్లడించిన వాతావరణ శాఖ

## మెగా డీఎస్సీపై నిర్ణయం




2 లో

- ఏపీలో మరోసారి 'టెట్' నోటిఫికేషన్...?
- డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని విద్యాశాఖ డెడ్ లైన్



3 లో


# నేటి నుంచి పార్లమెంటు సమావేశాలు

- 24, 25 తేదీల్లో కొత్త ఎంపీల ప్రమాణ స్వీకారం
- జూన్ 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక
- ప్రొటెం స్పీకర్‌గా బిజేపీ ఎంపీ రాధా మోహన్ సింగ్?

# సభలో వ్యక్తిగత దూషణలు వద్దు

- సభకు వన్నె తెచ్చిన కూటమి సభ్యులు
- ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత
- పెద్దరికంతో వ్యవహరించిన బాబు
- నేడు మంత్రి వర్గ సమావేశం

ప్రజలిచ్చిన తీర్పుకు అనువుగా కూటమి సభ్యులు రెండు రోజులు పాటు జరిగిన శాసన సభా సమావేశాల్లో వ్యవహరించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడులు కొత్త సభ్యులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సభా సమయాన్ని ప్రజా సమస్యల పరిష్కారానికి ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు.



2 లో

## ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టుకు సీఎం



6 లో

- ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్ అరెస్ట్
- ఇటీవల బెయిల్ మంజూరు చేసిన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు
- కేజ్రీవాల్ బెయిల్ పై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ఈడీ
- బెయిల్‌పై స్టే ఇచ్చిన ఢిల్లీ హైకోర్టు

## నా దు:ఖాన్ని మీరంతా చూసే ఉంటారు



- వయనాడ్ ప్రజలకు రాహుల్ గాంధీ భావోద్వేగ లేఖ
- కష్ట సమయాల్లో నాకు అండగా నిలిచారు
- ప్రియాంకా గాంధీని ఆదరించాలి

వివరాలు-6లో

# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

- నామినేటెడ్ పోస్టులు, మంత్రి వర్గ విస్తరణ,
- పీసీసీ అధ్యక్షుడి ఎంపిక వంటి అంశాలపైన అధిష్ఠానంతో చర్చించే అవకాశం

సఎం రేవంత్ రెడ్డి రేపు ఢిల్లీ వెళ్లనున్నారు. నామినేటెడ్ పోస్టులు, మంత్రి వర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి ఎంపిక వంటి అంశాల్పై అధిష్ఠానంతో చర్చించే అవకాశం ఉంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఆశించిన మేరకు ఫలితాలు సాధించకపోవడంతో నామినేటెడ్ పోస్టుల భర్తీని పునస్సమీక్షించాలని అధిష్ఠానం నిర్ణయించినట్టు సమాచారం. సీనియార్టీ ప్రాతిపదికన కాకుండా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పనితీరు ఆధారంగా పోస్టులను భర్తీ చేయాలని పార్టీ పెద్దలు యోచిస్తున్నట్టు తెలిసింది. అలాగే తమతో చర్చించకుండానే నామినేటెడ్ పోస్టులు ప్రకటించారని మంత్రులు, ముఖ్యనేతలు, ఎమ్మె ల్యేలు కొందరు సీఎం రేవంత్ రెడ్డిపై అధిష్ఠానం దృాష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది.



6 లో

## టీఎస్‌లో నేడు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల



- తెలంగాణలో మే 24 నుంచి జూన్ 3 వరకు సప్లిమెంటరీ పరీక్షలు
- జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి
- నేటి మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాల విడుదల

వివరాలు-6లో

## చిరంజీవితో బండి భేటీ



6 లో


- హైదరాబాదులో చిరంజీవి నివాసానికి వచ్చిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- అన్నయ్యను కలవడం ఎప్పుడూ సంతోషదాయకమేనని వెల్లడి
- విద్యార్థి దశ నుంచే తాను చిరంజీవి ఫ్యాన్ అంటూ ట్వీట్

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

# జగన్..! ఏపీ నీ తాత జాగీరా?

- మాజీ సీఎం జగన్‌పై నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం
- జగన్.. ఆ సొమ్ముతో 25 వేల మంది పేదలకు ఇళ్లు కట్టివ్వొచ్చు తెలుసా?: నారా లోకేశ్
- జిల్లాల్లో జగన్ నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయాల ఫొటోలు షేర్ చేసిన లోకేశ్
- ఏంటీ విలాసాల పిచ్చి అని ఆగ్రహం
- 26 జిల్లాల్లో 42 ఎకరాల్లో 33 ఏళ్లకు రూ. 1000 లీజా అని ప్రశ్న




3 లో

వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వైసీపీ కార్యాలయాలపై ఆయన ట్విట్టర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో చేసిన భూ కేటాయింపులపై మండిపడ్డారు. 'జగన్.. ఏంటీ ప్యాలెస్‌ల పిచ్చి. ఈ రాష్ట్రం నీ తాత రాజారెడ్డి జాగీరా.?. కేవలం వైసీపీ కార్యాలయాల కోసం 26 జిల్లాల్లో భూ కేటాయింపులు చేశారు.

# నేడు ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గ సమావేశం

- పోలవరం, అమరావతికే తొలి ప్రాధాన్యత
- నిబద్ధతతో వ్యహరించిన ఉన్నతాధికారులను నియమించే అవకాశం
- ప్రభుత్వ శాఖల శ్వేత పత్రాల విడుదల చేయాలని నిర్ణయం
- గత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై చర్చించే ఆస్కారం

నేడు జరగనున్న తొలి మంత్రి వర్గ సమావేశంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయు డు ప్రభుత్వం చేపట్టనున్న ప్రాధాన్య తలను మంత్రులకు వివరించనున్నారు. అయితే ప్రభుత్వ శాఖల ఆర్థిక పరిస్థితులు అందుకు అనుగుణంగా లేకపోవడంతో శ్వేత పత్రాలను విడుదలకు నిర్ణయం తీసుకున్నారు.



3 లో



## జుడీషియల్ ప్రివ్యూ కమిషన్ వేయండి

అమరావతి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జుడీషియల్ ప్రివ్యూ కమిషన్ ను నియమించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక ఛైర్మన్ కె.ఆర్. సూర్య నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై ఈనెల 24న జరిగే ఏపీ క్యాబినెట్ మొదటి సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు పడ్డ ఇబ్బందులను వివరించారు. ఈ నేపథ్యంలోనే జుడీషియల్ ప్రివ్యూ కమిషన్‌ను కోరుతున్నట్లు చెప్పుకొచ్చారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక ఛైర్మన్ కె.ఆర్. సూర్య నారాయణ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తున్నానని నన్ను అణచి వేయాలని చూశారు. ఏ కేసు పెట్టారో కూడా చెప్పకుండా విచారణకు పిలిచి నన్ను, నా కుటుంబాన్ని వేధింపులకు గురి చేశారు. నా భార్య మెడలోని నల్లపూసల గొలుసు తీయించి పోలీసులు దారుణంగా వ్యవహరించారు. వైసీపీ పాలనలో నా ఇంటి చుట్టూ వందలాది మంది పోలీసులు మోహరించేవారు.. నేనేమైన్నా సంఘ విద్రోహ శక్తినా?. హైదరాబాద్‌లో బంధువుల ఇళ్లకు వెళ్లి మరీ వారిని భయందోళనలకు గురి చేశారు. రాత్రి సమయం లోనూ పోలీసులు అక్కడే ఉండేవారు. నా ఇంటికి సీల్ వేసే అధికారం పోలీసులకు ఎక్కడిది? అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబాన్ని వేధించిన పోలీస్ అధికారులు రావి సురేశ్ రెడ్డి, భాస్కరరావులపై ఎన్డీయే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూర్య నారాయణ అభ్యర్థించారు. గత సీఎస్ జవహర్ రెడ్డి ఒక దినపత్రికలో తనపై వచ్చిన వార్త ఆధారంగా చర్యలు తీసుకోవడానికి సిద్ధపడ్డారని, మరి జవహర్ రెడ్డి మీద వచ్చిన వార్తలకు ఆయన మీద ఏం చర్యలు తీసుకోవాలంటూ ప్రశ్నించారు.

# వ్యక్తిగత దూషణలకు చెక్

**● సభకు వన్నె తెచ్చిన కూటమి సభ్యులు ● ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత**
**● పెద్దరికంతో వ్యవహరించిన బాబు ● నేడు మంత్రి వర్గ సమావేశం**



విజయవాడ... ప్రజలిచ్చిన తీర్పుకు అనువుగా కూటమి సభ్యులు రెండు రోజులు పాటు జరిగిన శాసన సభా సమావేశాల్లో వ్యవహరించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడులు కొత్త సభ్యులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సభా సమయాన్ని ప్రజా సమస్యల పరిష్కారానికి ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. తొలిసారిగా శాసన సభలోకి అడుగు పెట్టినా, ఎంతో పరిణతి కలిగిన నాయకుని వలే జనసేనాని పవన్ కళ్యాణ్ వ్యవహరించారు. గత ప్రభుత్వం పవిత్రమైన శాసన సభను నీచ రాజకీయాలు, వ్యక్తిత్వహననానికి వేదికగా మార్చేసిందని వివరించారు. కూటమి సభ్యులు హుందాగా వ్యవహరించి సభ గౌరవానికి మరింత వన్నె తీసుకురావాలని సూచించారు.

**మాజీ ముఖ్యమంత్రికి అనుకూలంగా నిర్ణయాలు**

సభకు వచ్చే సమయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గౌరవానికి భంగం కలిగి పరిస్థితులు ఉన్నాయని తెలుసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాసన సభ నిబంధనలను పక్కన పెట్టి మరీ నిర్ణయాలు తీసుకున్నారు. శాసన సభ్యుల ప్రమాణ స్వీకార సమయంలోనూ, శాసన సభలోకి ప్రవేశించే సమయంలో మాజీ ముఖ్యమంత్రికి అనుకూలంగా వ్యవహరించి తన పెద్దరికాన్ని నిలువుకున్నారు. శాసన సభ వెనుక మార్గం నుంచి రావడానికి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అవకాశం ఇచ్చారు. సభ్యుల ప్రమాణ స్వీకారానికి ఆ పార్టీ సభ్యుల కంటే ముందుగా అవకాశం కల్పించారు.

**ఆకట్టుకున్న డెప్యూటీ సీఎం ప్రసంగం :**

తొలి ప్రసంగంతోనే జన సేనాని పవన్ కళ్యాణ తన ముద్రను వేశారు. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ సభ్యులు వ్యవహరించిన తీరు, ప్రసంగించిన విధానాన్ని తప్పుపట్టారు. వ్యక్తగత దూషణలు, ప్రజా వ్యతిరేక నిర్ణయాల కారణంగానే ఆ పార్టీ 11 స్థానాలకే పరిమితం అయిందని వివరించారు. కూటమి సభ్యుల ప్రసంగాలు, నిర్ణయాలు రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్ కు ఉపయోగపడేలా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

**ముఖ్య నిర్ణయాలు**


అసెంబ్లీలోకి ఈటీవీ, ఏబీఎన్, టీ-5 ఛానళ్లను రానీయకుండా గత ప్రభుత్వం విధించిన నిషేధాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. రానున్న రోజుల్లో పత్రికలు ప్రజా సమస్యలను ప్రభుత్వం ముందుకు తీసుకురావడంతోపాటు, వాటిని ఎలా పరిష్కరించాలో సూచనలు కూడా ఇవ్వాలని కోరుతూ నిర్ణయం తీసుకుంది. షోషల్ మీడియాపై నియంత్రణ తీసుకురావడానికి గల మార్గాలను కూడా అన్వేషించాలని నిర్ణయం తీసుకుంది.

**నేడు మంత్రివర్గ సమావేశం**

సోమవారం ఉదయం 10 గంటలకు మంత్రివర్గ సమావేశం ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్య-తన సచివాలయంలో సైమావేశం ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆక్వారంగంలో దూసుకెళ్తున్న ఏపీ

**● బెంగాల్‌ను అధిగమించి అగ్రస్థానం ● మొత్తం ఉత్పత్తిలో ఏపీ వాటా 41 శాతం ● కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడి**



అమరావతి... ఆంధ్రప్రదేశ్‌లో ఫిషింగ్ అండ్ ఆక్వాకల్చర్ రంగం దూసుకెళ్తోంది. గత పదేళ్ల కాలంలో ఈ రంగంలో గణనీయమైన పురోగతి కనిపించింది. ఫలితంగా ఫిషింగ్ అండ్ ఆక్వాకల్చర్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్.. పశ్చిమ బెంగాల్‌ను దాటి అగ్రస్థానానికి చేరుకుంది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. 2015-16 నాటితో పోలిస్తే 2022-23 ఆర్థిక సంవత్సరం నాటికి ఏపీలో ఫిషింగ్ అండ్ ఆక్వాకల్చర్ ఉత్పత్తి భారీగా పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్.. బెంగాల్‌ను దాటేసి అగ్రస్థానానికి చేరుకున్నట్లు తెలిపాయి. 2011-12 నాటికి దేశంలోని ఫిషింగ్ అండ్ ఆక్వాకల్చర్ ఉత్పత్తిలో ఏపీ వాటా 17.7 శాతంగా ఉండేది. అయితే ఇది 2022-23 ఆర్థిక సంవత్సరం నాటికి 40.9 శాతానికి చేరుకుందని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు తెలిపాయి. ఇదే సమయంలో బెంగాల్ వాటా భారీగా తగ్గిపోయినట్లు తెలిపాయి. 2011-12లో 24.6 శాతం వాటా ఉండగా.. 2022-23 నాటికి ఇది 14.4 శాతానికి పడిపోయిందని గణాంకాలు వెల్లడించాయి. శాతాల వారీగా కాకుండా డబ్బు రూపంలో చూస్తే ఫిషింగ్ అండ్ ఆక్వాకల్చర్ ఉత్పత్తిలో ఏపీ వాటా రూ.79,900 కోట్లుగా ఉన్నట్లు కేంద్ర గణాంకాలు తెలిపాయి.మరోవైపు ఫిషింగ్ అండ్ ఆక్వాకల్చర్ రంగంలో తమ రాష్ట్రంలో ఉత్పత్తి పెరుగుతోందని పశ్చిమ బెంగాల్ చెప్తున్నప్పటికీ.. గడిచిన ఆరేళ్ల కాలంలో బెంగాల్ వాటా తగ్గినట్లు కేంద్ర గణాంకాలు పేర్కొన్నాయి. మొత్తం ఫిషింగ్ అండ్ ఆక్వాకల్చర్ ఉత్పత్తిలో ఏపీ వాటా సుమారుగా 41 శాతం ఉన్నట్లు తెలిపాయి. మరోవైపు మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాలు కూడా ఈ రంగంలో తమ ఉత్పత్తిని పెంచుకున్నట్లు గణాంకాలు వెల్లడించాయి. ఫిషింగ్ అండ్ ఆక్వాకల్చర్ ఉత్పత్తిలో బెంగాల్ రెండో ప్లేసులో ఉండగా.. మధ్యప్రదేశ్ మూడు, బిహార్ నాలుగో స్థానంలో ఉన్నట్లు తెలిపాయి.

## వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్లే గుంటూరుకి ఈ దుస్థితి

**● కేంద్ర, ప్రపంచ బ్యాంకు నిధుల్ని గత ప్రభుత్వం దారి మళ్లించింది ● గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి ● మున్సిపల్ అధికారులతో కేంద్రమంత్రి పెమ్మసాని సమీక్ష సమావేశం ● రాబోయే రోజుల్లో గుంటూరు నగరంలో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు**



గుంటూరు: కేంద్ర, ప్రపంచ బ్యాంకు నుంచి వచ్చిన నిధుల్ని వైకాపా ప్రభుత్వం దారి మళ్లించి, దుర్వినియోగం చేయడంతో గుంటూరు నగరంలో అభివృఎద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని కేంద్రమంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నిలిచిపోయిన అభివృఎద్ధి పనులపై కలెక్టరేట్‌లో స్థానిక ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో తాగునీరు సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, రహదారులు, ఇతర పనులకు కేటాయించిన రూ.వందల కోట్లను గత ప్రభుత్వం దారి మళ్లించి ఖజానా ఖాళీ చేసిందని ఆరోపించారు. నిధుల సమీకరణకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలపై దృఎష్టి పెట్టి నిలిచిపోయిన పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. అర్ధాంతరంగా నిలిచిన పనుల్ని వెంటనే ప్రారంభించి, నగరవాసులకు కనీస సదుపాయాలు అందుబాటులోకి తీసుకువస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు.

## కాకినాడ జిల్లాలో డయేరియా కలకలం

**● ఇప్పటి వరకు 210 మందికి డయేరియా..140 మంది డిశ్చార్జ్**
**● ఇద్దరు మహిళలు మృతి ● భయాందోళనకు గురవుతున్న ప్రజలు**



కాకినాడ : ఏపీలోని పలు జిల్లాల్లో డయేరియా కలకలం స్పృఎష్టిస్తోంది. కాకినాడ జిల్లాలో డయేరియా కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటి వరకు డయేరియా బాధితుల సంఖ్య 210కి చేరగా.. ఆస్పత్రుల నుంచి140 మంది డిశ్చార్జ్ అయ్యారు. డయేరియాతో కొమ్మనాపల్లికి చెందిన నాగమణి, వేట్లపాలెంకు చెందిన సత్యవతి అనే ఇద్దరు మహిళలు మృఎతి చెందడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. డయేరియాకు కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వో ఆఫీస్‌లో నిరంతరం మానిటరింగ్ చేసేలా హెల్ప్ లైన్ సెంటర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. తొండంగి మండలం కొమ్మనాపల్లి, సామర్లకోట మండలం వేట్లపాలెంలో వైద్య బృ ఎందాలతో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. కలుషిత తాగునీటి సరఫరా, పైప్ లైన్‌లు లీకేజీలతో డయేరియా కేసులు పెరుగుతున్నాయి. వాటర్ శాంపిల్స్ కలెక్ట్ చేసి ఆర్డబ్ల్యూఎస్ అధికారులు టెస్టింగ్‌కు పంపారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట జనాలను కూడా డయేరియా కలవరపెడుతోంది. ఇప్పటికే డయేరియా వల్ల ఒకరు చనిపోవడం, పెద్ద ఎత్తున కేసులు నమోదవ్వడంతో జనాలు వణికిపోతున్నారు. నియోజకవర్గంలోని 8 గ్రామాలకు డయేరియా పాకింది. దీంతో జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రి రోగులతో నిండిపోయింది. ఇక వెంటనే అప్రమత్తమైన అధికారులు రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రిలో 16 మంది వైద్యులు 24 గంటలపాటు సేవలు అందిస్తున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో డయేరియా ప్రబలడంతో పదుల సంఖ్యలో ఆసుపత్రి పాలయ్యారు ప్రజలు. నీరు రంగు మారిపోవడం, ఆ ప్రాంతంలో డ్రైనేజీ లోంచే మంచి నీటి పైప్ లైన్లు వెళ్ళడం ఆందోళనకు గురి చేస్తుంది. జగ్గయ్యపేటలో డయేరియా ప్రబలడానికి కారణం నీటి పంపు లైన్లు, పైపులు సరైన నిర్వహణ లేదని అంటున్నారు స్థానికులు. ఐదేళ్ళుగా కంప్లైంట్లు ఇస్తున్నా పట్టించుకోలేదని ఆరోపణలు కూడా వస్తున్నాయి. డయేరియా విజృఎంభణపై ఇప్పటికే ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది ఎక్కడికక్కడ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తోంది. ర్షాకాల నేపథ్యంలో అంటురోగాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సర్కారు సూచిస్తోంది. ఇటీవల డయేరియా వ్యాధి కట్టడిపై అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిలదీశారు. డయేరియా కట్టడిపై వివిధ శాఖల అధికారులతో సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలకు రక్షిత తాగునీరు అందించేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. మంచినీటి పైపులైన్లు లీకేజీలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు డయేరియా నియంత్రణపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డయేరియా నియంత్రణకు కట్టుదిట్టమైన ప్రణాళిక అమలు చేయాలని సీఎస్ ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృఎద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మున్సిపల్, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృఎతం కాకూడదని సీఎస్ ఆదేశించారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హెూంమంత్రి అనిత

**● లాంఛనంగా స్వాగతం పలికిన అధికారులు ● తిరుమల వచ్చే భక్తులకు అన్ని రకాలుగా భద్రత కల్పిస్తాం**



తిరుమల: హోంమంత్రి అనిత తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమెకు అధికారులు లాంఛనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆమె మీడియాతో మాట్లా డారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తామన్నారు. తమ శాఖ పనితీరుకు చీరాల ఘటనే ఉదాహరణ అని పేర్కొన్నారు. తిరుమల వచ్చే భక్తులకు అన్ని రకా లుగా భద్రత కల్పిస్తామన్నారు. అందరికీ మంచి జరగాలని భగవంతుడిని ప్రార్థించినట్లు చెప్పా రు. అంతకుముందు మీడియా ప్రతినిధులు అడిగిన ఓ ప్రశ్నకు.. రాజకీయాల గురించి ఆలయంలో మాట్లాడలేమని చెప్పారు.

## మెగా డీఎస్సీపై నిర్ణయం




అమరావతి : ఏపీలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మెగా డీఎస్సీపై ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తొలి సంతకం కూడా మెగా డీఎస్సీ దస్త్రంపైనే సంతకం చేశారు. దీంతో విద్యాశాఖ కూడా కసరత్తు షురూ చేసింది. ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించింది.

**మరోసారి టెట్ నోటిఫికేషన్.?**

ఏపీలో ఇప్పటికే నిర్వహించిన టెట్ (ఫిబ్రవరి 2024)ఫలితాలు రావాల్సి ఉంది. ఈ ఫలితాల విడుదలపై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. విద్యాశాఖ మంత్రిగా లోకేశ్ బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పుడిప్పుడే ఫైల్స్ ముందుకు కదులుతున్న నేపథ్యంలో ఏ క్షణమైనా టెట్ ఫలితాలు ప్రకటించే అవకాశం ఉంది.

పాత నోటిఫికేషన్ తో సంబంధం లేకుండా మెగా డీఎస్సీకి సంబంధించి కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వనుంది ఏపీ ప్రభుత్వం. ఈ నేపథ్యంలోనే మరోసారి టెట్ ప్రకటన ఇచ్చే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది. ఫలితంగా మరికొంత మందికి కూడా డీఎస్సీకి అర్హత పొందే ఛాన్స్ దక్కుతుంది. ఇదే విషయంపై పలువురు టీడీపీ ఎమ్మెల్సీలు. శనివారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ను కలిశారు. మెగా డీఎస్సీ నేపథ్యంలో మరింత మంది నిరుద్యోగులకు అవకాశం కల్పించేలా టెట్ నిర్వహించాలని కోరారు. దీనిపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై త్వరలోనే విద్యాశాఖ నుంచి క్లారిటీ వచ్చే అకాశం ఉంది.

మొత్తం డీఎస్సీ ప్రక్రియను 6 నెలల్లోపే పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే టెట్ ను కూడా నిర్వహించే అవకాశాలపై కసరత్తు చేసే అవకాశం ఉంది. నోటిఫికేషన్ ఇస్తే కొత్త అభ్యర్థులతో పాటు గతంలో అర్హత సాధించనివారికి కూడా ఛాన్స్ దొరికినట్లు అవుతుంది. రాష్ట్రంలోని పలువురు నిరుద్యోగులు కూడా టెట్ పరీక్షను మరోసారి నిర్వహించాలని కూడా కోరుతున్నారు.

**మెగా డీఎస్సీ పోస్టుల వివరాలు**

తాజాగా వచ్చే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం మొత్తం 16,347 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ) 6,371,స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ)-7,725, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీలు)-1,781, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీలు)-286, ప్రిన్సిపాళ్లు 52, వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీలు)-132 ఉద్యోగాలు ఉన్నాయి.

***స్కూల్ అసిస్టెంట్ - 7,725***
***ఎస్‌జీటీ - 6371***
***టీజీటీ - 1781***
***పీజీటీ - 286***
***పీఈటీ - 132***
***ప్రిన్సిపల్స్ - 52***

వైసీపీ ప్రభుత్వం 6,100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే.ఈ పోస్టుల్లో 2,280 సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ), 2,299 స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ), 1,264 ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ), 215 పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ), 42 ప్రిన్సిపాల్ పోస్టులు ఉన్నాయి. విద్యాశాఖ కొత్తగా టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనుంది. గత డీఎస్సీ ప్రకటనను అనుసరించి దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేయక్కర్లేదు. కొత్తగా ఏ జిల్లాలకైనా దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఛాన్స్ ఇవ్వనున్నారు. ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేసేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మొత్తం ప్రక్రియను 6 నెలల్లోపే పూర్తి చేయనున్నారు.

## అమరావతికి కేంద్ర సంస్థలు!



అమరావతి.. ఏపీ రాజధాని అమరావతి మరో గుడ్ న్యూస్ అందుతోంది. రాజధాని ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కోసం సీఆర్‌డీఏ అధికారులు ప్రయత్నిస్తున్నారు. 2014-19 హయాంలో అమరావతిలో పది నుంచి పదిహేను కేంద్ర ప్రభుత్వ సంస్థలకు స్థలాలు కేటాయించారు. అయితే 2019 తర్వాత అమరావతిపై నీలినీడలు కమ్ముకోవటంతో.. కేంద్ర ప్రభుత్వ సంస్థలు కార్యాలయాలు ఏర్పాటు చేయలేదు. తాజాగా ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరటంతో మళ్లీ అమరావతికి పునర్వైభవం వచ్చింది. దీంతో అమరావతిలో కార్యాలయాల ఏర్పాటు కోసం తమకు కేటాయించిన భూములను చూపించాలని కొన్ని సంస్థలు సీఆర్డీఏ అధికారులను కోరినట్లు తెలిసింది. ఏపీలో ఇప్పుడు అమరావతి పేరు మళ్లీ మార్మోగిపోతోంది. వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటనతో రాజధాని అమరావతి అంశం కాస్త వెనుకబడిపోయింది. అమరావతి అంటే రైతుల ఉద్యమమే తప్ప మరో వార్త వినిపించేది కాదు. కానీ ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఏపీలో అమరావతి పేరు మళ్లీ బలంగా వినిపిస్తోంది. అమరావతే తమ రాజధాని అని ఎన్నికలకు ముందు చెప్పిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు.. అధికారంలోకి వచ్చి సీఎం అయ్యాక అమరావతే ఏపీ రాజధాని అని పునరుద్ఘాటించారు. అలాగే ఏపీ అంటే అమరావతి, పోలవరం అని అర్థం చెప్పారు చంద్రబాబు. ఇక అమరావతిలో పర్యటించి.. తమ హయాంలో నిర్మించిన భవనాలను, రాజధానికి శంకుస్థాపన చేసిన ప్రాంతాలకు కూడా పరిశీలించారు. అలాగే టీడీపీ అధికారంలోకి రావటంతో అమరావతిలో రియల్ ఎస్టేట్ రేట్లు కూడా పెరిగాయని వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే అమరావతికి మరో గుడ్ న్యూస్ అందుతోంది. అమరావతిలో తమ కార్యాలయాల ఏర్పాటుకు కొన్ని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. గతంలో అమరావతి ప్రాంతంలో కొన్ని ప్రభుత్వ సంస్థలకు అప్పటి టీడీపీ ప్రభుత్వం స్థలాలు కేటాయించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాగ్ సహా 10 నుంచి 15 కేంద్ర సంస్థలు, జాతీయ బ్యాంకులకు అప్పట్లో భూములు కేటాయించారు. తాజాగా తమకు కేటాయించిన స్థలం చూపించాలని కొన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలు.. సీఆర్‌డీఏ అధికారులను కోరినట్లు సమాచారం.

## అవ్వాతాతలు, దివ్యాంగులకు



పుట్టపర్తి: జులై ఒకటో తేదీన ఇంటి వద్దనే సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తామని మంత్రి ఎస్.సవిత తెలిపారు. అవ్వాతాతలకు, దివ్యాంగులకు ఏ ఇబ్బంది కలగకూడదని భావించి ఇంటివద్దనే పింఛన్లు పంపిణీ చేపడుతున్నామని ఏపీ బీసీ, చేనేత జౌళిశాఖల మంత్రి ఎస్.సవిత చెప్పారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా పెనుగొండ నియోజకవర్గానికి వచ్చిన టీడీపీ నాయకురాలు సవితకు పార్టీ శ్రేణులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. బెంగళూరు విమానాశ్రయం నుంచి వయా సోమందేపల్లి, పెనుగొండ పట్టణము వరకు 6 గంటల పాటు సుదీర్ఘంగా మంత్రి సవిత ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఏపీ మంత్రి సవిత మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అగ్రస్థానంలో నిలువుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమంతో పాటు అభివృఎద్ధిపై నిరంతరం కృఎషి చేస్తున్నారని పేర్కొన్నారు. చేనేతకు పూర్వ వైభవం తీసుకురావడానికి తన వంతు కృఎషి చేస్తానన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేనేత కార్మికుల బతుకుల్లో అభివృఎద్ధి వెలుగులు విరజిల్లుతాయన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ, రాయితీ, అభివృఎద్ధి పథకాలు పారదర్శకంగా అమలు చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



# నేటి నుంచి పార్లమెంటు సమావేశాలు

న్యూఢిల్లీ... 24 నుంచి జులై 3 వరకు పార్లమెంటు సమావేశాలు జరగనున్నాయి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు ఈ విషయాన్ని వెల్లడించారు. కొత్త ఎంపీలతో ఈ నెల 24, 25 తేదీల్లో ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు వివరించారు. 26న స్పీకర్ ఎన్నిక జరగనుంది. ఇక 27న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్ర పతి ముర్ము ప్రసంగిస్తారు. ఎన్డీయే 3.0కి ఇది తొలి సెషన్ కావడం గమనార్హం. ఆ తరువాత ఎంపీలందరు కలిసి జూన్ 26న లోక్‌సభ స్పీకర్‌ను ఎన్నుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ సారి జరిగిన ఎన్నికల్లో బీజేపీ సొంతంగా మెజారిటీ సాధించకపోవడంతో ఎన్డీయే మిత్ర పక్షాలైన టీడీపీ, జేడీయూ మద్దతుతో అధికారాన్ని చేజిక్కించుకుంది. కేంద్రంలో బీజేపీ తన అధికారాన్ని కాపాడుకోవాలంటే ఈ రెండు పార్టీల మద్దతు చాలా ముఖ్యం. దీంతో లోక్‌సభ స్పీకర్ పదవి కోసం ఈ రెండు పార్టీలు కూడా బీజేపీపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. రాజస్థాన్ కోటా స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఓం బిర్లాకు మరోసారి అవకాశం ఇవ్వొచ్చని తెలుస్తుంది. అలాగే, ఆంధ్రప్రదేశ్ నుంచి పురందేశ్వరి పేరు కూడా ప్రచారంలో ఉంది. దీనిపై పూర్తి స్పష్టత కొరవడింది. ఏడోసారి తిరిగి ఎన్నికైన కేంద్ర మాజీ మంత్రి, భారతీయ జనతా పార్టీ శాసనసభ్యుడు రాధా మోహన్ సింగ్‌ను ప్రొటెం స్పీకర్‌గా ఎన్నుకోవచ్చని తెలుస్తుంది.
రాష్ట్రపతి జూన్ 27న సభను ఉద్దేశించి ప్రసంగిస్తారని, జులై 3న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టి, పూర్తి బడ్జెట్‌ను జులై 22న సమర్పించే అవకాశం ఉందని సమాచారం. లోక్‌సభ ఎన్నికలకు ముందు మధ్యంతర బడ్జెట్‌ను అధికార బీజేపీ సమర్పించగా, ఇప్పుడు కూడా ఆ పార్టీ అధికారంలోకి రావడంతో ఆర్థిక మంత్రిగా తిరిగి నియమితులైన నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపట్టనున్నారు.

# జగన్ ఏపీ నీ తాత జాగీరా?

● మాజీ సీఎం జగన్‌పై నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం ● జగన్.. ఆ సొమ్ముతో 25 వేలమంది పేదలకు ఇళ్లు కట్టివ్వొచ్చు తెలుసా?: నారా లోకేశ్ ● జిల్లాల్లో జగన్ నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయాల ఫొటోలు షేర్ చేసిన లోకేశ్ ● ఏంటీ విలాసాల పిచ్చి అని ఆగ్రహం ● 26 జిల్లాల్లో 42 ఎకరాల్లో 33 ఏళ్లకు రూ. 1000 లీజా అని ప్రశ్న

అమరావతి : వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వైసీపీ కార్యాలయాలపై ఆయన ట్విట్టర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో చేసిన భూ కేటాయింపులపై మండిపడ్డారు. 'జగన్.. ఏంటీ ప్యాలెస్‌ల పిచ్చి. ఈ రాష్ట్రం నీ తాత రాజారెడ్డి జాగీరా.?. కేవలం వైసీపీ కార్యాలయాల కోసం 26 జిల్లాల్లో భూ కేటాయింపులు చేశారు. రూ.1000 నామమాత్రపు లీజుతో 42 ఎకరాలకు పైగా కేటాయించారు. ప్రజల నుంచి దోచుకున్న రూ.500 కోట్లతో ప్యాలెస్‌లు కడుతున్నావు. నీ ఒక్కడి భూ దాహానికి కబ్జా అయిన 42 ఎకరాల్లో.. 4,200 మంది పేదలకు సెంటు స్థలాలు ఇవ్వొచ్చు. నీ విలాసాల ప్యాలెస్‌ల నిర్మాణానికి అయ్యే రూ.500 కోట్లతో 25 వేల మంది పేదలకు ఇళ్లు కట్టి ఇవ్వొచ్చు. నీ ధన దాహానికి అంతు లేదా.?' అని లోకేశ్ మండిపడ్డారు. అటు, ఇవి ప్రభుత్వ భవనాలు కాదని.. ఊరూరా జగన్ రెడ్డి ప్యాలెస్‌లు అని టీడీపీ ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. అటు, రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లా కేంద్రాల్లో నిర్మిస్తోన్న వైసీపీ కార్యాలయాలకు అధికారులు నోటీసులు ఇచ్చారు. అనుమతులు లేకుండా.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్నారని వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. విశాఖ, అనకాపల్లి, రాజమండ్ర, నెల్లూరు, అనంతపురంలో కార్యాలయ నిర్మాణాలను ఆపేయాలని ఆదేశించారు. కాగా, ఈ నోటీసులపై వైసీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రభుత్వ కక్ష పూరిత చర్య అంటూ ఆరోపిస్తున్నారు.
అటు, అమరావతిలోని తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైసీపీ కార్యాలయాన్ని శనివారం ఉదయం సీఆర్డీఏ అధికారులు కూల్చేశారు. సీతానగరం వద్ద ఉన్న భవనాన్ని భారీ పోలీస్ భద్రత మధ్య.. పొక్లెయినర్, బుల్డోజర్లతో కూల్చారు. అయితే, నీటి పారుదల శాఖ స్థలంలో భవనం నిర్మించారని.. అందుకే చర్యలు



చేపట్టామని అధికారులు వివరించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకే కూల్చివేత ప్రక్రియ చేపట్టామని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అక్రమ నిర్మాణాలు కూల్చేయకుంటే కోర్టు నిబంధనలు ఉల్లంఘించినట్లు అవుతుందనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాయి. జల వనరుల శాఖ భూమిని వైసీపీ కార్యాలయ నిర్మాణానికి ఇవ్వడం కుదరదంటూ ఈఎన్‌సీ నారాయణరెడ్డి ఇచ్చిన లేఖను ప్రభుత్వ వర్గాలు విడుదల చేశాయి.


## ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సేవలో స్పీకర్



విజయవాడ.. విజయవాడలో ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు సకుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్పీకర్‌కు ఆలయ ఈఓ రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్పీకర్‌కు వేదపండితులు వేదాశీర్వచనం చేసారు. వేదాశీర్వచనం అనంతరం ఈఓ రామారావు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రాలను స్పీకర్ అయ్యన్న పాత్రుడుకు అందజేశారు. స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే.

## నేటి మంత్రి వర్గ సమావేశం

● పోలవరం, అమరావతికే తొలి ప్రాధాన్యత
● నిబద్ధతతో వ్యహరించిన ఉన్నతాధికారులను నియమించే అవకాశం ● ప్రభుత్వ శాఖల శ్వేత పత్రాల విడుదల చేయాలని నిర్ణయం ● గత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై చర్చించే ఆస్కారం



విజయవాడ.. నేడు జరగనున్న తొలి మంత్రి వర్గ సమావేశంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయు డు ప్రభుత్వం చేపట్టనున్న ప్రాధాన్య తలను మంత్రులకు వివరించనున్నారు. అయితే ప్రభుత్వ శాఖల ఆర్థిక పరిస్థితులు అందుకు అనుగుణంగా లేకపోవడంతో శ్వేత పత్రాలను విడుదలకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆయా శాఖలపై కసరత్తు చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి నుంచి పోలవరం, అమరావతి నిర్మాణాలకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పోలవరం, అమరావతి ప్రాంతాలను పర్యటించారు. పోలవరం నిర్మాణంలో కీలకంగా పని చేసిన చీఫ్ ఇంజనీరు (రిటైర్డ్) వెంకటేశ్వరరావును సలహాదారునిగా నియమించారు. అదే విధంగా అమరావతి నిర్మాణంలో నిబద్ధతతో వ్యహరించిన ఉన్నతాధికారులను తిరిగి ఆయా పోస్టుల్లో నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అదే విధంగా ప్రజలు అధికంగా నష్టపోయిన, ఆందోళన చెందిన గత ప్రభుత్వ ఉత్తర్వులపై చర్చించనున్నారని తెలిసింది. ముఖ్యంగా రిజిస్టేషన్ల శాఖ ప్రవేశ పెట్టిన కార్డ్ ప్రైమ్ 2.0 స్టాఫ్ట్ వేర్ ద్వారా అన్ లైన్ రిజి స్ట్రేషన్లు జరిగాయి. దీని వలన భౌతిక ధస్తావేజులు ప్రజలకు అందుబాటు లోకి రాలేదు. దీంతో కొనుగోలుదారులు తమ ఆస్తులకు సంబంధించిన ధస్తావేజులు లేకపోతే తిరిగిన వాటిని అమ్మకోవడం ఎలా? బ్యాంకుల్లో రుణాలు ఎలా తీసుకోవాలో తెలియక అందోళన చెందారు. దీనిపై కూడా ప్రభుత్వం చర్చించనుందని అధికారిక వర్గాల సమాచారం.

# ప్రజలతో నేరుగా బాబు, పవన్, లోకేష్



అమరావతి.. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డీఏ ప్రభుత్వం కాస్త రూటు మార్చింది. గతానికి ఇప్పటికి భిన్నత్వం కనిపిస్తోంది. గతంలో ముఖ్యమంత్రిని కానీ, ఇతర మంత్రులను కానీ కలవాలంటే ప్రజలకు కష్టంగా ఉండేది. కానీ ఈ సారి అధికారం చేపట్టిన ఎన్‌డీఏ ప్రభుత్వం నేరుగా ప్రజల వద్దకే వెళుతోంది. గతంలో చాలా సార్లు ఈ ప్రయోగాలు చేసినా ఎక్కువగా ముందుకు సాగలేదు. పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు వారం రోజుల క్రితం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లారు. అక్కడ నాయకులు, మంత్రులు, కార్యకర్తలతో మమేకమయ్యారు. ప్రతి ఒక్కరితో ఓపిగ్గా ఫొటోలు దిగారు. అర్జీలు స్వీకరించారు. ఇకపై ప్రతి వారం పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వస్తానని మాటిచ్చారు. ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లారు. అక్కడ కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. మంత్రులు కూడా జిల్లాలో పార్టీ కార్యాలయాలకు వెళ్లాలని, కార్యకర్తలు, జిల్లా స్థాయి నాయకులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఇకపై ప్రతి సోమవారం ప్రజల నుంచి అర్జీలు తీసుకునే కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించాలని కలెక్టర్‌లను ఆదేశించారు. తాను కూడా సోమవారం ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తానని, ఎక్కడ అనువైన ప్రాంతమనేది పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇప్పటికే ప్రజా దర్బార్ పేరుతో అర్జీల స్వీకరణ ప్రారంభించారు. ప్రతి వారం మంగళగిరిలోని టీడీపీ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని నిర్ణయించారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం వద్ద శనివారం లోకేష్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎక్కువ మంది మంగళగిరి నియోజకవర్గానికి చెందిన వారు కాగా రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది ప్రజలు సమస్యలపై అర్జీలు ఇచ్చారు. వారి సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. తన ఇంటి వద్దకు ఎవరైనా సమస్యలు చెప్పుకునేందుకు రావొచ్చని లోకేష్ చెప్పడం విశేషం. అయితే ముఖ్యమంత్రి కూడా ఇదే ఇంట్లో ఉంటున్నందున పోలీసులు సెక్యూరిటీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పలు సందర్భాల్లో పర్యటనల్లో పరదాలు కట్టుకునే ప్రభుత్వం మాది కాదని లోకేష్‌తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా చెప్పారు. తిరుమలలో వెంకటేశ్వస్వామిని కుటుంబ సమేతంగా చంద్రబాబు సందర్శించినప్పుడు లోకేష్ పరదాలపై విలేకరుల వద్ద సరదాగా జోకులు వేసి అందరినీ నవ్వించారు. ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ అసెంబ్లీ నుంచి శనివారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి రాగా ఆయన కోసం చాలా మంది ప్రజలు అర్జీలు తీసుకుని సమస్యలు చెప్పుకునేందుకు ఉన్నారు. వారిని చూసిన పవన్ కళ్యాణ్ పార్టీ ఆఫీసు హెల్ప్‌డెస్క్ వద్ద కుర్చీలు వేసుకుని





కూర్చున్నారు. అర్జీలు తీసుకుని ఒక్కొరితో ఓపిగ్గా మాట్లాడారు. భూ వివాదాలు, క్రైం అంశాలు, స్థానిక సమస్యలు ఇలా అన్ని రకాల సమస్యలు వచ్చాయి. ప్రధానంగా వ్యక్తిగత సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. సంబంధిత ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. విజయవాడలో చదువుకుంటున్న మైనర్ బాలిక తన కుమార్తె అని, ఆమెను ప్రేమ పేరుతో ఎవరో ట్రాప్ చేసి కనిపించకుండా చేశారని, తొమ్మిది నెలలుగా ఆమె జాడ కనిపించలేదని శివకుమారి అనే బాధితురాలు వాపోయారు. మాచవరం పోలీస్ స్టేషన్ సీఐకి ఫోన్ చేసి కేసు వివరాలు తెలుసుకుని బాధితులను తన కారులోనే పోలీస్ స్టేషన్‌కు పంపించడం విశేషం. కర్నూలు, గుంటూరు, పల్నాడు, ఎన్‌టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల నుంచి వచ్చిన బాధితులతో ఆయన మాట్లాడారు. ప్రతి వారం జన దర్బార్ పేరుతో ప్రజలతో కలిసి వారి సమస్యలు వినే కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి చేపట్టనున్నారు.
సచివాలయంలో కూడా అన్ని బ్లాకులను పవన్ కళ్యాణ్ పరిశీలించారు. ఉద్యోగులను ఆప్యాయంగా పలకరించారు. ఎనిమిదేళ్లుగా తాము సచివాలయంలో పనిచేస్తున్నామని, మేమంతా రాజధానికి భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు చెందిన వారమని, మమ్మల్ని ఉద్యోగులుగా గుర్తించాలని హౌస్ కీపింగ్ సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

# నేడు మంత్రి పవన్ కళ్యాణ్‌ను కలవనున్న టాలీవుడ్ పెద్దలు

● చిత్రసీమ సమస్యల పరిష్కారం అజెండా ● ప్రధానంగా టికెట్ రేట్ల పెంపు మీద చర్చ!

అమరావతి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి ప్రభుత్వాన్ని అభినందించడానికి తెలుగు చలన చిత్ర పరిశ్రమలో పెద్దలు, ప్రముఖ నిర్మాతలు వెళుతున్నారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత, ప్రముఖ కథానాయకుడు పవన్ కళ్యాణ్ ను సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలవనున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే...
వైజయంతీ మూవీస్ అధినేత సి. అశ్వినీ దత్, హారిక అండ్ హాసిని క్రియేషన్స్ అధినేత చినబాబు (సూర్యదేవర నాగవంశీ), మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నాగవంశీ సూర్యదేవర, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్, ఆ సంస్థ సహ నిర్మాత వివేక్ కూచిభొట్లతో పాటు తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధినేత 'దిల్' రాజు, దామోదర్ ప్రసాద్, భోగవల్లి ప్రసాద్, డీవీవీ దానయ్య తదితరులు పవన్ కళ్యాణ్ దగ్గరకు వెళుతున్న నిర్మాతల జాబితాలో ఉన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం ఏపీలో అధికారంలో ఉన్న సమయంలో తెలుగు చలన చిత్ర పరిశ్రమ పెద్దలు పలు సమస్యలు ఎదుర్కొన్నారు. ఆయా సమస్యలో ముఖ్యమైనది టికెట్ రేట్లు! పవన్ దగ్గర ఆ సమస్యల పరిష్కారంతో పాటు టికెట్ రేట్స్ గురించి చర్చకు వచ్చే అవకాశం ఉంది. పవన్ కళ్యాణ్ 'భీమ్లా నాయక్' విడుదల సమయంలో సూర్యదేవర నాగవంశీ, 'వకీల్ సాబ్' విడుదల సమయంలో 'దిల్' రాజు, 'బ్రో' విడుదల సమయంలో టీజీ విశ్వ ప్రసాద్ వైసీపీ ప్రభుత్వం నుంచి సమస్యలు ఎదుర్కొన్నారు. పవన్ సైతం ఒక వేదిక మీద వైసీపీ పెడుతున్న ఇబ్బందులకు తలొగ్గేది లేదని, అవసరం అయితే తన సినిమాలను యూట్యూబ్‌లో విడుదల చేస్తానని చెప్పారు. పరిశ్రమ సమస్యల మీద ఆయనకు అవగాహన ఉంది. అందువల్ల, సానుకూలంగా స్పందించడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకుంటారని టాలీవుడ్ పెద్దలు విశ్వాసంతో ఉన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత థియేటర్లలోకి వస్తున్న భారీ సినిమా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా సి అశ్వినీదత్ నిర్మించిన 'కల్కి 2898 ఏడీ'. ఈ నెల 27న థియేటర్లలోకి వస్తోంది.
ఈ చిత్రానికి తెలంగాణ ప్రభుత్వం ఎనిమిది రోజుల పాటు సింగిల్ స్క్రీన్లలో 75, మల్టీప్లెక్స్ స్క్రీన్లలో 100 రూపాయలు పెంచుకునే వెసులుబాటు ఇచ్చింది.



ఏపీలో టికెట్ రేట్లు ఎంత పెంచుతారు? అనేది రేపు పవన్, నిర్మాతల భేటీలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.
ఆయన్ను కలుస్తున్న పెద్దల్లో 'కల్కి 2898 ఏడీ' ప్రొడ్యూసర్ సి అశ్వినీదత్ కూడా ఉన్నారు.

## చంద్రబాబు విజ్ఞప్తికి
# కేంద్రం అంగీకారం

**సీనియర్ ఐఏఎస్ అధికారిని రాష్ట్రానికి పంపించాలన్న వినతికి ఓకె**

అమరావతి : కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ.. తనకు కావాల్సిన వాటిని సాధించుకుంటోంది. ఈ క్రమంలోనే కేంద్ర సర్వీసుల్లో ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారిని రాష్ట్రానికి పంపించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన విజ్ఞప్తికి కేంద్రం ఓకే చెప్పింది. చంద్రబాబు అడిగిన సీనియర్ ఐఏఎస్ అధికారిని ఏపీకి పంపించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న మరికొందరు ఐఏఎస్ అధికారులు కూడా త్వరలోనే రాష్ట్రానికి రానున్నట్లు తెలుస్తోంది. సీనియర్ ఐఏఎస్ అధికారి పీయూష్ కుమార్ ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి వచ్చారు. పీయూష్ కుమార్‌ను కేంద్ర సర్వీసుల నుంచి రిలీవ్ చేస్తూ కేంద్ర సిబ్బంది మరియు వ్యవహారాల శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రంలో పనిచేస్తున్న ఏపీ కేడర్ అధికారులను రాష్ట్రానికి పంపాలని ఇటీవలే డీవోపీటీకి ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు లేఖ రాశారు. ప్రస్తుతం కేంద్రంలో కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ శాఖ అదనపు సెక్రటరీగా పీయూష్ కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ బాధ్యతలను పీయూష్ కుమార్‌కు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. పీయూష్ కుమార్ మాత్రమే కాకుండా త్వరలో కేంద్రంలో పనిచేస్తున్న మరికొందరు సీనియర్ ఐఏఎస్‌లను కూడా ఏపీకి తిరిగి తీసుకువచ్చేందుకు చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు.



# అందరివాడుగా బదిలీపై వెళ్తున్న కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్

● అనాధులు నిస్సహాయులను చూస్తే చలించి పోయే సున్నిత మనస్తతత్వం ఆయన సొంతం
● ఎన్నికలలో ఆయన పాత్ర కీలకం - ఓటింగ్ శాతం పెరిగింది ఆయన ప్రణాళికతోనే

ఏలూరు,సూర్య బ్యూరో: ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన 2022 జనవరి 26న జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించి నాటి నుంచి జిల్లా యంత్రాంగంతో మమేకమై రాజీ పడకుండా పరిపాలన సాగించారు, తన పని తీరుతో అటు సామాన్య ప్రజలలో సైతం అందరి మనిషిగా కలెక్టర్ విధులు నిర్వహిస్తూ ప్రజలు, ఇటు అధికారులు అందరిలో చెరగని ముద్ర వేసుకున్న అధికారి ప్రసన్న వెంకటేష్. ప్రజల నుంచి వినతుల స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ వారి మన్ననలు పొందగలిగారు. పరిపాలనలో నిష్పక్షపాతంగా వ్యహరిస్తారని అన్ని వర్గాలలో మంచి పేరు ఉంది. ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో సైతం ఆయన తనదైన ముద్ర వేశారు. గతంలో గోదావరి వరదలు సంభవించిన సమయంలో సహాయ పునరావాస కేంద్రాలలో దగ్గర ఉండి పర్యవేక్షణ చేసి బాధితులకు అండగా నిలిచారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో చురుకైన పాత్ర పోషించారు. గిరిజన ప్రాంతాలలో పౌష్టిక ఆహారం అందించేందుకు సరికొత్త పథకాన్ని అమలులో తీసుకొచ్చారు. జిల్లా కలెక్టర్ గా వె.ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన కొన్ని ముఖ్యాంశాలను గుర్తు చేసుకుంటే..వాటిలో ప్రధానంగా చారిత్రాత్మక 'గోదావరి నదిలో వరదలు' (గత 3-4 దశాబ్దాలలో కూడా అత్యధికం) రెండు సార్లు నిర్వహించ బడ్డాయి. వేలాది మందిని సకాలంలో రక్షించి, తరలించి సహాయక సేవలను అందించడంలో వె.ప్రసన్న వెంకటేష్ సేవలు మరువలేనివి. పేదలు ,వృద్ధుల ఫిర్యాదుల పరిష్కారం పైనా కలెక్టర్ మనస్సు తో దృష్టి సారించారు. కైకలూరు, దెందులూరు నియోజకవర్గాలలో కొల్లేరు ప్రభుత్వ భూముల ఆక్రమణలను వ్యతిరేకించి కొత్త ఆక్రమణల నుండి కొల్లేరును కాపాడడంలో అవిరళ కృషి చేశారు. శాంతియుత పద్ధ తిలో, నిష్పక్షపాత పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. ఓటింగ్ శాతం 84.9కి పెరిగింది, ఇది గత సాధారణ ఎన్నికల 2019 కం టే ఎక్కువ నమోదు కావడం విశేషం. అందుకే కలెక్టర్ ఏలూరు జిల్లా జనం మదిలో అందరివాడుగా మిగిలారు అనడంలో ఎలాంటి అతిశయోక్తి కాదు.

**Invesco Mutual Fund**

The details of upcoming Investor Awareness Program(s) ('IAP') are as follows:

| Date | Time | Meeting ID | Passcode |
|---|---|---|---|
| June 27, 2024 | 4.00pm | 241 543 008 852 | ho8bzY |

Those who are interested to attend IAP are requested to email the details to us at iap@invesco.com
Date: June 24, 2024 This IAP is for women attendees only.
Mutual Fund investments are subject to market risks, read all scheme related documents carefully.

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక
అక్షరం
4
సోమవారం 24 జూన్ 2024
editpage@suryaa.com

# చీకటికి ఏనాటికీ




అదే ఉషోదయమైతేనా!
తొలి కిరణమే నిను వెదుకుతూ వస్తుంది
అశ్రు బిందువు లో ఇంద్ర ధనుస్సు
మెరిపిస్తుంది
సహస్ర దీప కాంతులతో ఓదార్చి,
మానవ ద్వీపాల సౌందర్యాన్ని
పరిచయం చేస్తుంది
అందుకనే,
శిఖరానివైనా చీకటి లో రోదించకు
శిథిలమై పోయినా ఉదయాన్ని
ద్వేషించకు.

పెను చీకటికి ఏనాటికీ
కన్నీటి విలువ ఎరుక రాదు
కాలువలై ప్రవహించినా
ఇసుక నేల లా పీల్చేస్తుంది
లోకం చెక్కిలి పై చారికలా,
ఏకాకి లా నిను మిగులుస్తుంది

డా. డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ.
ఫోన్ : 9440836931.

# సై..సై..జోడెడ్లబండి...



జన్మ ధన్య మైనట్టే .....
దేహం చమటకాయలుతో
ఇబ్బంది పెడితే
ఆకన్నుల్లో నీరును దేహానికి రాస్తే
నాసామిరంగ స్వర్గం కనిపిస్తాది
శరీరానికి ఎంతో చలువ చేస్తాది
ఇప్పుడు అసలు కథ
మొదలు అవుతుంది..
జుర్రేసి ఖాళీ చేసిన కాయలను
రెండింటిని ఎన్నుకోవాలి
సమ సైజుగా చెక్కుకోవాలి
అందమైన డిజైను
కట్ చెయ్యాలి
అర్ధ భాగం సెంటరులో
రంధ్రం పెట్టాలి
కర్రకు మొదలు చివర
సూదిగా చెక్కాలి
రెండింట మధ్య బ్యాలెన్సుగా
కర్ర గుచ్చాలి
తాటి కమ్మని కొయ్యాలి
ఆకమ్మకు మధ్యగా కాని
ప్రారంభంలో కాని కర్రకు తగ్గట్టు
బెజ్జం అతి జాగ్రతగా పెట్టుకోవాలి
టైర్లకి గాలి పట్టించక్కర్లేదు
బండికి ఇంధనం పొయ్యక్కర్లేదు
ఇరుసుకి గ్రీజు పెట్టక్కరలేదు
అసలు కానీ ఖర్చు లేనేలేదు
సై సై జోడెడ్ల బండి సిద్ధం
నాతో పోటీకి ఎవరైనా వస్తారా
సై అంటే సై........

కాలం గిర్రున తిరిగొచ్చింది ఎండలు
మండుతున్నాయి
వాటిని చూస్తే బాల్యంలోకి...
మధుర ఫలాలు-మల్లెలేకాదు..
అల్లనేరేడు అసలేకాదు...
పసుపు లేత ఆకుపచ్చ రంగులో...
రారామ్మని పిలుస్తాయి
అవి ఎంత ఎత్తులో ఉన్నా సరే...
అమాంతం జరజర ఎగ పాకేస్తాం
గెలలన్ని చకచక నరికేస్తాం
కిందికి బిరబిర దిగి వచ్చేస్తాం
కొడవలితో గబగబ కోసేస్తాం
తినేలోపే నోట్లో లాలాజలం
గంగమ్మ తల్లిలా ఉబికి వచ్చేస్తుంది
ఒక కన్ను నుండి మూడు
కన్నులు ఉంటాయి
ముక్కంటిని తలపిస్తాయి
అందమైన నెమలీకలు
వాటి ముందు దిగదుడుపే
ఆకన్నులు చూస్తే
మన కన్నులు పెద్దవవుతాయి
తింటే పంచదార పనస
తొనలే గుర్తుకొస్తాయి
ఆహా ఏమి రుచి తినరా మైమరిచి ...

-గాదిరాజు రంగరాజు
8790122275

# కలల వెన్నెల పువ్వులు



చల్లని పిల్లగాలికి మత్తిల్లిన
కనులు రెప్పలు మూయగనే
ఆ కనురెప్పలపై కలల కుహు కుహులు
లయబద్ధంగా ఏదో గమ్మత్తైన
ప్రణయ రాగమాలపించె
ఆ రాగాలాపనకి కన్నులలో
దోబూచులాడుతున్న
కలల వెన్నెల పువ్వులు
రంగు రంగుల రెక్కలు తొడిగి
మనసంతా ధూప సౌగంధికాలు
వెదజల్లి
ఉక్కిరిబిక్కిరి గావించి రేపటి
ఉదయంతో
ఆ తియ్యని ఊసులు చెప్పుకుని
మురిసిపోవాలని....
చీకటి వాకిట రెప్పల తలుపులకు
తియ్యని ఆ తలపులు ఆనించి
వేచి చూడ సాగె తొలిపొద్దు కోసం
కనుల గుప్పిట బిగించి పట్టుకున్న
ఆ కమ్మని కలల కౌముదిని
ఎప్పుడెప్పుడని


తొలిసంజె ముంగిట విప్పాలని
తన ప్రణయ విరహం చూపి
ఆ భానోదయపు గుండెలమీద వాలి
పరవశించి పోవాలని....

కన్నులలో మొగ్గలు తొడిగి వికసిస్తున్న
ఆ వెన్నెల పూల పరిమళపు
మాధుర్యాన్ని మరింత సృష్టించుకుని

తన ప్రణయరాగం సాకారం
చేసుకోవాలని
ప్రేమ పరాగపు శాంతి సౌఖ్యాలు
పొందాలని
రెప్పల ద్వారంలో ఎదురు తెన్నులు
కాస్తూ అభిసారికయై ఆ కలల వెన్నెల
పువ్వులు
నవోదయం కోసం కోటి ఆశలతో !

సాగముని.యం
9490856185

# 25 న డా. ఎన్. గోపి 'రేపటి మైదానం' ఆవిష్కరణ




సుప్రసిద్ధ కవి డా. ఎన్. గోపి 75వ జన్మదినం సందర్భంగా తాజా కవితాసంపుటి 'రేపటి మైదానం' ఆవిష్కరణ జూన్ 25, మంగళవారం సాయంత్రం 6 గంటలకు పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి, హైదరాబాద్ లోని తెలుగు విశ్వవిద్యాలయం ఎన్.టి.ఆర్. ఆడిటోరియంలో జరుగ ంతుంది. ఆంధ్రజ్యోతి ఎడిటర్ డా. కె. శ్రీనివాస్ ఆవిష్కరిస్తారు. డా. వోలేటి పార్వతీశం అధ్యక్షత వహిస్తారు. ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి అంకితాన్ని స్వీకరిస్తారు. అతిథులుగా ఆచార్య సూర్యా ధనంజయ, డా. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, డా. ఎస్. రఘు, శ్రీ వంగల హర్షవర్ధన్, డా. ఎస్. జతిన్ కుమార్, శ్రీ కుడికాల వంశీధర్, శ్రీ పుప్పాల శ్రీరామ్, డా. జె. నీరజ పాల్గొంటారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధినేత మద్దాళి రఘురాం ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుంది.

# వరూధిని కుమారుడు స్వరోచి శరణు కోరిన గంధర్వ కన్య మనోరమ



వనం జ్వాలా నరసింహారావు
8008137012

గర్భం దాల్చిన వరూధినికి తొమ్మిదినెలలు నిండాయి. ఒక శుభ గ్రహంతో కూడిన లగ్నంలో దేదీప్యమానుడైన, దేవేంద్రుడితో కొనియాడతగినవాడైన, మహత్తరకాంతి సంపన్నుడైన ఒక కుమారుడిని కన్నది వరూధిని. సూర్యచంద్రాదుల కాంతితో సమానమైన కాంతి, చక్కటి శరీర ఛాయ కలవాడైన ఆ బాలుడికి ఋషులు స్వరోచి అని పేరు పెట్టారు. ఆ బాలుడు దినదినాభివృద్ధి చెంది, మునీంద్రుల ఆశీర్వాద బలం కలిగి, ఉపనయనం చేసుకొని, ధనుర్వేదం అభ్యసించి, వేదార్థాలను నేర్చుకొని, యుద్ధం చేయడంలో గొప్పవాడై, సకల న్యాయ విచారణ చేయడంలో సమర్థుడై, కళావంతుడయ్యాడు. స్వరోచి సామ్రాజ్యాన్ని అనుభవిస్తుండగా ఒకనాడు ఆయనున్న కొండ మీద వడగళ్లు రాలాయి. వర్షం కురిసింది. సెలయేళ్లు ఎత్తైన ప్రదేశం నుండి ప్రవహించడంవల్ల పెద్ద ధ్వని కలిగింది. ఆ ధ్వనికి నెమిళ్లు కేకలు వేస్తూ నాట్యం చేశాయి. అలాంటి సుందర దృశ్యాన్ని చూద్దామని అనుకున్నాడు స్వరోచి ఆ మర్నాడు. స్వరోచి అనుకున్నట్లుగానే కొండమీది నుండి చూస్తూ వినోదిస్తున్నప్పుడు అక్కడికి ఒక శబరుడు తమ రాజైన స్వరోచిని చూడడానికి వచ్చాడు. తాను తెచ్చిన దనుర్బాణాలను రాజుకు ఇచ్చి నమస్కరించాడు. సమీపంలోని కైలాసపర్వతం దగ్గరున్న అడవిలో ఘాతుక మృగాలు అమితంగా వున్నాయని, వాటిలో అడవి పందులు, సూకరాల గున్నలున్నాయని, బాగా బలసిన రుష్యాలున్నాయని, దుప్పులు కూడా వున్నాయని, ఇంకా వృషతాలు,




యిర్రిపోతులున్నాయని, ఎన్నో రకాల పక్షులున్నాయని చెప్పి స్వరోచిని వేటకు ప్రేరేపించాడు. స్వరోచికి కూడా వేటాడడానికి మనసు కలిగి తన నగరానికి పోయి దానికి కావాల్సిన సన్నాహాలు చేసుకున్నాడు. ఒక ఉన్నతాశ్వాన్ని ఎక్కి స్వరోచి పరివారంతో కలిసి వేటకు బయల్దేరాడు. వారి వెంట వేటకుక్కలు కూడా వున్నాయి. వేటకాండ్రు కూడా బయల్దేరారు. అంతా కలిసి విచ్చలవిడిగా వేటాడారు. జింకలు, సివంగులు, ఎలుగులు, పెద్ద పందులు, పెద్ద పులులు ఇలా ఎన్నో జంతువులు వేటకాండ్రను చూసి పరుగెత్తాయి. ఇలా వేట సాగుతుండగా దాదాపు పూర్తికావస్తున్న సమయంలో స్వరోచికి ఒక ఆడుదాని దుఃఖం వినిపించింది. వనితనని, అనాథనని, ఆర్తురాలినని, తనను రక్షించి పుణ్యం కట్టుకొమ్మని ఆక్రందనం వినగానే స్వరోచి ఆవైపునకు చూశాడు. ఒక స్త్రీ మట్టెలు మోగుతుంటే, స్తనద్వయం కదుల్తుంటే, కన్నీరు ధారలుగా కారుతుంటే, దైన్యం పొందిన ఆకారంతో స్వరోచి ఎదుట నిలిచింది. ఆమె వెక్కి-వెక్కి ఏడుస్తున్నది. ఆమెదొక వింత సౌందర్యంలాగా వున్నది. భయపడి దిక్కులు చూస్తూ స్వరోచికి ఒక మాట చెప్తానన్నది. భయపడవద్దని, ఆమె

## మనుచరిత్ర కథ-4

ఎవరని అడగ్గా ఆమె ఇలా చెప్పింది. ఒక రాక్షసుడు తనను చంపడానికి మూడు రోజుల నుండి వెంటాడుతున్నాడని, దిక్కులేని తనను కాపాడమని ప్రార్థించింది. తన తల్లి మరుదశ్వుని కూతురని, తండ్రి ఇందీవరాక్షుడు అనే గంధర్వుడని, తన పేరు మనోరమ అని, తన చెలికత్తెలు కళావతి, విభావసి అని అన్నది. తెలియక చేసిన తప్పు వల్ల ముని శాపానికి ముగ్గురం గురయ్యామని చెప్పింది. రాక్షసుడి వల్ల శ్రమపడమని తనను ముని శపించాడని అన్నది. తన చెలికత్తెలను క్షయ రోగంతో బాధపడమని శపించినట్లు కూడా చెప్పింది. శాప కారణాన తనను రాక్షసుడు మూడు రోజుల నుండి వెంబడిస్తున్నాడని, తనను మింగుతానని అంటున్నాడని అన్నది.
తనకు అస్త్రహృదయం అనే విద్య వచ్చని, అది తనకు పరమ శివుడు నుండి క్రమాగతంగా వచ్చిందని, అది సకల శత్రు నాశనం చేస్తుందని, యశస్కరమైనదని, దానిని నేర్చుకొని ఆ రాక్షసుడిని చంపమని మనోరమ స్వరోచికి చెప్పింది. ఆ విద్యను నేర్చుకోవడానికి స్వరోచి అంగీకరించడంతో, మనోరమ అస్త్రహృదయాన్ని మిక్కిలి రహస్యంగా ఆయనకు నేర్పింది. ఇంతలో ఆ దానవుడు భయంకరంగా అరుస్తూ స్వరోచిని ఎదుర్కొన్నాడు. స్వరోచి మీద వాడిగల బాణాలను ప్రయోగించాడు. స్వరోచి వాటిని తునాతునకలు చేశాడు. కాసేపు వారిద్దరి మధ్య యుద్ధం జరిగిన తరువాత స్వరోచి ఆగ్నేయబాణాన్ని ప్రయోగించడంతో దాని మంటలు రాక్షసుడి శరీరాన్ని చుట్టుకొన్నాయి. అప్పుడు వాడి రాక్షసాకారం పోయి గంధర్వుడి ఆకారాన్ని దాల్చాడు. విమానాన్ని ఎక్కి ఆకాశమార్గాన కనపడ్డాడు. (మరిన్ని విశేషాలు ముందు)
(వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ ప్రచురించిన మనుచరిత్రము-చతుర్థాశ్వాసం ఆధారంగా)

# కూర'గాయాలు'

కూర'గాయాల' ధరలు చుక్కల్లో చేరి..
గుండె లోతుల్లో దడదడలు పుట్టించె..
పొట్లకాయ రేటు పాములా బుస కొట్టె..
కాకరకాయ రేటు చేదును రుచి చూపె..
సోరకాయ ధరలు పందిరెక్కి నవ్వె..
బీరకాయల వెల చాకులా కాటువేసె..
చిక్కుడును చూస్తేనె చక్కర్లు వచ్చె..
టమాటాను చూడ కండ్లు ఎర్రబడె..
ఆకుకూరల ధరలు అటకెక్కి కూర్చునె..
బెండకాయను తాక జిగురు చేతికందె..
దొండకాయలు నేల విడిచి సాముచేసె..
ఉల్లి ధర మంటకు కంట్లోంచి నీరొచ్చె..
పచ్చి మిర్చి ముట్ట ధరల ఘాటొచ్చె..
కొత్తిమీర కట్టలు కోతులలె చెట్టెక్కె..
ఆలుగడ్డలు అందక మూతి ముడిచె..
క్యారెట్టు ధర విన్న కళ్లు బైర్లు కమ్మె..
పుదీనా వాసన అలిగి దూరం జరిగె..
చారెడు పైసలకు పిరికెడు



కూరగాయలు సంచి పైకానికి జేబు
నిండా కూరగాయలు పేదోడి పొయ్యిలో
పిల్లల గాఢ నిద్రలు కంచంలో చూడ
గొడ్డుకారపు ముద్దలు
కూరగాయల్ని చూసి చికెన్ వెక్కిరించె..
కూరగాయల కొట్లన్ని ఎడారుల్ని
తలపించె !

మధుపాళీ
9949700037

# అమ్మా నాన్నలు



అమ్మా నాన్నలు
అవనిలో ఆది దేవుళ్ళు
రవి - చంద్రుల వలే
అవనికి వారు వెలుగులు
ఆ వెలుగు లోనే
జగతి ఉరుకుల పరుగులు
అమ్మా నాన్నలు అలిగి
ఒకరు ముసుగు కప్పుకుంటె
మనకు గ్రహణం

మరొకరు ముసుగు తీసేవరకు
మనకు చీకటి ఆవరణం
అమ్మా నాన్నల ప్రేమ
అమోఘమైన అమృత మేఘం
నీ అవసరాలకు
ఘనీభవిస్తుంది, ద్రవీభవిస్తుంది
మేఘమథనానికిజి
ఒకరు ఉరుమవుతారు
ఒకరు మెరుపవుతారు
ఉరుములు మెరుపులు
ఎలినినో దెబ్బలకు తట్టుకుని
ప్రేమనంత వర్షం చినుకులు గా
కురిపిస్తారుజి
జగతికి హర్షం కలిగిస్తారు
వారే మన అమ్మా నాన్నలు

పి. బక్కారెడ్డి
9705315250

# మోకాళ్ల నొప్పులు



కలలో కూడా కలుక్కుమనే మోకాళ్లు
తలుచుకుంటే తనువంతా వణుకు
మెట్ల అంటే చిట్లే మొఖము
చెప్పుకుంటే పోయే సిగ్గు
పాత తలుపు తీసినట్లు ఒకటే కిటకిట
ఇసురాయిలో ఇసుకేసి ఇసిరినట్టు
కూసుంటే కిరుకిరే లేస్తే కిరుకిరే
ఒక పట్టాన సాగదు తోవ
జయింట్లు పోయిందని ఒకడు
ఆయిల్ గ్రీస్ పెట్టమని మరొకడు
ముఖం మీదనే మోటు సరసం

మోమాటానికి ఏడవలేక నవ్వడం
ఇట్లేందుకయ్యే అంటూ ఆలోచిస్తే
కల్తీ గాసం, మందులకూడు
ఉసురుమనే ఊబకాయం
పానం బట్టము, పనికి రాము
పరేషాను కు బీపీ షుగర్లు
వైద్యోః నారాయణ హరి అంటే
ఇదంతా ఇయ్యాలరేపు మామూలే
అంటడు
ఈ నొప్పులతో పడలేకున్నంటే
చింతెందుకు ఆపరేషనుందటడు
బతుకుబారం మోసి మోసి
కాళ్లచెప్పులు అరిగినట్లు
గంధం చెక్కలోలె మోకాళ్లరిగినవి
భరించలేని బాధ కలుగుతున్న
బతుకు నావ ఓ ఒడ్డు చేరినందుకు
ఒకింత గర్వంగానే ఉంటుంటది

డా. ఎడ్ల కల్లేశ్
9866765126

# ప్రేమంటే

ప్రేమంటే...
మనిషికి దేవుడిచ్చిన బహుమానం
మనిషిని మనిషిని బంధించే మంత్రం
కలిమిలో లేమిలో కలిసి ఉండే భాగ్యం
ఎదుటి వ్యక్తిని సంస్కరించే ఆదర్శం
నవమాసాలు మోసి కన్నబిడ్డపై తల్లి
ప్రేమ
బిడ్డ పోషణకొరకు పగలుపగలు రాత్రి
కష్టపడే తండ్రి ప్రేమ
కష్టంలో నష్టంలో నేను ఉన్నాననే
స్నేహితుని ప్రేమ
ఒకే కొమ్మకు పూచిన పూలలాగ
సోహొదర ప్రేమ
కుటుంబమనే కుటీరంలో వెదజల్లబడిన
ప్రేమ
ఎన్నో ప్రేమకథలు
రోజు క్రొత్తగా పుడుతూనే ఉంటాయి
ఆరంభం ఎక్కడో
అంతం ఎక్కడో
కొన్ని ప్రేమలు తాత్కాలికం
కొన్ని ప్రేమలు స్వార్థపూరితం
కొన్ని ప్రేమలు అజరామరం
కొన్ని ప్రేమలకు కాలంతో లేదు

సంబంధం
నీవు చంద్రునివి
నేను వెన్నెల
నీవు ఒంటరి బాటసారి
నేను నీ మజిలీ
నీవు మేఘం
నేను మెరుపు
నీవు సరోవరం
నేను తామర పుష్పం
నీవు విరబూసిన వనం
నేను పురివిప్పిన మయూరం
నీవు నరుడు
నేను నారి
నీవు ఒక సగం
నేను ఒక సగం
జగానికి నిండుదనం
ప్రేమ ఒక్కరోజుకు కాదు పరిమితం
మనసు ఉంటే రోజు జరుపుకుందాం
ప్రేమ పండుగ

అరుణ డేనియల్
9000606889


# సుపరిపాలన!

స్వతంత్రం వచ్చేక ఏదో సాధించాలని
అక్కడక్కడే తిరుగాడుతున్నాం..
ఎలక్షన్లు వస్తున్నాయి పోతున్నాయి
అన్ని దార్లూ మూసుకుపోతున్నా
తెరమీద సుపరిపాలనే తెల్లగా పొద్దు
పొడుస్తోంది..!
అగమ్యగోచర చీకట్లు చీలిపోయి
నిజమే నవోదయమై వెలుగుతూ
నిట్టనిలువుగా నిలబడి చూస్తోంది..!
అధికారానికి దగ్గర దారంటూ మృగ్యం
కష్టం, అవినీతి రాహిత్యాలు తప్ప
ప్రజల మనసుల్లో చోటు దక్కించుకొనే
కిటుకులు జిమ్మిక్కులు చిట్కాలు లేనే
లేవు వున్నాయనుకొన్న వాళ్ళు లేకుండా
పోయిన చరిత్ర మన కళ్ళముందే
రెపరెపలాడుతోంది కూడా!
దేహం కాదు దేశం అన్న కామరాజ్
నాడార్
చిరిగిన చొక్కా తొడిగినా పర్లేదు
అవినీతిని అంటనివ్వని ప్రకాశం

పంతులు
ఏ వైరుధ్యాలు లేని నవభారతమే
నా దేవళం అన్న అంబేద్కర్
లాంటి నాయకుల ఫోటోలు కాదు
జీవిత చరిత్రలు వల్లె వేసే
పాఠ్యలయాలు
కావాలి రాజకీయ పార్టీల
కార్యాలయాలు..
ప్రజా సంక్షేమం అంటే ప్రజలతోనే
మమేకమై రాజ్యాన్ని అభివృద్ధి దిశగా
నడిపించుకు తీసికెళ్లే పురోగామిక శక్తి
తప్ప ఇంకోటి కానే కాదు!
పేదవాడికి బ్రతుకు తెరువుగా చేపల
వల ఇవ్వాలి...రోజూ చేపల కూర
వండి పెట్టటం సాధ్యం కాదు గదా?
అభివృద్ధి సంక్షేమం అంటే అందర్నీ
అందులో భాగస్వామ్యుల్ని చేయడమే!

- భీమవరపు పురుషోత్తమ్
9949800253

# జీవనతాత్వికతను వొంపిన కవిత్వం




మనిషి జీవితం ఎన్నెన్నో పార్శ్వాలలో దోబూచులాడుతూ వుంటుంది. వాటిలో కొన్ని వడగాడ్పులై మనల్ని తాకుతూ అనంత దుఃఖానికి లోను చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తే మరికొన్ని మలయపవనాల్లా స్పృశిస్తూ పూలసుగంధాలతో మనల్ని మురిపిస్తుంటాయి. ఇంకొన్ని పార్శ్వాలు అంతుపట్టని రహస్యాలై మనల్ని ఆటపట్టిస్తుంటాయి. ఈ పార్శ్వాలన్నింటినీ వొడిసిపట్టుకొని 'జన్మించడమే కవిత్వం' కవితాసంపుటిగా ప్రవహింపజేసింది వర్తమాన కవయిత్రి శైలజామిత్ర. చీకటి ఆవహించిన రాత్రి వంటి నిశ్శబ్ద తరంగాల హోరులో వెన్నెలంత జీవనతాత్వికతను ఈ కవిత్వం హృదయాల్లోకి వొంపుతుంది. జీవించడమనే ప్రయాణంలో మనిషితనాన్ని కోల్పోయే జీవితాలపై ఎన్నో ప్రశ్నలను సంధిస్తుంది. మనిషి తనకు తాను ఎలా మలచుకోవాలో చెబుతుంది. ఇదివరకే 8 కవితాసంపుటాలు, ఒక దీర్ఘకవిత వెలువరించిన ఈ కవయిత్రికి ఇది పదవ కవితాసంపుటి. ఉన్న జన్మతోనే మనిషి జన్మకు సార్థకం చేకూరదు. తాత్విక చింతనతో మనిషి మళ్లీ మళ్లీ అనేకసార్లు మనిషిగా జన్మిస్తూ వుండేలా చేయడమే కవిత్వ పరమావధి, అదే దాని విధి. పరాకాష్టకు చేరుకునే పదాల్లో, బరువెక్కిపోయి కలవరపడే భావాల్లో జీవితాన్ని దర్శించే ఈ కవయిత్రి ఆ జీవితాన్ని కవిత్వంగా మలచుకుంది. అందుకే ఆమెకు జన్మించడమే కవిత్వమైంది. శూన్యంలోకి వెళ్లిపోయిన తన చూపుల్ని గమనించి తాను ఇష్టపడే రంగుల్ని పదేపదే చూపించే పిట్టలాంటి జ్ఞాపకం, వాస్తవం కనిపించని సన్నివేశాల మధ్య సాగే ప్రేమలోని వింత బంధాలు, మనిషి ఉనికికి ఆనవాళ్లైపోతున్న రాలిపోతున్న సంస్కారాలు, కంచిపట్టు కన్నీళ్లను ధారాపాతంగా కురిపించే ఎప్పటికీ అంతుతేలని మదపుటేనుగుల మనసులేని ఆకలి బీభత్సం. కరడుకట్టిన కాటుకమచ్చలు, వొట్టిపోయిన అన్యాయపు ఆనవాళ్లు తన వంటిని స్వేదబిందువులై తడిపేస్తుంటే రేపటి చరిత్రను లిఖించే తెగింపురంగులు, మనిషి నిరంతర యాంత్రిక శోభల జీవనచిత్రం, భరించలేని ఒంటరితనం, కనుమరుగవుతున్న సున్నితత్వం, బతుకు నేర్పని బోలాతనం కలగలిసిన మానసిక నగ్నత్వం నుంచి పుట్టే యుద్ధం, మనిషిని మనిషిగా చూడలేని వైకల్యం, ఒకరి కోసం ఒకరం అంటూనే తనకోసం కూడా బతకలేని పరాయితనం, ఎవరెప్పుడు గొడ్డలిగా మారినా, ఎవరెప్పుడు బుసలు కొట్టే త్రాచులా మీద పడినా ముక్కలైన తన ఉనికిని సైతం స్వర్ణంలా అందించే మనసున్న మఱ్ఱివృక్షం... ఇవన్నీ ఈ కవిత్వానికి వస్తువులయ్యాయి. జీవితాన్ని వేధించే, శాసించే, ఆనందిపజేసే పలు సంఘటనలూ, సందర్భాలూ ఈ కవిత్వంలో పదచిత్రాలైపోయాయి. మనిషి మనిషికీ మధ్య ఆత్మీయత రానురానూ ఎంత కృత్రిమమైపోతోందో విడమరచి చెబుతుంది కవిత్వం 'నా చుట్టూ ఎంతమంది పరిమళభరిత మాటల మాలలు చదుతున్నా/కృత్రిమమైన ఆ వాసన తాలూకు ఘాటు తట్టుకోలేక/నా గుండె కాస్తంత వేగంగా కొట్టుకుంది'(వెదుకులాట) అంటూ. అనుబంధాల్లోని తరాల తారతమ్యాల్ని ఈ కవిత్వం ఎత్తిచూపుతుంది. 'నేను కన్నీరు పెడితే అమ్మ చీరకొంగు ఓదార్చితే/నేను పాప కన్నీరుకే అర్థం తెలుసుకోలేని రూపాయిగా మారాను(అమ్మకూ నాకూ పెద్ద తేడాలేదు) అంటూ అమ్మను తలుచుకుంటూ కవయిత్రి రెండు తరాల అనుబంధాల్లోని తారతమ్యాల్ని సూచిస్తుంది. అలాగే నాన్నను తలుచుకుంటూ మరోచోట అంటుందిలా.... 'నువ్వు ఏనాడైతే నన్ను వదలివెళ్లి/ నా కన్నీటిబిందువులో చేరిపోయావో/ఆరోజు నుంచే ఎవరికీ ఏమీ కానట్టు సాగిపోతోంది ఇంటినావ/నావ కదలాలంటే నవ్వులు అక్కర్లేదు/చేతుల్లో నువ్వులుంటే చాలని/జీవితం సగానికి పైగా గడిచిన తర్వాత నాకు అర్థమవుతున్నావు'(ఇప్పుడిప్పుడే నాకు అర్థం అవుతున్నావు) నాన్న లేకపోవడంలోని బరువైన బాధను ధ్వనింపజేస్తున్నాయీ కవితాపాదాలు. స్త్రీ జీవితంలోని పలుపార్శ్వాల్ని ఈ కవిత్వం పరామర్శించింది. ఆ పార్శ్వాల్లోని దుఃఖపు పోరల్ని అక్షరీకరించింది. పితృస్వామ్య వ్యవస్థ శాసించే భ్రూణహత్యలపై స్పందించిందిలా.... 'నిజంగా రెండు హృదయాలుంటే/పిండదశలోనే నిర్జీవులయిపోతున్న/స్త్రీశిశువుల కోసం ఒక హృదయం దాచేది/ రెండు శరీరాల వారధిపై ముక్కలవుతూ/తనని భరించలేకున్న నేలపై వాలి ఎంతని రోదిస్తుంది'%% ఒక స్త్రీ హృదయవేదన పరాకాష్టనందుకున్న సందర్భమిది. 'లాలించి పాలించినా/అందరి అలుపులు తీర్చినా/ బాధలవెంట పరుగులు తీసినా/రక్తసంబంధాలు కూడా రక్తపరీక్షలు నిర్వహిస్తుంటే/ఏమీచేయలేక, తనకుంటూ ఏమీలేక/కట్టకడపట వరకూ అన్నీ కడుపులో దాచుకొని/మళ్లీ మళ్లీ నీకోసం మొలకెత్తే ఆమె ఎక్కడున్నా అందరికీ బంగారు తల్లే(బంగారు తల్లి)... ఒక స్త్రీమూర్తికి అద్భుత కవిత్వీకరణ ఇది. మహిళాదినోత్సవం సందర్భంగా కవయిత్రి కలం నుచి వెలువడిన 'పలకరింపుల పంజరాలలో/ పంచదార చిలకను చేతిలో వుంచి/కనువిందు చేసే కాగితపు రెక్కల్ని అతికిస్తారు/ఎగరబోయేంతలో పరదాల చాటుకు లాక్కెళతారు'(బంగారుతల్లి) అనే కవితాపాదాలు పురుషస్వామ్య వ్యవస్థలోని లొసుగుల్ని ఎత్తిచూపుతాయి. గడిచిపోయే కాలగమనాన్నీ, ఆ కాలగమనంలో మనిషి పాటించవలసిన జాగ్రత్తల్నీ ఏకరువు పెడుతుంది ఈ కవిత్వం. 'ప్రతి మనిషి గుండె ఒక తాజ్ మహల్/ప్రతి మనిషి చేతల్లోనూ ఒక వివేకానందుడు ఉన్నప్పుడు/ కొత్తగా సముద్రఘోషలెందుకు?/నదుల పరవళ్లు ఎందుకు'(నేనెవరు) అంటూ మనిషికి దిశానిర్దేశం చేస్తూ తమను తామే మలచుకునే మనుషుల్లోనే సముద్రాల్నీ, నదుల్నీ దర్శిస్తుంది. 'ఇప్పుడు శత్రువుల్ని వెదికే పనిలేదు/ ఆయుధాలను చేతపట్టుకునే పని అసలే లేదు/అవేవీ కనిపించకుండా వుండడానికి ఎన్నో జాగ్రత్తలతో మనం/ అశిక్షిత హస్తాలలో నిర్లక్ష్యంగా తిరుగుతుందని భావిస్తుంటాం/స్వచ్ఛత ఎలా కనుమరుగైందో మీరెప్పుడైనా గమనించారా?/మనకే తెలియకుండా బ్రతుకుతెరువుకు తాకట్టు పెట్టాం'(సు'భిక్ష'ప్రపంచం) అంటూ బ్రతుకుతెరువు కోసం మనిషి పడే ఆరాటంలో, మనిషి చేసే పోరాటంలో ఎన్ని అపశ్రుతులు దొర్లుతుంటాయో చెబుతుంది. 'ఒక్కో క్షణమూ/నీలో ప్రవహించే ప్రతి ఆశకూ/ఆశయం తోడవుతే/ప్రాణవాయువు పరమాణువై ప్రణమిల్లుతుంది'(సమస్యలు ప్రవహించనీ) అంటూ ప్రవహించే సమస్యలు, సంధించే సంఘర్షణల మధ్య మనిషిని కర్తవ్యోన్ముఖుడిని చేస్తుంది. 'ఒకప్పుడు అడవి బాటను మింగేసేది/ఇప్పుడు బాట కోసం అడవిని మింగేస్తున్నాము'(వేల్లాడే వేయిపడగలు) అంటూ మనిషి చేసే పర్యావరణ విధ్వంసాన్ని గుర్తుచేస్తుంది. 'నవ్వు ఒక శబ్దంలానే మిగిలిపోతుంటుంది/దుఃఖం మౌనమై ఒకవారగా చతికిలపడుతుంది/నేస్తమా! ఆ కనిపించే సమాధులను చూడు/వాటిని మించిన సమాధానం ఏమైనా వుంటుందా?'(వాస్తవానికి ముందు) అంటూ సమాధుల్లో జీవనతాత్వికతను దర్శిస్తుంది. కవిత్వపు కాంతుల్లో జీవితాన్ని సౌందర్యవంతం చేసుకోవాలని ఈ కవయిత్రి తపిస్తుంది. 'ఇప్పుడు వెలుతురుతో పనిలేదు/అలవాటైన చీకటి చిటికెడు చాలు/నాలోని అనంతమైన ప్రేమను/కవిత్వకాంతులలో అలంకరించుకుంటూ/అక్షరజ్యోతుల్ని వెలిగించుకుంటూ'(కవిత్వకాంతుల్లో) అంటూ జీవితంలోని ప్రేమతత్వాన్ని కవిత్వంతో సంలీనం చేస్తుంది. 'కాటికాపరి ఎంత దర్జాగా బతికినా తన స్థానం స్మశానమే/కన్నతల్లిదండ్రులు ఎంత ప్రేమను పంచినా/వారిస్థానం శూన్యంలోనే'(సమూహవాసి) వంటి ప్రతీకాత్మక పదచిత్రాలూ, 'లోతైన సముద్రంలోకి ఎండ ఎంత మృదువుగా ప్రవేశిస్తుందో/అంతకంటే ఎక్కువగా నాలోని అనుభవాలు అసాంతం జ్ఞాపకాలై చుట్టుముడతాయి'(కాలగమనం) వంటి అభివ్యక్తీకరణలూ మనల్ని ముప్పిరిగొంటాయి. మనిషితనానికి మెరుగులు పెట్టే జీవన మాధుర్యాల్ని వొలికించే తాత్వికతను అలవకగా వొంపిన కవితాసంపుటి 'జన్మించడమే కవిత్వం'.

జన్మిచడమే కవిత్వం
(శైలజామిత్ర కవితాసంపుటి)
పుటలు 214, వెల రూ.175
: 9290900879

- డాక్టర్ కొత్వాలు అమరేంద్ర
9177732414

# భాష పై పట్టు కోల్పోతున్న నేటి యువత

పొరపాటు ఆంగ్ల భాషతో అగచాట్లు మానవుడు అనాగరిక దశ నుంచి నాగరికుడిగా రూపాంతరం చెందడంలో ానవుడు సృష్టించిన భాష కీలక పాత్ర పోషించిందనడంలో సందేహం లేదు. మానవులు తమ ఆలోచనలను, భావవేశాలను సంజ్ఞలు ద్వారా వ్యక్తీకరించే దశ నుంచి ఒక భాష ద్వారా వ్యక్తపరచుకునే పరిపక్వతను సాధించిన తరువాత, మానవుల మధ్య సంబంధాలు మెరుగుపడి వారి అభివృద్ధి మొదలైంది. భాష మానవజాతి యొక్క గొప్ప ఆవిష్కరణ. ప్రపంచంలోని ప్రతి మనిషి తన ఆలోచనలను ఇతరులకు తెలియజేయడానికి మరియు ఇతరుల ఆలోచనలను తెలుసుకోవడానికి ఉపయోగించే మాధ్యమమే ఈ నుడి అంటే భాషే. భాషకు లిపి, భాషాసూత్రలు, వ్యాకరణం, సాహిత్యం ముఖ్యమైన అంశాలు. ప్రపంచంలోని మానవ భాషల సంఖ్య సుమారు 7000 వరకు ఉండవచ్చని ఒక అంచనా. మన భారతదేశంలో 3,372 భాషలు మాట్లాడేవారున్నారని కొన్ని సర్వేలు చెబుతున్నాయి. ప్రపంచంలో ఇన్ని భాషలు మాట్లాడే దేశం కానరాదంటే అతిశయోక్తి కాదు. భాష ఒక దివ్య సృష్టి మనిషి మనసులోని భావాలను ఎదుటివారికి అర్థం అయ్యేటట్టుగా మాటల రూపంలో చెప్పడానికి అలాగే ఎదుటివారి భావాలను మాటల రూపంలో విని అర్థం చేసుకోవడానికి భాష ఉపయోగపడుతుంది. ఒక విషయం మాట్లాడడానికి, చదవడానికి, వ్రాయడానికి మరియు వినడానికి భాష అనేది చాలా ప్రధానం. భాష తెలిసి ఉండడం వలన ఒక విషయం గురించి కూలంకషంగా అధ్యయనం చేయవచ్చును. సైగల ద్వారా మనిషి మనసులోని భావాలను వ్యక్తం చేయడం కూడా ఒక భాషే. యావత్తు ప్రపంచ మానవాళిని అనుసంధానం చేయగల దివ్యమైన సృష్టి ఈ భాష. ఉగ్గుపాల మాతృభాష పుట్టిన బిడ్డ అమ్మ ఒడిలో ఉగ్గుపాలతో పాటు అమ్మ నేర్పే భాషను నేర్చుకుంటుంది. ఉగ్గుపాలతో పాటు అమ్మ నేర్పిన భాషనే మాతృభాష అంటారు. అలాగే, ఆ బిడ్డ ఎదిగే కొద్ది తన చుట్టూ ఉన్న ప్రపంచంతో తన ఆలోచనలను అనుసంధానం చేసుకొని అభివృద్ధిని సాధించడానికి అవసరమైన ప్రామాణిక భాషలను నేర్చుకోవలసిన ఆవశ్యకత ఉంటుంది. ఒక వ్యక్తి ఏ భాషనైనా నేర్చుకోవడానికి పునాది మాతృభాషే. అలాంటి మాతృభాషను నేర్చుకునే దశలో పొరపాట్లు జరిగితే ఆ వ్యక్తి మరే ఇతర భాషలోనూ పరిపూర్ణత సాధించలేడని చెప్పడంలో అవాస్తవం లేదు.

**భాష - నాలుగు నైపుణ్యాలు** ఒక భాషను నేర్చుకుని దానిపై పట్టు సాధించడం అంటే ఆ భాషను ఏకాగ్రతతో విని అర్థం చేసుకోగలగడం, వ్యాకరణ మరియు ఉచ్చరణ దోషరహితంగా మాట్లాడగలగడం , చదవగలగడం మరియు వ్రాయగలగడం( ఈ నాలుగు నైపుణ్యాలను అలవాటుగా మార్చుకున్న విద్యార్థి ఏ భాషలో నైనా పట్టు సాధించగలడు. అయితే, నేటి యువతకు ఈ నాలుగు నైపుణ్యాలపై తగినంత తర్ఫీదు అవగాహన లేకపోవడం వల్ల వారు భాషపై పట్టును కోల్పోతున్నారు. నిరంతర సాధన ద్వారానే భాషపై పట్టు సాధ్యమవుతుంది. ప్రపంచీకరణ భాష ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో అర్హతలు ఉన్న వారెవరైనా ప్రపంచంలో ఎక్కడికెళ్లైనా ఉద్యోగాన్ని సంపాదించి హాయిగా జీవించవచ్చు. అయితే నేటి ప్రపంచంతో పోటీ పడాలంటే ప్రపంచంలో సుమారు 60కి పైగా దేశాల్లో 135 కోట్లకు పైగా ప్రజలు మాట్లాడుతున్న "యూనివర్శల్ లాంగ్వేజ్"ఆంగ్ల భాషను ముందుగానే నేర్చుకోవలసిన ఆవశ్యకత ఉంది. ఈ కారణం చేతే విద్యార్థులు ప్రాథమిక విద్య నుంచే ఆంగ్ల మాధ్యమంలో చదువుతూ, మాతృభాషను మొక్కుబడిగా చదువుతున్నారు. కానీ ప్రాథమిక విద్య నుండి డిగ్రీ విద్య వరకు ఆంగ్ల మాధ్యమంలో చదువుకున్నా, విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించకపోగా మాతృభాషపై కూడా పట్టును కోల్పోతున్నారు. భాషతో అగచాట్లు-కారణాలు ప్రాథమిక విద్య నుంచి నేర్చుకుంటున్నా కూడా, ఆంగ్లభాష పై పట్టు సాధించలేక పోవడానికీ మరియు మాతృభాషపై పట్టు కోల్పోవడానికీ అనేక కారణాలున్నాయి. విద్యార్థులు ఈ భాషలకు సంబంధించిన కోర్సులను నేర్చుకునే సమయంలో వాటిని కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత కోసం చదివే కోర్సులుగానే పరిగణించడం ఒక ముఖ్య కారణం. మరో బలమైన కారణం ఏమిటంటే, విద్యార్థులు ప్రాథమిక విద్య నుండి మాతృభాషలో గానీ మరే ఇతర భాషలో గానీ వినడం, మాట్లాడడం, చదవడం మరియు వ్రాయడం వంటి మంచి భాషా సంస్కృతి(కల్చర్ అఫ్ లాంగ్వేజ్) అలవర్చుకోకపోవడం. అలాగే, మనిషి అభివృద్ధికీ భాషకూ మధ్య ఉన్న సహసంబంధాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలాగా వివరించ లేకపోవడం వేరొక కారణం. అంతేకాదు, నేటి యువత మాతృభాషైన తెలుగులో మాట్లాడిన పదాలను తెలుగు అక్షరాల రూపంలో వ్రాయలేకపోతున్నారు. అలాగే, ఆంగ్ల భాషలో ఉచ్చరణ, వ్యాకరణ దోషాలు లేకుండా ధారాళంగా మాట్లాడలేకపోతున్నారు.

(మిగతా వచ్చే వారం)

ననుబోలు రాజశేఖర్, 9885739808

# కళ్లకురిచి కల్తీ మద్యం ఘటన అన్నామలై కుట్ర..

చెన్నై : తమిళనాడులోని కళ్లకురిచి జిల్లాలో కల్తీ మద్యం కాటుకు 56 మంది మరణించారు. ఈ ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. తమిళ నాడులో అధికార పార్టీ డీఎంకే, సీఎం స్టాలిన్ నాయకత్వంపై ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. ముఖ్యంగా బీజేపీ, అన్నాడీఎంకే పార్టీలు స్టాలిన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. కోలీవుడ్ యాక్టర్స్ సూర్య, విజయ్, కమల్ హాసన్ వంటివారు ఈ విషాదంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే, సీఎం స్టాలిన్‌పై సర్వత్రా విమర్శలు ఎదుర్కొంటున్న తరుణంలో ఆ పార్టీ నేత కల్తీ మద్యం మరణాలు బీజేపీ కుట్రగా అనుమానించారు. డీఎంకేకి చెందిన ఆర్ఎస్ భారతీ మాట్లాడుతూ కళ్లకురిచి మద్యం మరణాలను అన్నామలై కుట్రగా అభివర్ణించారు. బీజేపీ పాలిత పదుచ్చేరి నుంచి మిథనాల్ తీసుకువచ్చి కల్తీ సారా తయారు చేసినట్లు చెప్పారు. ఈ ఘటన అన్నామలై పథకం ప్రకారం చేసిన కుట్ర అని డీఎంకే నేత వ్యాఖ్యానించారు.తమిళనాడులోని కళ్లకురిచ్చి జిల్లాలో జూన్ 18న కల్తీ మద్యం సేవించి 50 మందికి పైగా మరణాలు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనపై స్టాలిన్ రాజీనామా చేయాలని అన్నామలై డిమాండ్ చేశారు. దీని తర్వాత భారతీ మాట్లాడుతూ.. అన్నామలైపై ఆరోపణలు చేశారు. పుదుచ్చేరిలోని బీజేపీ మంత్రులు, ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డార్జిలింగ్ రైలు ప్రమాదం తర్వాత రైల్వేమంత్రి రాజీనామా చేశారా..? నీట్ వ్యవహారంలో కేంద్రమంత్రి రాజీనామా చేశారా..? 2009లో కల్తీ మద్యం తాగి 137 మంది చనిపోతే నరేంద్ర మోడీ రాజీనామా చేశారా? అని భారతి ప్రశ్నించారు.



# రష్యా బాంబుల వర్షం

• సాయం కోరిన జెలెన్‌స్కీ • భాగస్వామ్య దేశాల మద్దతు అడిగిన ఉక్రెయిన్ • అత్యాధునిక ఆయుధాలను సమకూర్చాలని విజ్ఞప్తి

కీవ్: రష్యా, ఉక్రెయిన్ మధ్య పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. ఉక్రెయిన్‌లో రెండో అతిపెద్ద నగరం ఖార్కీవ్‌పై మాస్కో బాంబులతో విరుచుకుపడిన గంటల వ్యవధిలోనే కీవ్ ప్రతిదాడులకు దిగింది. ఆదివారం రాత్రి ఒకేసారి 30 డ్రోన్లతో దాడులు ప్రారంభించింది. అయితే అప్రమత్తమైన రష్యా దళాలు వాటిని కూల్చివేసినట్లు ఆ దేశ అధికారులు తాజాగా ప్రకటన విడుదల చేశారు.



శనివారం ఖార్కీవ్‌లోని ఓ ఐదంతస్తుల భవనంపై రష్యా చేసిన బాంబుదాడిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దాదాపు 40 మందికి పైగా గాయపడ్డారు. దీంతో రష్యాలోని పశ్చిమ బ్రయాన్స్క్, స్మోలెన్స్క్, లిపెట్స్క్ తదితర ప్రాంతాలపై దాడి చేసేందుకు ఉక్రెయిన్ డ్రోన్‌లను ప్రయోగించింది. అయితే, పసిగట్టిన రష్యా ఆర్మీ వాటిని కూల్చివేసింది.మరోవైపు ఇహోర్ తెరికోవ్ నగరంపై శుక్రవారం రాత్రి రష్యా జరిపిన క్షిపణి దాడిలో ఇద్దరు పౌరులు మృతి చెందగా.. 18 మంది గాయపడ్డారు.

ఈ వరుస దాడుల నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిన్ జెలెన్‌స్కీ ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. భాగస్వామ్య దేశాలన్నీ ఉక్రెయిన్ వైమానిక రక్షణను బలోపేతం చేసుకునేందుకు సహకరించాలని కోరారు. అత్యాధునిక ఆయుధాలను సమకూర్చాలని విజ్ఞప్తిచేశారు.

అమెరికా అందజేయనున్న ఎఫ్-16 విమానాలు నడిపేందుకు వీలుగా త్వరితగతిన పైలట్‌లకు శిక్షణ ఇవ్వాలన్నారు. రష్యాను సమర్థంగా ఎదుర్కొనేందుకు సుదూర లక్ష్యాలను ఛేదించగలిగే ఆయుధాలను వినియోగించాల్సిన అవసరముందని, ఆ దిశగా భాగస్వామ్య దేశాలు సాయం చేయాలన్నారు.

# మణిపుర్ వాసులకు అస్సాం మానవతా సాయం

## రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఆదేశాలు



దిస్పూర్: అస్సాం లో తలదాచుకుంటున్న మణిపుర్ వాసులకు మానవతా సాయం అందించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఆదేశించారు. మణిపుర్‌లోని జిరిబామ్ ప్రాంతంలో జరుగుతున్న ఘర్షణల నుంచి తప్పించుకొని 1700 మంది ప్రజలు అస్సాంలోని కాచర్ జిల్లాలో ఆశ్రయం పొందుతున్నారు. అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం మణిపుర్ నివాసితులకు కావాల్సిన సాయం అందజేయాలని సూచించారు.జిల్లా కమిషనర్ ఝా మాట్లాడుతూ ప్రస్తుతం కాచర్‌లో కుకీ, హ్మార్, నాగా, మైతేయి తెగలకు చెందిన 1,700 మందికి పైగా ప్రజలు ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. జూన్ మొదటి వారంలో జిరిబామ్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల అనంతరం అక్కడి ప్రజలు పెద్ద సంఖ్యలో ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా అస్సాంలో తలదాచుకుంటున్న వారికి మానవతా సహాయాన్ని అందిస్తున్నామని వివరించారు. వీరు ఆశ్రయం పొందడానికి షెల్టర్లు, ఆహారం అందించామన్నారు. ఆయుధాలతో ఎవరూ కాచర్‌లోకి ప్రవేశించకుండా మణిపుర్ సరిహద్దులో భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. గత ఏడాది మే నెలలో మణిపుర్‌లోని కుకీ, మైతేయి తెగల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఇందులో ఇప్పటి వరకు 225 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో చాలా మంది ఇప్పటికీ సహాయ కేంద్రాలలో తలదాచుకుంటున్నారు.

# వరుసగా కుప్పకూలుతున్న వంతెనలు

## ఇప్పటికే పేకమేడలా కూలిపోయిన రెండు బ్రిడ్జిలు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: . తాజాగా తూర్పు చంపారన్ జిల్లాలో నిర్మాణదశలో ఉన్న మరో వంతెన కూలిన ఘటన. పట్నా: బిహార్‌లో వరుసగా వంతెనలు కుప్పకూలుతున్నాయి. ఇప్పటికే రెండు బ్రిడ్జిలు పేకమేడలా కూలిపోగా .. తాజాగా తూర్పు చంపారన్ జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న మరో వంతెన కూలిపోయింది. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. వారం రోజుల వ్యవధిలో ఇది మూడో ఘటన కావడం గమనార్హం. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మోతీహారి ప్రాంతంలో రూ.1.5 కోట్ల వ్యయంతో 16 మీటర్ల వంతెనను నిర్మిస్తున్నారు. నిర్మాణ దశలో ఉన్న ఈ వంతెన కూలిపోవడానికి గల కారణాలు మాత్రం తెలియరాలేదు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన అధికారులు శాఖా పరమైన దర్యాప్తునకు ఆదేశించారు. కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీపక్ కుమార్ సింగ్ తెలిపారు. ఈ వంతెన నిర్మాణానికి గతంలో స్థానికులు అడ్డుపడ్డారు. దీంతో వారే కూల్చేసి ఉంటారా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.గత కొన్నేళ్లుగా వాడుకలో ఉన్న సివాన్ జిల్లాలోని గండక్ కాలువపై నిర్మించిన వంతెన భారీ శబ్దంతో శనివారం కూలిపోయిన సంగతి తెలిసిందే. దాదాపు 40 సంవత్సరాల క్రితం నిర్మించారని, సరైన నిర్వహణ లేకపోవడంతోనే వంతెన కూలిపోయిందని సమాచారం. మరోవైపు అరారియా జిల్లాలో బక్రా నదిపై రూ.కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన ఓ వంతెన ప్రారంభానికి ముందే కుప్పకూలింది. దీనికి గల కారణాలను తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వారం రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలో మూడు వంతెనలు కూలిపోవడంతో అక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ ప్రమాదవశాత్తు కూలిపోయాయా? లేదా?ఎవరైనా కూల్చి వేస్తున్నారా? అనే కోణంలో అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు.

# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

## నామినేటెడ్ పోస్టులు, మంత్రి వర్గ విస్తరణ ,పీసీసీ అధ్యక్షుడి ఎంపిక అంశాలపై అధిష్ఠానంతో చర్చించే అవకాశం



తెలంగాణ బ్యూరోప్రతినిధి : సీఎం రేవంత్ రెడ్డి రేవు ఢిల్లీ వెళ్లనున్నారు. నామినేటెడ్ పోస్టులు, మంత్రి వర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి ఎంపిక వంటి అంశాలపై అధిష్ఠానంతో చర్చించే అవకాశం ఉంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఆశించిన మేరకు ఫలితాలు సాధించకపోవడంతో నామినేటెడ్ పోస్టుల భర్తీని వునస్సమీక్షించాలని అధిష్ఠానం నిర్ణయించినట్టు సమాచారం. సీనియార్టీ ప్రాతిపదికన కాకుండా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పనితీరు ఆధారంగా పోస్టులను భర్తీ చేయాలని పార్టీ పెద్దలు యోచిస్తున్నట్టు తెలిసింది. అలాగే తమతో చర్చించకుండానే నామినేటెడ్ పోస్టులు ప్రకటించారని మంత్రులు, ముఖ్యనేతలు, ఎమ్మె ల్యేలు కొందరు సీఎం రేవంత్ రెడ్డిపై అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల ఆధారంగా వీటిలో మార్పుచేర్పులు ఉంటాయని అధిష్ఠానం అప్పుడు వారికి హామీ ఇచ్చింది. అలాగే మంత్రి పదవులను కూడా ఆశించే వారి సంఖ్య భారీగా ఉండటంతోఈ నేపథ్యంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# తెలంగాణ బీజేపీలో అధ్యక్ష పీఠం ఎవరికి

తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణలో బీజేపీ మంచి ఫలితాలను సాధించిన సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబర్ లో అసెంబ్లీ ఎన్నికల్లో 8 స్థానాలు గెలుచుకున్న బీజేపీ.. తాజాగా జరిగిన లోక్ సభ ఎన్నికల్లోనూ 8 సీట్లు గెలుచుకుని సత్తా చాటింది. ఇంకొన్ని స్థానాల్లో రెండో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా ఉన్న కిషన్ రెడ్డిని కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకోవడంతో పార్టీకి కొత్త అధ్యక్షుడిని నియమించాల్సిన పని పడింది. ఈ నేపథ్యంలో పలువురు ఆశావహులు ఈ పదవిని ఆశిస్తున్నారు. వీరిలో ప్రధానంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్, రేవంత్ రెడ్డిలను ఓడించిన వెంకట రమణారెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి తదితరులు వీరిలో ఉన్నారు. అయితే కేంద్ర మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేశాక కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. ఈటల రాజేందర్ ను ఢిల్లీకి పిలిపించడం హాట్ టాపిక్ గా మారింది. ఈటల రాజేందర్ కు తెలంగాణ బీజేపీ అధ్యక్ష పీఠం ఇవ్వవచ్చనే ప్రచారం జరుగుతోంది. ఆయన ఉప ఎన్నికలతో కలిపి ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో రెండు చోట్ల పోటీచేసిన ఆయన రెండు చోట్లా ఓడిపోయారు. తాజా ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించారు. ఈ నేపథ్యంలో గోషా మహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ కలకలం రేపారు. ఈ మేరకు ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. దేశం, ధర్మం పట్ల అవగాహన ఉన్న వ్యక్తిని బీజేపీ అధ్యక్షుడిగా నియమించాలని ఆయన కోరారు. దీన్ని బట్టి ఈటల రాజేందర్ అభ్యర్థిత్వానికి రాజా సింగ్ సానుకూలంగా లేరని అంటున్నారు. ఈటల 2001 నుంచి టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్)లో కొనసాగారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నుంచి పలుమార్లు ఈటల రాజేందర్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కేసీఆర్ రెండు మంత్రివర్గాల్లో కీలక శాఖలకు మంత్రిగా పనిచేశారు. కేసీఆర్ తో తలెత్తిన విభేదాలతో టీఆర్ఎస్ కు 2021లో రాజీనామా చేశారు. ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసి బీజేపీలో చేరారు, ఉప ఎన్నికలో మరోమారు ఘనవిజయం సాధించారు. ఈటల బీజేపీ ప్రధాన మూల సిద్ధాంతమయిన హిందుత్వకు సరిపోరనేది రాజాసింగ్ ఆంతర్యమని అంటున్నారు. ఎంపీగా గెలుపొందినవారికే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వదలుచుకుంటే దేశం, ధర్మం పట్ల అవగాహన ఉన్న వ్యక్తికి బీజేపీ అధ్యక్ష పదవి ఇవ్వాలని రాజాసింగ్ కోరుతున్నారు. ఆయన ఉద్దేశం నిజామాబాద్ ఎంపీగా రెండోసారి గెలిచిన ధర్మపురి అరవింద్ కు బీజేపీ అధ్యక్ష పీఠం ఇవ్వాలనేదనని అంటున్నారు. మరి ఈ నేపథ్యంలో బీజేపీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే. అధ్యక్ష పదవికి భారీగా ఆశావహులు ఉన్న నేపథ్యంలో బీజేపీ అధిష్టానానికి ఈ వ్యవహారం కత్తిమీద సామే కానుందని అంటున్నారు.



# మంత్రి పొన్నంపై ఆరోపణలు

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే,మీడియా సంస్థలకు లీగల్ నోటీసులు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: రామగుండం ఎన్టీపీసీ నుంచి ఉత్పత్తి అయ్యి, అక్కడి నుంచి తరలిస్తున్న ఫ్లై యాష్ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అక్రమాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆరోపించిన సంగతి తెలిసిందే. ఫ్లై యాష్ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పై నిరాధార ఆరోపణలు చేసిన హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సహా ఓ గ్రూవునకు చెందిన మీడియా సంస్థలపై లీగల్ నోటీసులు పంపారు. బీఆర్ఎస్ కు చెందిన ఓ న్యూస్ ఛానెల్ సహా ఆ సంస్థ ఎండీ జోగినపల్లి సంతోష్ కుమార్, దాని అనుబంధ దినపత్రిక చీఫ్ ఎడిటర్ తిగుళ్ళ కృాఎష్ణమూర్తి, తెలంగాణ పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ లకి లీగల్ నోటీసులు జారీ అయ్యాయి. అడ్వకేట్ ఈటోరు పూర్ణచందర్ రావు ఈ నోటీసులను జారీ చేశారు. ఫ్లై యాష్ అనేది ఎన్టీపీసీ నుండి ఉత్పత్తి అవుతుందని అది వినియోగించుకోవడానికి వీలుండదని వివరించారు. దీనిని టెండర్ల ప్రక్రియ ద్వారా ఉచితంగా సప్లై చేస్తారని.. ఈ ఫ్లై యాష్ ను రోడ్ల నిర్మాణానికి, బ్రిక్స్ తయారీకి ఉపయోగిస్తారని చెప్పారు. ఈ ఫ్లై యాష్ రామగుండం నుండి వివిధ ప్రాంతాలకు వెళ్తుంది. ఈ లారీలలో ఎంత ఫ్లై యాష్ పోతుంది అనేది ఎన్టీపీసీ మాత్రమే చూసుకుంటుందని తెలిపారు. ఫ్లై యాష్ ఎక్కడ లోడింగ్ అవుతుందో అక్కడ అడగాల్సింది పోయి హుజురాబాద్ లో కౌశిక్ రెడ్డి లారీలను ఆపి మంత్రిపై ఆరోపణలు చేశారని నోటీసుల్లో పేర్కొన్నారు. కానీ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆ లారీలు ఓవర్ లోడ్ తో వెళ్తున్నాయని.. ప్రతి లారికి డబ్బులు తీసుకుంటూ పంపిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ పై ఆరోపణలు చేశారు. ఆయన పరువుకు భంగం కలిగేలా నిరాధార ఆరోపణలు చేశారని న్యాయవాది వెల్లడించారు. ఫ్లై యాష్ అనేది రోజుకు వేల మెట్రిక్ టన్నులు వెళ్తుంటాయని అది అధికారులు చూసుకుంటారని పంపిస్తున్న ఎన్టీపీసీ చూసుకుంటుందని అన్నారు. అది టెండర్ ద్వారా ఎవరైతే తీసుకుంటున్నారో వాళ్ళు చూసుకుంటారని అన్నారు. కానీ వ్యక్తిగత కక్షతో రాజకీయంగా ఎదుర్కోలేక మంత్రి పొన్నం ప్రభాకర్ పై చేసిన ఆరోపణలకు గానూ అడ్వకేట్ పూర్ణచందర్ రావు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి లీగల్ నోటీసులు జారీ చేశారని అన్నారు. అది ప్రసారం చేసిన బీఆర్ఎస్ అనుకూల మీడియాలోని ఛానెల్, పత్రికలకు ఈ లీగల్ నోటీసులు పంపించారని చెప్పారు.

# నా దు:ఖాన్ని మీరంతా చూసే ఉంటారు


• వయనాడ్ ప్రజలకు రాహుల్ గాంధీ భావోద్వేగ లేఖ..
• కష్ట సమయాల్లో నాకు అండగా నిలిచారు..
• ప్రియాంకా గాంధీని ఆదరించాలి..

న్యూఢిల్లీ.. : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వయనాడ్ లోక్సభ స్థానాన్ని వదిలిపెట్టిన తర్వాత తొలిసారిగా ఆ ప్రాంత ప్రజలకు లేఖ రాశారు. జూన్ 18న కేరళలోని ఈ లోక్సభ స్థానానికి రాజీనామా చేశారు. ఈ లోక్సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ వయనాడ్, రాయ్బరేలీ ఎంపీ స్థానాల నుంచి పోటీ చేసి భారీ మెజారిటీతో విజయం సాధించారు. అయితే, ఆయన వయనాడ్కి రాజీనామా చేసి, రాయ్బరేలీ నుంచి ఎంపీగా కొనసాగేందుకు మొగ్గు చూపారు. జూన్ 17న తాను చేసిన ప్రకటనను చూపుతూ రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. "నేను మీడియా ముందు నిలబడి నా నిర్ణయం గురించి చెప్పినప్పుడు మీరు నా కళ్లలో దుఃఖాన్ని చూసి ఉంటారు" అని లేఖలో పేర్కొన్నారు. వయనాడ్ ప్రజలు తనకు అనంతమైన ప్రేమ, అప్యాయతను పంచారని, ఐదేళ్ల క్రితం నేను మిమ్మల్ని కలిశానని, ఆ సమయంలో తాను మీకు అపరిచితుడని, అయినా మీరు నన్ను నమ్మి నాకు మద్దతు ఇచ్చారని రాహుల్ గాంధీ అన్నారు. మీరు నాకు ఆశ్రయం, నా ఇల్లు, నా కుటుంబం అని అన్నారు. నేను వేధింపులకు గురైనప్పు మీ ప్రేమ నన్ను రక్షించిందని చెప్పారు.ప్రస్తుతం వయనాడ్ స్థానం నుంచి కాంగ్రెస్ నుంచి ప్రియాంకా గాంధీ పోటీ చేయబోతున్నారు. ఈ విషయాన్ని లేఖలో రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మీకు ప్రాతినిధ్యం వహించేందుకు తన సోదరి ప్రియాంక ఉందని చెప్పారు. మీరు అవకాశం ఇస్తే ఆమె మీకు ఎంపీగా అద్భుతమైన పని చేస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.మీరు నా కుటుంబంలో భాగం మరియు మీలో ప్రతి ఒక్కరికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు.



# 56కి చేరిన కల్తీసారా మృతుల సంఖ్య

## బాధితులను పరామర్శించిన కమల్



తమిళనాడు: తమిళనాట తీవ్ర విషాదాన్ని నింపిన కల్తీ సారా బాధితులకు మక్కల్ నీది మయ్యమ్ అధినేత, హీరో కమల్ హాసన్భ రోసా ఇచ్చారు. కళ్లకురిచ్చి మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్న బాధితులను ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాల్లో ధైర్యం నింపారు.చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. హూచ్ దుర్ఘటనలో మృతుల సంఖ్య 56కి చేరిందని జిల్లా యంత్రాంగం ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. కలెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని నాలుగు వేర్వేరు ఆసుపత్రుల్లో 216 మంది బాధితులు చికిత్స పొందుతున్నారు.

# ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టుకు సీఎం కేజ్రీవాల్

• ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్ అరెస్ట్ • ఇటీవల బెయిల్ మంజూరు చేసిన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు • కేజ్రీవాల్ బెయిల్ పై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ఈడీ • బెయిల్ పై స్టే ఇచ్చిన ఢిల్లీ హైకోర్టు



ఢిల్లీ.... ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ కేసులో ఇటీవల రౌస్ అవెన్యూ కోర్టు సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు బెయిల్ మంజూరు చేయగా, ఆ బెయిల్ ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టు స్టే ఇచ్చిన సంగతి తెలిసిందే.

తాజాగా, ఢిల్లీ హైకోర్టు తీర్పుపై సీఎం కేజ్రీవాల్ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని తన పిటిషన్ లో కోరారు. ఈ పిటిషన్ ను అత్యవసర ప్రాతిపదికన సోమవారం) విచారణ జరపాలని కేజ్రీవాల్ న్యాయవాదులు సుప్రీంకోర్టు రిజిస్ట్రీని కోరనున్నారు.ఢిల్లీ లిక్కర్ స్కాంలో మనీలాండరింగ్ అభియోగాలపై సీఎం అరవింద్ కేజ్రీవాల్ ను ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు మార్చి 21న అరెస్ట్ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వడంతో జైలు నుంచి బయటికి వచ్చిన ఆయన... ఎన్నికలు ముగిశాక మళ్లీ జైలుకు వెళ్లారు. ఇటీవల ఢిల్లోని రౌస్ అవెన్యూ కోర్టు ఆయనకు రూ.1 లక్ష పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేయడంతో, కేజ్రీవాల్ జైలు నుంచి బయటికి వస్తారని అందరూ భావించారు. అయితే, ఈడీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా... కేజ్రీవాల్ బెయిల్ పై ఢిల్లీ హైకోర్టు స్టే విధించడంతో ఆయన విడుదలకు అవాంతరం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే, కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# నేడు తెలంగాణ ఇంటర్ అడ్వాన్స్డ్

# సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు

•సోమవారం మధ్యాహ్నం 2గంటలకు విడుదల చేయనున్న అధికారులు
•ఈ పరీక్షకు దాదాపు దాదాపు నాలుగున్నర లక్షల మంది విద్యార్థుల హాజరు
•ఫెయిలైనవారితో పాటు ఫస్టియర్లో ఇంప్రూవ్మెంట్ కోసం పరీక్ష రాసిన విద్యార్థులు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు రేపు (జూన్ 24న) విడుదల కానున్నాయి. ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ ఫలితాలకు సంబంధించి బోర్డు అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ఇప్పటికే మూల్యాంకాన ప్రక్రియ పూర్తయ్యింది. సాంకేతికపరమైన అంశాలను పరిశీలన సైతం పూర్తవ్వడంతో సోమవారం మధ్యాహ్నం 2గంటలకు విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షకు దాదాపు దాదాపు నాలుగున్నర లక్షల మంది విద్యార్థులు హాజరైనట్లు సమాచారం. వీరిలో పరీక్షల్లో ఫెయిలైనవారితో పాటు ఫస్టియర్లో ఇంప్రూవ్మెంట్ కోసం రాసిన విద్యార్థులూ ఉన్నారు. కాగా తెలంగాణ రాష్ట్రంలో మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఈ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఆయా తేదీల్లో ఉదయం 9 నుంచి 12 వరకు ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు.. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు సెకండియర్ పరీక్షలు నిర్వహించారు. అలాగే జూన్ 4 నుంచి 8వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు.

# చిరంజీవితో బండి సంజయ్ భేటీ

• అన్నయ్యను కలవడం ఎప్పుడూ సంతోషదాయకమేనని వెల్లడి • విద్యార్థి దశ నుంచే తాను చిరంజీవి ఫ్యాన్ అంటూ ట్వీట్ • దేశమంతటా చిరంజీవి అభిమానులు • కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హైదరాబాదులో మెగాస్టార్ చిరంజీవి నివాసానికి విచ్చేశారు. చిరంజీవితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. దీనిపై బండి సంజయ్ సోషల్ మీడియాలో స్పందించారు. "అన్నయ్య మెగాస్టార్ చిరంజీవి గారిని కలవడం ఎప్పుడూ సంతోషదాయకమే. చిరంజీవి వినయశీలి, నా శ్రేయోభిలాషి. నేను విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి ఆయన సినిమాలకు అభిమానిని" అంటూ ట్వీట్ చేశారు. చిరంజీవితో భేటీకి సంబంధించిన ఫొటోలను కూడా బండి సంజయ్ పంచుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి ఇటీవలే కేంద్రం నుంచి పద్మ విభూషణ్ అందుకున్న సంగతి తెలిసిందే. గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన చిరంజీవి... ప్రస్తుతం క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తన ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసిన ఆయన సాంకేతికంగా చూస్తే ఇంకా కాంగ్రెస్ లో కొనసాగుతున్నట్టే లెక్క. ఆయన ఇప్పటివరకు కాంగ్రెస్ కు రాజీనామా చేస్తున్నట్టు ఎక్కడా ప్రకటించకపోవడమే అందుకు కారణం. అయితే ఆయనకు రాజ్యసభ అవకాశం ఇవ్వాలని కేంద్రం పెద్దలు భావిస్తున్నట్టు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఇటీవల కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా చిరంజీవితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇటీవల, ఏపీ మంత్రివర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ సైతం స్వయంగా చిరంజీవి వద్దకు వెళ్లి చేయి పట్టుకుని ముందుకు తీసుకువచ్చారు.





# హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి నోటీసులు

తెలంగాణ బ్యూరో[ప్రతినిధి: రామగుండం ఎన్టీపీసీ నుంచి ఉత్పత్తి అయ్యే ఫ్లై యాష్ తరలింపులో అక్రమాలు అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. లారీల నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ కమిషన్ తీసుకుంటు న్నారని మండిపడ్డారు. ఆ వ్యాఖ్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్గా తీసుకున్నారు. నిరాధార ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి తన లాయర్ ఈటోరు పూర్ణచందర్ రావు తరఫున లీగల్ నోటీసులు పంపించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితోపాటు ఆ వార్త ప్రసారం చేసిన టీ న్యూస్ ఛానెల్కు నోటీసులు అందజేశారు. నమస్తే తెలంగాణ దిన పత్రిక చీఫ్ ఎడిటర్ తిగుళ్ళ కృష్ణమూర్తి , తెలంగాణ పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి లీగల్ నోటీ సులు ఇచ్చారు. ఫ్లై యాష్ ఎన్టీపీసీ నుంచి ఉత్పత్తి అవుతుంది. వినియోగిం చుకోవడానికి వీలుండదు. రోడ్ల నిర్మాణాం, బ్రిక్స్ తయారీకి ఫ్లై యాష్ ఉప యోగిస్తారు. రామగుండం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్తుంది. లారీలలో ఎంత ఫ్లై యష్ వెళ్తుందనే అంశాన్ని ఎన్టీపీసీ చూసుకుంటుంది. ఫ్లై యాష్ ఎక్కడ లోడింగ్ అవుతుందో అక్కడ అడ గాలి. ఆ లారీలను కౌశిక్ హుజురాబాద్లో ఆపి మంత్రి పొన్నం ప్రభాకర్పై ఆరో పణలు చేయడం సరికాదు. ఆ లారీలు ఓవర్ లోడ్తో వెళ్తున్నాయని, ప్రతి లారీ కి డబ్బులు తీసుకుంటూ పంపిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ పై నిరాధా ర ఆరోపణలు చేశారు. రోజుకు వేల మెట్రిక్ టన్నుల ఫ్లై యాష్ వెళ్తుంటుంది. వ్యక్తిగత కక్షతో.. మంత్రి పొన్నం ప్రభాకర్ పై ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి లీగల్ నోటిసులు ఇచ్చాం. అది ప్రసా రం చేసిన టీ న్యూస్ ఛానె ల్, నమస్తే తెలంగాణ దిన పత్రికకు లీగల్ నోటిసులు పంపించాం అని అడ్వకేట్ ఈటోరు పూర్ణచందర్ రావు స్పష్టం చేశారు.

# వానలు వచ్చేస్తున్నాయ్

- తెలుగు రాష్ట్రాలకు చల్ల-చల్లని కూల్ న్యూస్
- ఏపీ, తెలంగాణలో వర్షాలు కురుస్తాయని వెల్లడించిన వాతావరణ శాఖ



తెలంగాణ బ్యూరో[ప్రతినిధిః పేరుకు వర్షాకాలమే, కానీ ఎండలు మండిపోతున్నాయ్. జూన్ నెల ముగుస్తున్నా వాన జాడే కనిపించడం లేదు. ఈ తరుణంలో వాతావరణ శాఖ కూల్ న్యూస్ చెప్పింది.. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనావేసింది.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించింది. ఆదివారం, సోమవారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు అంచనావేశారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి.. తాజాగా అన్ని ప్రాంతాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఏపీలో పార్వతీపురం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని ప్రకటించింది ఐఎండీ.. పార్వతీపురం, అల్లూరి జిల్లాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. అలాగే, తెలంగాణలో కూడా పలు జిల్లాలకు వర్షసూచన చేసింది వాతావరణశాఖ. హన్మకొండ, ములుగు, భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెబుతోంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో కుండపోత వర్షం కురిసింది.

భారీ వర్షానికి సత్తుపల్లి ఓపెన్కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. 15వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, మట్టి తొలగింపు పనులు నిలిచిపోయినట్టు చెప్పారు సింగరేణి అధికారులు.. దాదావు 10 సెంటీమీటర్ల వర్షం కురవడంతో సత్తుపల్లిలో అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలతోపాటు రోడ్లపైనా పెద్దఎత్తున నీరు నిలిచిపోయింది. సత్తుపల్లితోపాటు పెనుబల్లి, కల్లూరు మండలాల్లో కూడా కుండపోత వర్షం కురిసింది. కొమురంభీం జిల్లా కాగజ్నగర్ మండలంలో వర్షం దంచికొట్టింది. వర్షబీభత్సానికి పెద్దవాగుపై నిర్మించిన అందవెల్లి బ్రిడ్జ్ అప్రోచ్ రోడ్ కొట్టుకుపోయింది. పెద్దవాగు ఉప్పొంగడంతో అప్రోచ్ రోడ్ కోతకు గురైంది. దాంతో, కాగజ్నగర్ దహేగాం మండలాల మధ్య 42 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రెండేళ్ల కిందటే ఈ బ్రిడ్జ్ కుంగిపోయింది. గతేడాది భారీ వర్షాలకు బ్రిడ్జ్ పూర్తిగా కుప్పకూలిపోయింది.

వునర్నిర్మాణం ఆలస్యం అవడం ఇప్పుడు అప్రోచ్ రోడ్ కూడా కొట్టుకుపోవడంతో ఈ ఏడాది కూడా వర్షాకాలం తిప్పలు మళ్లీ మొదలయ్యాయ్. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు దంచికొడుతుంటే మరోవైపు వర్షాల లేక.. వరుణ దేవుడు కరుణించాలని పల్లెలు, పట్టణాల్లో పూజలు చేస్తున్నారు జనం. వర్షాలు కురవాలంటూ హన్మకొండలో పోచమ్మతల్లి, కనకదుర్గమ్మకు జలాభిషేకాలు చేశారు మహిళలు. పసువు, గంధం, కుంకుమ, వూలు, వేపాకుతో దేవతలకు పౌర్ణమి వూజలు నిర్వహించారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నిజ్జన రమేష్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: సీఎం రేవంత్ రెడ్డిని తెలంగాణ జన సమితి నాయకులు డాక్టర్ నిజ్జన రమేష్ కలిశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన నిజ్జన రమేష్ తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. విద్యార్థి దశ నుండి సామాజిక స్పృహ గల ఉద్యమకారునిగా కొనసాగిన నిజ్జన రమేష్ తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ విద్యార్థి విభాగంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ప్రొఫెసర్ కోదండరాం తెలంగాణ జన సమితి ప్రారంభించడంతో నిజ్జన రమేష్ టీజేఎస్ లో చేరి పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తున్నారు. ప్రస్తుతం నిజ్జన రమేష్ టీజేఎస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గ నుండి టికెట్ ఆశించినప్పటికీ కాంగ్రెస్ పార్టీతో టీజేఎస్ పొత్తు ఉండడంతో కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ రావు గెలువుకు కృషి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ పార్టీకి టీజేఎస్ అనుబంధంగా కొనసాగుతుంది. అయితే టీజేఎస్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నిజ్జన రమేష్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఎల్లారెడ్డి నియోజకవర్గ సమస్యలపై చర్చించినట్లు సమాచారం. అనంతరం నిజ్జన రమేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం అవిశ్రాంతంగా పోరాటం చేసామని తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమకారులను అణచివేసి ఉద్యమ ద్రోహులకు పెద్దపీట వేసిందని ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో అన్ని వర్గాల ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సీఎం సార్ గళమెత్తండి

- నీట్ లీకేజీపై మైలేజీని వదులుకుంటున్న రేవంత్
- నీట్ను తొలినుంచి గట్టిగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు
- ఆ రాష్ట్రంలో పార్టీలతో సంబంధం లేకుండా వ్యతిరేకిస్తున్న తమిళ తంబీలు
- రాష్ట్ర ఎన్ఎస్యూ వ్యతిరేకిస్తున్నా.. సీఎం మౌనం ఎందుకో




తెలంగాణ బ్యూరో[ప్రతినిధిః దాదావు నెల రోజులుగా నీట్ పరీక్షపై జాతీయ స్థాయిలో రగడ జరుగుతోంది.. వైద్య విద్య ప్రవేశాలకు ఉద్దేశించిన ఈ పరీక్ష ఫలితాలను ఎన్నడూ లేనిది షెడ్యూల్ తేదీ కంటే ముందుగానే విడుదల చేయడం.. అదికూడా ఎన్నికల ఫలితాల రోజు (జూన్ 4)నే విడుదల చేయడంతో అనేక అనుమానాలు వచ్చాయి. దీనికితగ్గట్లే నీట్ పై రోజుకో ఆరోపణ. రోజుకో కొత్త విషయం బయటకు వస్తున్నాయి. ప్రధాని మోదీ మూడో విడత పాలన తొలి రోజుల్లోనే నీట్ లాంటి ఉదంతం చోటుచేసుకుంది. అందులోనూ కేంద్రంలో ఇండియా కూటమి ప్రతిపక్షం బలంగా ఉండగా. నీట్ ను తొలినుంచి గట్టిగా వ్యతిరేకిస్తోంది తమిళనాడు. ఆ రాష్ట్రంలో పార్టీలతో సంబంధం లేకుండా ఇదే విధానం అవలంబిస్తున్నారు. ప్రస్తుత స్టాలిన్ ప్రభుత్వం అయితే మరీనూ..? అనేక రాష్ట్రాల్లో నీట్ గురించి భయాందోళనలు ఉన్నాయి. ఇక తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది. జాతీయ స్థాయిలో నీట్ లీకేజీపై కాంగ్రెస్ అగ్ర నేతలు అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ గట్టిగా ధ్వజమెత్తుతున్నారు. తెలంగాణలో మాత్రం సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా స్పందించలేదు. కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్యూఐ ఆందోళనలు చేపట్టింది. వర్తమాన వ్యవహారాలపై చాలా స్పష్టమైన అవగాహనతో ఉండే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నీట్ పై ప్రెస్ మీట్ పెట్టి పరీక్ష అవకతవకలను కడిగేసి ఉంటే మంచి మైలేజీ వచ్చేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఎందుకనో ఆయన మాత్రం దీనిపై ఫోకస్ పెట్టలేదు. జాతీయ స్థాయిలో తీవ్ర వివాదాస్పదం అవుతున్న అంశాన్ని అందివుచ్చుకుని ప్రజల్లో మరింత ఆదరణ చూరగొనే అవకాశాన్ని చేజేతులా వదులుకున్నారా? అనిపిస్తోంది. మరోవైపు నీట్ లో అవకతవకలపై విచారణకు సీబీఐని ఆదేశించారు. అంటే.. ఇందులో ఎంతోకొంత వివాదం ఉందనే తెలుస్తోంది. మరి ఇప్పటికైనా రేవంత్ నీట్ పై తన నోటితో కేంద్ర ప్రభుత్వాన్ని కడిగేస్తారా?

# శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగిస్తాం

**కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి**



తెలంగాణ బ్యూరో[ప్రతినిధి: శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆర్టికల్ 370 రద్దు కోసం పట్టుపట్టారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి (అన్నారు. ఒకే దేశం ఒకే జెండా ఒకే రాజ్యాంగం ఉండాలని కోరుకున్నారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం వచ్చాక ఆర్టికల్ 370 ని రద్దు చేశారని గుర్తుచేశారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను మోదీ ప్రభుత్వం కొనసాగిస్తుందని కిషన్రెడ్డి పేర్కొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థలు ఉచిత నిర్ణయం పట్ల హర్షం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల తెలంగాణ రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ (టీ.ఎస్.జీ.సీ.పీ.డీ.ఎ) అధ్యక్షులు డాక్టర్ బి. లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి ఎం .పర్వతాలు గౌడ్ హర్షం వ్యక్తం చేశారు .ఈ నిర్ణయంతో కేజీ టూ పీజీ విద్యాసంస్థలు హాస్టల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ఎంతో ప్రయోజకరంగా ఉంటుందన్నారు. విద్యుత్ చెల్లించలేక అనేక ప్రభుత్వ విద్యాసంస్థలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని వారు గుర్తు చేశారు.

ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్తు ఈ నిర్ణయంతో రాష్ట్ర, దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని నిర్ణయం విశాల దృక్పథం గల తెలంగాణ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి తీసుకోవడం హర్షనీయమని వారు పేర్కొన్నారు. రాష్ట్ర విద్య వ్యవస్థ పై ఆయనకున్న మమకారాన్నికి ఈ నిర్ణయం నిదర్శనం వారు అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలు బలోపేతానికి ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు చెప్పారు. ఉచిత విద్యుత్తు ప్రభుత్వ విద్యాసంస్థలు కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి వారు ఈ సందర్భంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# నైపుణ్య అభివృద్ధియే ప్రధానం

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: నైపుణ్యాభి వృద్ధియే అభివృద్ధికి మూలం అవుతుం దని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నుండి భారీ ఆధిక్యంతో గెలిచి ఇటీవల మోడి మంత్రి వర్గంలో కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన బండి సంజయ్కుమార్ని బిజెపి నాయకుడు ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్ కరీంనగర్ లోని బిజెపి ఎంపి కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా, బిజెపి నాయకుడు లాస్య ఇన్ఫోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ ఓరుగంటి వెంకటేశ్వర్లు తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి ఆవశ్యకతపై, మేడ్చల్ మెట్రో రైల్ మరియు తెలంగాణ బిజెపి – 2028 లక్ష్యం గురించి కేంద్ర హోం శాక సహాయ మంత్రి బండి సంజయ్ తో క్లుప్తంగా చర్చించడం జరిగిందని తెలియజేశారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి తో ముందుకు వెళితే అన్ని రంగాల్లో రాణించి అభివృద్ధి చెందవచ్చు అని అన్నారు.

# ఎకో టూరిజం పేరుతో పర్యావరణాన్ని నాశనం చెయ్యొద్దు

- అది భావి తరాలకు ముప్పు రానీయకూడదు
- ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ హెచ్చరిక




తెలంగాణ బ్యూరో ప్రతినిధి; కొద్దిమంది ఆనందం కోసం ఏకో టూరిజం పేరుతో మిగిలిన అడవులను నాశనం చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వం అడవుల్లో ప్రకృతి పర్యాటకం అభివృద్ధి ఆలోచన తక్షణమే మానుకోవాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ విజ్ఞప్తి చేసింది. ప్రకృతికి, వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తామని పర్యావరణ మంత్రి కొండా సురేఖ పేర్కొనడం విడ్డూరంగా ఉందని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు రంగయ్య, గౌరవ అధ్యక్షులు లక్ష్మీనారాయణ తదితరులు ఆదివారం కౌన్సిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా జరిగిన అడవుల విధ్వంసంతో ప్రకృతి సమతుల్యత కోల్పోయి, జీవవైవిధ్యం దెబ్బతిని అనేక వాతావరణ సమస్యలు ఎదురవుతున్నా పట్టించుకోకుండా మరింత నష్టం చేసేలా ఎకో టూరిజానికి వూనుకోవడం అత్యంత బాధాకరమని అన్నారు. ఏకో టూరిజంతో పర్యావరణ విధ్వంసానికి కారణం కావద్దని వారు హెచ్చరించారు. టూరిజం పేరుతో అడవుల్లోకి ద్వారాలు తెరిస్తే ఆపడం ప్రభుత్వ తరం కాదన్నారు. అనేక ప్రభుత్వ వ్యవస్థలున్నా మైదాన ప్రాంతంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ లాంటి వాటి కట్టడి మాటలకే పరిమితం అయ్యిందని , అలాంటిది ఎకో టూరిజం పేరుతో అడవుల్లో జరిగే నష్టాన్ని ఎలా ఆవుతారని వారు సూటిగా ప్రశ్నించారు. ప్రకృతి టూరిజంలో వ్యాపార దృక్పథం మాత్రమే కనిపిస్తుందని, భావితరాలను కాపాడాల్సిన ప్రభుత్వ బాధ్యత కనిపించడం లేదని విమర్శించారు.

# బొగ్గు గనుల వేలం ఆపండి జాతి సంపద కాపాడండి

- ప్రధానమంత్రికి ఆర్ కృష్ణయ్య లేఖ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: దేశంలోని 60 బొగ్గు గనులను వేలం వేయడాన్ని వెంటనే ఆపాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య లేఖ రాశారు. ఈ విషయంపై పార్లమెంట్ లో చర్చిస్తామని అన్నారు. వీటిని సింగరేణి సంస్థకు అప్పచెప్పాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు అలాగే పార్లమెంటు సభ్యులు జోక్యం చేసుకొని బొగ్గు గనుల వేలం ఆపాలని కోరారు. బొగ్గు గనుల వేలం ఆపడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెందాలని తెలిపారు. బొగ్గు గనులను దశలవారీగా వేలం వెయ్యడం వలన జాతి సంపదను ప్రైవేట్ బడా పారిశ్రామికవేత్తల చేతుల్లో పెట్టి చట్టబద్ధంగా దోచుకోవడానికి లైసెన్స్ ఇవ్వడమే అవుతుంది అన్నారు. వేలం వేయడం ప్రైవేటికరణలో కుట్రలో భాగమే అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఇలా ప్రైవేటీకరణ చేయడంతో రాజ్యాంగబద్ధమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఉండవు. అలాగే లక్షలాది ఉద్యోగాలు ఈ కులాలకు దక్కకుండా పోతాయి అన్నారు. బీసీ/ఎస్సీ/ఎస్టీలకు ఉద్యోగాలు తగ్గకూడదని కుట్రలో భాగమే ఈ బొగ్గు గనుల వేలమని ఆర్. కృష్ణయ్య మండి పడ్డారు. రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్రలో భాగమన్నారు. జాతి సంపదను బడా కార్పొరేటర్లకు దారదత్తం చేయడమే అన్నారు.

# శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళులు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: జన సంఘ్(పూర్వ బిజెపి)వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా బిజెపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బిజెపి ఈ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చెన్నమనేని స్రవంతి ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర (సంస్థ గత) ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెన్నమనేని స్రవంతి మాట్లాడుతూ సువిశాలమైన భారతదేశంలో భారతీయ జనతా పార్టీ దేశం కోసం ధర్మం కోసం పనిచేస్తుందని అన్నారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ స్థాపించిన జన సంఘ్ బిజెపిగా మారి నేడు దేశ ప్రజలకు సేవలందిస్తుందని అన్నారు. నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న భారతీయ జనతా పార్టీ మూల కారకులైన జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాలను భారతీయ జనతా పార్టీ కొనసాగిస్తుందన్నారు. బిజెపిలో సనాతన ధర్మాన్ని కాపాడేందుకు పనిచేస్తున్న వారందరూ శ్యాం ప్రసాద్ ముఖర్జీ అడుగు జాడల్లో నడుస్తున్నారని గుర్తు చేశారు. శ్యాం పసాద్ ముఖర్జీ ఆశయాలను ఆచరణలో పెట్టడానికి భారత ప్రధాని మొదలుకొని సామాన్య కార్యకర్త సైతం ఆచరిస్తున్నారని అన్నారు.

# మారుతున్న లెక్కలు..!

- తెలంగాణ కేబినెట్ విస్తరణలో చోటు దక్కేదెవరికి?
- ఆశతో ఎదురుచూస్తున్న ఆశావాహులు
- మంత్రి పదవి ఎవరికి దక్కుతుందోనని ఉత్కంఠ
- ప్రాతినిధ్యం లేని జిల్లాలకు అవకాశం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణ కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధమవుతోంది. ఆ దిశగా సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. జూలై మొదటి వారంలోనే విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు సమాచారం. హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే అడుగు ముందు ఎడనుంది. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. కేబినెట్ విస్తరణతో పాటు నామినేటెడ్ పోస్టుల అంశంపై ఢిల్లీ పెద్దలతో చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. గతేడాది డిసెంబరు 9వ తేదీన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారం చేపట్టింది. ఇదే రోజు హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా సీఎం రేవంత్ రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రస్తుత కేబినెట్ లో 11 మంది మంత్రులు ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిపి ఈ సంఖ్య 12గా ఉంది. మరో ఆరు ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. వీటి కోసం పలువురు నేతలు చాలా రోజులుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ ఏర్పాటు తర్వాత కీలక నేతలకు మంత్రివర్గంలో అవకాశం కల్పించారు. ఆ తర్వాత ఖాళీలను కూడా భర్తీ చేయాలని భావించినప్పటికీ లోక్ సభ ఎన్నికల కోడ్ వచ్చేసింది. దీంతో కాంగ్రెస్ అధినాయకత్వం. ఎన్నికలపై ఫోకస్ పెట్టాల్సి వచ్చింది. ఎన్నికల ఫలితాలు రావటంతో మళ్లీ పాలనపై ఫోకస్ పెట్టింది ప్రభుత్వం. ఇదే సమయంలో పూర్తిస్థాయి కేబినెట్ టీమ్ తో ముందుకెళ్లాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇక నామినేటేడ్ పోస్టులను కూడా భర్తీ చేయాలని యోచిస్తున్నారు.

**కేబినెట్లో చోటు ఎవరికి? :** మంత్రివర్గంలో చోటు కోసం చాలా మంది ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆరు స్థానాలు మాత్రమే ఖాళీ ఉండగా వీటి కోసం చాలా మంది నేతలు రేసులో ఉన్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నుంచి చేరిన ఎమ్మెల్యేలు కూడా వీటిని ఆశిస్తున్నారు. మరికొంతమంది ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ లో చేరే అవకాశం ఉందని తెలుస్తోంది. ఫలితంగా ఆయా జిల్లాల్లో సమీకరణాలు మారిపోతున్నాయి. దీంతో కేబినెట్ లో ఎవరికి చోటు దక్కబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుత కేబినెట్ లో నాలుగు ఉమ్మడి జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించలేదు. విస్తరణలో ఆ నాలుగు జిల్లాలకు కచ్చితంగా చోటు కల్పించాల్సి ఉంటుందన్న చర్చ గట్టిగా వినిపిస్తోంది. ప్రస్తుత మంత్రివర్గంలో రెడ్డి సామాజిక వర్గం నుంచి నలుగురు మంత్రులు ఉన్నారు. బీసీ, ఎస్సీ సామాజికవర్గాల నుంచి ఇద్దరు ఉండగా ఎస్టీ, కమ్మ, వెలమ సామాజికవర్గాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. అయితే విస్తరణలో కూడా సామాజిక సమీకరణాలు కీలకంగా ఉంటాయని తెలుస్తోంది. ప్రస్తుత కేబినెట్ లో ఉమ్మడి నిజామాబాద్ నుంచి ఎవరూ లేరు. అయితే ఇటీవలే బీఆర్ఎస్ కు చెందిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు. దీంతో ఇక్కడ సీన్ మారిపోయింది. కేబినెట్ రేసులో ఆయన కూడా ఉన్నారన్న వార్తలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇదే జిల్లా నుంచి మదన్ మోహన్ తో పాటు సీనియర్ నేత సుదర్శన్ రెడ్డి రేసులో ఉన్నారు. కేబినెట్ లో చోటు కోసం ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి జి. వివేక్, ప్రేమ్ సాగర్ రావు రేసులో ఉన్నారు. వీరిద్దరిలో ఒకరికి మాత్రమే ఛాన్స్ దక్కే అవకాశం ఉంది. ఇక గ్రేటర్ హైదరాబాద్ నుంచి ఒకరికి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధినాయకత్వం భావిస్తోంది. అయితే ఇక్కడ పార్టీ తరవున గెలిచిన ఎమ్మెల్యేలు లేరు. తాజాగా కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలిచి మాత్రమే ఖాతా తెరిచింది. ఇక బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్ పార్టీలో చేరారు. ఆయన సిటీ నుంచి కేబినెట్ బెర్త్ ను కోరుతున్నారు. ఆయనే కాకుండా పలువురు నేతలు కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నారు. మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేకు కేబినెట్ బెర్త్ దక్కే అవకాశం ఉందన్న వార్తలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ కోణంలో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దాదావు ఆయనకు ఖరారయ్యే అవకాశం ఉందంటున్నారు. ఇక ఎస్టీ సామాజికవర్గానికి చెందిన మరో ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో చోటు కల్పించే ఛాన్స్ ఉంది. అయితే ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి పరిగి ఎమ్మెల్యేతో పాటు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవి కోసం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ నేతలు కావటంతో. వీరిలో ఒకరికి ఛాన్స్ దక్కవచ్చున్న టాక్ కూడా వినిపిస్తోంది. ప్రస్తుత కేబినెట్ లో మైనారీవర్గాలకు చెందిన మంత్రి లేరు. దీంతో విస్తరణలో తప్పకుండా మైనార్టీ కోటా నుంచి ఒకరికి ఛాన్స్ దక్కటం ఖాయంగా కనిపిస్తోంది. పీసీసీ చీఫ్ గా బీసీ వర్గానికి చెందిన నేతకు ఇచ్చే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. దీనిపై కూడా త్వరలోనే క్లారిటీ రానుంది.!

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఉపాధ్యాయ సంఘాలు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: సీఎం రేవంత్ రెడ్డిని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గత 15 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న అప్ గ్రెడేషన్ సమస్యను పరిష్కరించడంతో సీఎంకు ఉపాధ్యాయ సంఘాలు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన ఉపాధ్యాయ సంఘాలు.

# పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య కన్నుమూత

తెలంగాణ బ్యూరో[ప్రతినిధిః భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం కూనవరం.. సకిని రామచంద్రయ్య స్వగ్రామం. తల్లిదండ్రులు ముసలయ్య-గంగమ్మ. తాతముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చిన గిరిజన సంప్రదాయ కళను ఓ బాధ్యతగా స్వీకరించారు. పన్నెండేండ్ల వయసులోనే డోలి కళపై మక్కువ పెంచుకొన్నారు. కంచు తాళం, మేళం చేతపట్టి కాళ్లకు గజ్జె కట్టి.. డోలి వాయిస్తూ కోయల వుట్టు వూర్వోత్తరాలను పాటల రూపంలో వివరిస్తారు. తెలుగు, కోయభాషల్లో కథలు చెప్పడంలో పట్టు సాధించారు. డోలు వాయిద్యంతో దైవకార్యాలు, జాతరలు, ఆదివాసీ పండుగలు, వివాహాది శుభకార్యాల వద్ద తన స్వరఝరిని వినిపిస్తూ.. ఆహూతులను ఆనంద డోలికల్లో ముంచెత్తుతారు. తన పాటలు, కథల ద్వారా యాభై ఏండ్లుగా తరతరాల కోయ చరిత్రను, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతున్న చరిత్రకారుడు.. రామచంద్రయ్య. నిరక్షరాస్యుడైనా, కోయ తెగకు సంబంధించిన అనేక కథలు కరతలామలకం. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరైన సమ్మక్క-సారలమ్మతోపాటు గిరికామరాజు, పగిడిద్ద రాజు, రామరాజు, గాడిరాజు, బాపనమ్మ, ముసలమ్మ, నాగులమ్మ, సదలమ్మ మొదలైన ఆదివాసీ యోధుల కథలను రామచంద్రయ్య గానం చేస్తారు. గిరిజన తెగల వుట్టుక, వంశ మూల వురుషుల చరిత్రను కథల రూపంలో చెప్పడం డోలి కళాకారుల వృత్తి. వీరికి ఇంటోళ్లు, నాగ స్తంభం వారనే పేర్లు కూడా ఉన్నాయి. కోయల ఇండ్లలో పండుగలు, ముఖ్య దినాల్లో డోలీల పాత్ర కీలకం. ఇక వివాహాల్లోనైతే.. వీళ్లే పూజారుల పాత్ర పోషిస్తారు.

సూర్య
features@suryaa.com
కలర్స్
LIFE IS A RAINBOW
సూర్య
హైదరాబాద్
సోమవారం
24 జూన్ 2024




# అగ్ర రాజ్యంలో తుపాకుల మోత



■ చెమటలు పట్టిస్తున్న గన్ కల్చర్

■ ఇంకెన్నాళ్లు ఈ పరిస్థితి... అమెరికా ఇక మారదా?

**ఎప్పుడు చూసినా అవే శబ్దాలు..! అదే మోత..! ఎదో క్రైమ్ యాక్షన్ సినిమాలో హీరో ఇష్టం వచ్చినట్లు గన్ను వాడినట్లు అక్కడ నిత్యం గన్ ఉన్మాదులు రెచ్చిపోతూనే ఉన్నారు..! పేరు గొప్ప ఊరు దిబ్బ అంటే ఇదేనేమో..! ప్రపంచానికే పెద్దన్న పాత్ర పోషించే అమెరికాను గన్ కల్చర్ వల్లర్లా పీక్కు తింటోంది. మాస్ షుటింగ్స్‌కు ఏనాడో కేరాఫ్‌గా మారిపోయిన అగ్రరాజ్యం. ఈ విష సంస్కృతి నుంచి బయటపడలేక పోతోంది. మునపటి రోజు నెత్తుటి మరకలు అరకముందే మరో రోజుకి ప్రవేశించాల్సిన దుస్థితి నెలకొంది. గతేడాది జరిగిన టెక్సాస్ పాఠశాల మాస్ షుటింగ్ ఘటనైనా.. తాజాగా 10మంది ప్రాణాలు బలిగొన్న లాస్‌ఏంజెల్స్ మాంటెరీ పార్క్ ఘటనైనా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.**

**అటు అమెరికా గన్ వయలెన్స్ లెక్కలు మరింత భయపెట్టిస్తున్నాయి. చంపడం లేదా చావడం అమెరికాలో ఏ పౌరుడి చేతిలో గన్ ఉన్నా అది పిచ్చోడి చేతిలో రాయి లాగే లెక్క..! అయితే గన్‌తో ఆత్మహత్య చేసుకోవడం లేకపోతే అదే గన్తో ఇతరుల ప్రాణాలను తీయడం అక్కడ మోస్ట్ కామన్ థింగ్..! ప్రపంచంలో అభివృద్ధి చెందిన ఏ దేశంలోనూ లేనంత తుపాకీ హింస అమెరికాలో ఉందని అంతర్జాతీయ రిపోర్టులు చెబుతున్నాయి. అమెరికాలో గన్ కల్చర్‌పై సూర్య ప్రత్యేక కథనం....**



అమెరికాలో గన్కల్చర్ పెట్రేగిపోతోంది. చేతికో తుపాకీ చొప్పున అక్కడ చెలరేగిపోతున్న గన్ కల్చర్ ఎన్నారైల బతుకుల్ని శాసిస్తోంది. తాజాగా ఓ తెలుగు స్టూడెంట్ బతుకు ఇలాగే తెల్లారిపోయింది. అందుకే ఇక్కడ నల్లదొంగలున్నారు జాగ్రత్త అని హెచ్చరిస్తున్నాయి ప్రవాస సంఘాలు. పెద్ద చదువులు, ఖరీదైన కొలువుల కోసం అమెరికా ఫ్లైటెక్కుతున్న వారి ఆశలు ఆవిరైపోతున్నాయి. అక్కడున్న వైట్స్ మీదే కాదు బైటి దేశస్థుల్ని కూడా వదిలిపెట్టడం లేదు బ్లాక్స్. పెచ్చుమీరిపోతున్న తుపాకీ సంస్కృతికి తెలుగు విద్యార్థులు బలైపోతున్నారు. రోజుకు 53 మంది అమెరికా తుపాకి సంస్కృతి బలితీసుకుంటున్న అమాయకుల సంఖ్య ఇది. అగ్రరాజ్యంలో జరిగే హత్యల్లో 79శాతం గన్లు ఉపయోగించి జరుగుతున్నవే. ఈ సంస్కృతి అమెరికాలో ఈ ఏడాదో, గత సంవత్సరమో లేదంటే ఈ పదేళ్ల కాలంలోనో పెరగలేదు. ఐదు దశాబ్దాలపై నుంచి అమెరికాలో గన్ కల్చర్ అదుపుతప్పింది. చిన్న పిల్లలు బొమ్మ తుపాకీలు కొనుక్కున్నంత తేలిగ్గా అక్కడ గన్లు దొరుకుతాయి. అభివృద్ధి చెందిన దేశమంటే ప్రతి ఒక్కరి చేతిలో ఆయుధముండడమన్న భావన అక్కడ పాలకులది. గన్ ఉండడం స్టేటస్ సింబల్గా భావించే మనస్తత్వం ఆ దేశ ప్రజలది. వీటన్నింటి ఫలితమే దేశంలో ప్రతీరోజూ ఎక్కడో చోట జరిగే విచ్చలవిడి కాల్పులు. అమెరికా నేరాలకు ఆయుధాలే అసలు కారణమని 50 ఏళ్ల క్రితం అప్పటి అధ్యక్షుడు లిండన్ బైనెస్ జాన్సన్ ప్రకటించారు. గన్ ఉండడం సహజసిద్ధ పరిణామమనే మన సంస్కృతి ఈ భయంకర పరిణామాలకు కారణమని హెచ్చరించారు. అప్పట్లోనే ఆ దేశంలో ప్రజల దగ్గర 9 కోట్ల ఆయుధాలున్నాయి. ఈ 50 ఏళ్ల కాలంలో వాటి సంఖ్య ఊహించని స్థాయిలో పెరిగింది. అదే సమయంలో ఆ తుపాకులు బలికోరుతున్న ప్రాణాల సంఖ్యా పెరిగింది. కాల్పుల్లో ప్రజలు మరణించడం అక్కడ సర్వసాధారణం.

## కోపం వస్తే... పిట్టను కాల్చినట్లు కాల్చేయడమే

ఇంటిమిటెంట్ ఎక్స్ ప్లోజివ్ డిజార్డర్ అనే మానసిక వ్యాధితో బాధపడేవారు అమెరికాలో ఎక్కువ అవుతున్నారు. వీరికి ఉన్నట్లుండి విపరీతమైన కోపం వస్తుంది. ఆ కోపంలో ఇష్టమొచ్చినట్లు కాల్చిపారేస్తున్నారు. ఆ సమయంలో తన, మన అనే బేధం కూడా చూపించడం లేదు. ఆమధ్య టెక్సాస్ లో 18ఏళ్ల కుర్రాడు తన 18వ పుట్టినరోజు జరుపుకున్న మర్నాడే దుకాణానికి వెళ్లి ఓ తుపాకీ కొన్నాడు. వెంటనే ఫేస్ బుక్ లో తాను ఆ తుపాకీతో స్కూల్ కి వెళ్లి కాలుస్తానని పోస్ట్ పెట్టాడు కూడా. అయితే దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఆ కుర్రాడు తాను కొన్న తుపాకీతో తన నాయనమ్మను కాల్చి చంపి ఆ తర్వాత స్కూల్ కి వెళ్లి పదేళ్ల వయసుండే పిల్లలపై కాల్పులు జరిపాడు. ఈ దుర్ఘటనలో 19 మంది అక్కడి కక్కడే చనిపోయారు.




## యుద్ధం కన్నా గన్ కల్చర్ బలితీసుకున్న వారే ఎక్కువ

1968 నుంచి 2017 మధ్య తుపాకి విష సంస్కృతికి 15 లక్షల మంది అమాయకులు చనిపోయారు. 1775లో అమెరికా స్వాతంత్ర్యం పొందినప్పటి నుంచి ఇప్పటిదాకా అనేక యుద్ధాల్లో మరణించిన అమెరికా సైనికుల సంఖ్య కంటేగన్ కల్చర్ బలితీసుకున్న సాధారణ ప్రజల సంఖ్యే ఎక్కువ. దీన్ని బట్టే ఆయుధానికి అమెరికన్ల జీవితాల్లో ఎంత ప్రాధాన్యముందో అర్థం చేసుకోవచ్చు. 2020లో అయితే ఎన్నడూ లేని విధంగా తుపాకులు హత్యలు, ఆత్మహత్యల రూపంలో 45వేలమంది అమెరికన్ల ఉసురు తీశాయి.

## ప్రతి వంద మంది దగ్గర 120 ఆయుధాలు



2018 నాటికి అమెరికాలో 39కోట్ల ఆయుధాలున్నాయి. గడచిన దశాబ్దకాలంలో ఆయుధాల సంఖ్య మరింత పెరిగింది. 2011 నాటికి ప్రతి వందమంది దగ్గర 88ఆయుధాలుంటే ఇప్పుడు ప్రతి వందమంది దగ్గర 120 ఆయుధాలున్నాయి. ప్రస్తుతం కోటీ 10లక్షల మంది అమెరికా ప్రజల దగ్గర ఆయుధాలున్నాయి. 50ఏళ్ల క్రితమే ఆందోళనకర సమస్యగా ఉన్న గన్కల్చర్ను అగ్రరాజ్యమని చెప్పుకునే అమెరికా ఇప్పటికీ ఎందుకు పరిష్కరించలేకపోయింది..అన్న ప్రశ్నకు సమాధానం ఆయుధం కావాలని అక్కడి మెజార్టీ ప్రజలు కోరుకోవడమే.

## తుపాకులు బొమ్మలు కొన్నంత ఈజీగా...



మన దగ్గర సూపర్ మార్కెట్ల తరహాలోనే అమెరికాలో తుపాకుల దుకాణాలు ఉంటాయి. లైసెన్స్ చూపిస్తే చాలు షాప్లో తుపాకీ అమ్మేస్తారు. ఆ తుపాకీ కూడా పెద్ద ఖరీదేం కాదు. నలుగురు యువకులు ఓ మందు పార్టీకి ఖర్చుపెట్టే సొమ్ముతో ఓ మాంచి తుపాకీ వచ్చేస్తుంది. 18 ఏళ్లు నిండిన వారు ఎవరైనా సరే అమెరికాలో యథేచ్ఛగా తుపాకీ కొనుక్కోవచ్చు. దాన్ని జేబులో పెట్టుకుని తిరగచ్చు. తుపాకీ ఎందుకు కొన్నావ్? జేబులో పెట్టుకుని ఎందుకు తిరుగుతున్నావ్? అని ఎవరూ అడగరు.

## మద్యానికి 21 ఏళ్లు.. తుపాకికి 18 ఏళ్లే

చిత్రం ఏంటంటే అమెరికాలో మద్యం కొనడానికి కనీసం 21 ఏళ్ల వయసు ఉండాలి. కానీ తుపాకీ మాత్రం 18 ఏళ్లు నిండితే చాలు. ఇంత లిబరల్గా తుపాకులు అమ్మేస్తున్నారు. ఒక్క 2020 లోనే అమెరికాలో 26 లక్షల తుపాకులు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. ఇంత విచ్చలవిడిగా తుపాకులు అందుబాటులో ఉండడం వల్లనే అమెరికాలో గన్ కల్చర్ విపరీతంగా పెరిగిపోతోంది.

## బలంగా ఆయుధ వ్యాపారుల లాబీ

తుపాకుల వ్యాపారంలో మునిగి తేలే ఆయుధ వ్యాపారులే అమెరికాని శాసిస్తూ ఉంటారు. ఆయుధ వ్యాపారులకు కోపం తెప్పించే పని చేయడానికి ఏ ప్రభుత్వమూ సాహసించదు. గతంలో తుపాకుల విక్రయాలపై ఆంక్షలు ఉండాల్సిందేనని బారక్ ఒబామా గట్టిగానే అన్నారు. కానీ, రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా ఉన్న ఒబామా ఆపని చేయలేకపోయారు. ఒబామా తర్వాత అధ్యక్షుడైన ట్రంప్ రిపబ్లికన్ పార్టీ నేత కాబట్టి తుపాకులకు సహజంగానే సానుకూలం. ఇవుడు డెమొక్రటిక్ పార్టీ నేత జో బైడెన్ అధ్యక్షుడిగా ఉన్నారు.

## అమెరికాలో కాల్పులు... తెలుగు విద్యార్థి మృతి



అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి తుపాకీ కాల్పులు కలకలం రేపాయి. ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో తెలుగు యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఆంధ్రప్రదేశ్లోని బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజిలి గ్రామానికి చెందిన దాసరి గోపీకృష్ణ ఎంఎస్ చదివేందుకు 8 నెలల క్రితం అమెరికా వెళ్లాడు. ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు ఖర్చుల కోసమని టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్లో ఓ సూపర్ మార్కెట్లో పనిచేస్తున్నాడు. అయితే సూపర్ మార్కెట్లోకి చొరబడిన ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో గోపీకృష్ణ చనిపోయాడు. ఉన్నత చదువుల కోసం అగ్రరాజ్యం అమెరికాకు వెళ్లిన మరో తెలుగు విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. అమెరికాలోని టెక్సాస్లో ఓ సూపర్ మార్కెట్లో జరిగిన దోపిడీ ఘటనలో దొంగ చేతిలో ప్రాణాలు కోల్పోయాడు. చనిపోయిన యువకుణ్ని బాపట్ల జిల్లాకు చెందిన 32 ఏళ్ల దాసరి గోపీకృష్ణగా గుర్తించారు. కుమారుడి మరణవార్త విని ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఘటనపై అమెరికా పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజిలి గ్రామానికి చెందిన గోపీకృష్ణ ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లాడు. గోపీకృష్ణకు పెళ్లై.. ఒక కుమారుడు కూడా ఉన్నారు. అయితే మంచి భవిష్యత్తు కోసం, అవకాశాల కోసం అమెరికాకు వెళ్లి ఎంఎస్ చేయాలని.. ఎనిమిది నెలల కిందట అమెరికాకు వెళ్లాడు. టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్లో సూపర్ మార్కెట్లో పనిచేస్తూనే చదువుకుంటున్నాడు. అయితే శనివారం మధ్యాహ్నం ఓ దుండుగుడు గోపీకృష్ణ పనిచేస్తున్న సూపర్ మార్కెట్లోకి చొరబడ్డాడు. వస్తూ వస్తూనే కౌంటర్లో ఉన్న గోపీకృష్ణపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో గోపీకృష్ణ తీవ్రగాయాలై కిందపడిపోగా దుండుగుడు షాపులోని వస్తువులు దోచుకెళ్లాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు సూపర్ మార్కెట్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. అనంతరం తీవ్ర గాయాలైన గోపీకృష్ణను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశాడు. గోపీకృష్ణ మృతితో యాజిలిలోని అతని కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. అమెరికాకు వెళ్లి మంచి చదువులు చదివితే గొప్పగా స్థిరపడవచ్చని భావించాడని.. కానీ ఇలా తమను వదిలేసి వెళ్లిపోతాడని ఊహించలేదని ఆ కుటుంబం గుండెలు పగిలేలా రోదిస్తోంది.

## పాలకుల నిర్లక్ష్యమే శాపం..!




తుపాకుల విక్రయంలోనూ అమెరికాకు దరిదావుల్లో మరో దేశం లేదు. ఈ మొత్తం వ్యవహారంలో పాలకుల నిర్లక్ష్యమే అతి పెద్ద విలన్ అంటున్నారు మేధావులు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరచి తుపాకీల వ్యాపారంపైనా, వాటి వినియోగంపైనా ఉక్కుపాదం మోపకపోతే అమాయక బాల్యం తుపాకీ కాల్పుల్లో కాలిపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. తుపాకి ఉంటేనే భద్రత ఉందని ఆ దేశ ప్రజలు అనుకోవడమే. గన్ కల్చర్తో ఇంత విధ్వంసం జరుగుతోందని తెలిసినా ప్రజలు ఆయుధాన్ని దగ్గర ఉంచుకోవాలన్న ఆలోచన మానుకోవడం లేదు. తుపాకి సంస్కృతి విషయంలో కఠిన నిబంధనలుండాలని 52శాతం ప్రజలు కోరుకుంటుండగా, 35శాతం ప్రజలు ప్రస్తుత పరిస్థితే కొనసాగాలనుకుంటున్నారు. డెమోక్రట్లు 91శాతం కఠిన నిబంధనలుండాలంటున్నపటికి వాటికి మద్దతిస్తున్న రిపబ్లికన్ల సంఖ్య 24శాతంగానే ఉంది. ఫలితంగా ఎలాంటి చట్టాలూ రూపొందించుకోవడం లేదు. టెక్సాస్ విషాదంపై మాట్లాడుతూ అధ్యక్షుడు బైడన్ ఇంత నీచసంస్కృతి ఏ దేశంలోనూ లేదని వ్యాఖ్యానించడానికి కారణమిదే

## అలర్ట్‌గా ఉండాలని ఎన్నారై సంఘాల హెచ్చరికలు

అమెరికాలో సిగిరెట్ పాకెట్ కొన్నంత ఈజీగా తుపాకీ కొనెయ్యొచ్చు. ఆత్మరక్షణ కోసం వాడాల్సిన గన్ని దోపిడీలకు, హత్యలకు వాడేయ్యడం వాళ్ల అలవాటుగా మారిపోయింది. విచ్చలవిడిగా పెరిగిన తుపాకుల వినియోగంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు అమెరికన్లు. ఆర్థిక మాంద్యం ముంచుకొస్తోందన్న వార్తలతో అగ్రరాజ్యంలో ఇటువంటి అఘాయిత్యాలు ఇంకా పెరిగే ప్రమాదముంది. అందుకే అక్కడున్న తెలుగు విద్యార్థులు, ఉద్యోగులు అలర్టా ఉండాలని హెచ్చరిస్తున్నాయి ఎన్నారై సంఘాలు.

అమెరికాలో గన్ కల్చర్ విస్తరించడానికి మరో ప్రధాన కారణం అక్కడ జాతీయ రైఫిల్ అసోసియేషన్ అత్యంత బలంగా ఉండడమే. ఈ అసోసియేషన్ లాబీయింగ్తో కాంగ్రెస్ సభ్యులను ప్రభావితం చేస్తూ కఠిన నిబంధనలు రూపొందించకుండా జాగ్రత్త పడుతోంది. గన్ కల్చర్తో తాను విసిగిపోయానని, ఇప్పటికైనామనం స్పందించాలని అమెరికా అధ్యక్షుడు నిస్సహాయంగా అర్థించడం గమనిస్తే పార్టీలకతీతంగా తపాకీ దేశంపై ఎలా పట్టుసాధించిందో స్పష్టమైపోతోంది. గన్ కల్చర్ వలన కలిగే నష్టం గురించి ప్రజలలో అవగాహన కలిగినవుడు మాత్రమే గన్ కల్చర్ ను నియంత్రించగలమని అప్పటి వరకూ ఇప్పటి పరిస్థితి ఇలానే కొనసాగుతుందని తుపాకీ నియంత్రణ స్వచ్ఛంద సంస్థలు అంటున్నాయి.




విద్య వెంకట్ తెలంగాణ బ్యూరో 9391618181



## భారత బ్యాటర్లు అద్భుత ప్రదర్శన కనబర్చారు... అందుకే ఓడాం

భారత్ను తక్కువ స్కోర్కు కట్టడి చేయాలనే తమ ప్రణాళిక బెడిసికొట్టిందని బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో అన్నాడు. భారత బ్యాటర్ల అసాధారణ ప్రదర్శన, తమ చెత్త బ్యాటింగ్ ఘోర పరాజయానికి కారణమైందని చెప్పాడు. టీ20 ప్రపంచకప్ 2024లో భాగంగా టీమిండియాతో శనివారం జరిగిన సూపర్-8 మ్యాచ్లో బంగ్లాదేశ్ 50 పరుగుల తేడాతో చిత్తయ్యింది. ఈ మ్యాచ్లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 196 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా(27 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 50 నాటౌట్) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగగా.. శివమ్ దూబే(24 బంతుల్లో 3 సిక్సర్లతో 34), విరాట్ కోహ్లీ(28 బంతుల్లో ఫోర్, 3 సిక్సతో 37), రిషభ్ పంత్(24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సతో 36) మెరుపులు మెరిపించారు.

బంగ్లాదేశ్ బౌలర్లలో తంజిమ్ హసన్ షకీబ్(2/32), రిషద్ హొస్సేన్(2/43) రెండేసి వికెట్లు తీయగా.. షకీబ్ అల్ హసన్ ఓ వికెట్ తీసాడు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 146 పరుగులే చేసి ఓటమిపాలైంది. నజ్ముల్ హొస్సేన్ షాంటో(32 బంతుల్లో ఫోర్, 3 సిక్సతో 40), టన్జిద్ హసన్(31 బంతుల్లో 4 ఫోర్లతో 29), రిషద్ హొస్సేన్(10 బంతుల్లో ఫోర్, 3 సిక్సర్లతో 24 ) రాణించారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్(3/19) మూడేసి వికెట్లు తీయగా.. అర్ష్దీప్ సింగ్, బుమ్రా రెండేసి వికెట్లు పడగొట్టారు. హార్దిక్ పాండ్యాకు ఓ వికెట్ దక్కింది. ఈ మ్యాచ్ అనంతరం తమ పరాజయంపై స్పందించిన నజ్ముల్ హొస్సేన్ షాంటో ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'మేం ముందుగా బ్యాటింగ్ చేసి భారత్ను 160-170 పరుగులకు కట్టడి చేయాలని భావించాం. కానీ భారత బ్యాటర్లు అద్భుత ప్రదర్శన కనబర్చారు.



## బజరంగ్ పూనియాపై
## మరోసారి సస్పెన్షన్ వేటు

స్టార్ రెజ్లర్ బజ్రంగ్ పూనియాపై మరోసారి సస్పెన్షన్ వేటు పడింది. డోపింగ్ నిబంధనలు ఉల్లంఘించారనే కారణంతో ఒలింపిక్స్ పతక విజేత బజ్రంగ్ పూనియాపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) నిషేధాన్ని విధిస్తూ ఛార్జ్ నోటీసులు జారీచేసింది. గత నెలలోనే బజ్రంగ్ను నాడా సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.అయితే కొన్ని రోజుల క్రితం 'నాడా క్రమశిక్షణ సంఘం' (ఏడీడీపీ) బజ్రంగ్పై నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. నాడా తదుపరి నోటీసులు ఇచ్చేదాకా బజ్రంగ్పై సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్టు ఏడీడీపీ తెలిపింది. ఎక్స్పైరీ అయిన కిట్లు వాడటంపై తాను అడిగిన ప్రశ్నలకు నాడా బదులివ్వలేదని బజరంగ్ పునియా వివరణ ఇవ్వడంతో.. ఏడీడీపీ తాత్కాలికంగా సస్పెన్షన్ను రద్దు చేసింది. కానీ నాడా ఛార్జ్ నోటీసులతో మరోసారి కొరడా ఝుళిపించింది. అసలేం జరిగిదంటే.. మార్చి 10న సోనెపట్లో ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ కోసం నిర్వహించిన ట్రయల్స్లో బజ్రంగ్ సెమీఫైనల్లో ఓటమిపాలయ్యాడు. అనంతరం అతను డోపింగ్ పరీక్షకు శాంపిల్ ఇవ్వకుండానే వెళ్లిపోయాడు. ఈ విషయమై కన్నెర్ర చేసిన నాడా బజ్రంగ్పై తాత్కాలిక సస్పెన్షన్ వేటు విధించింది. అయితే డోపింగ్ టెస్టుకు శాంపిల్స్ ఇవ్వడానికి తానెప్పుడూ తిరస్కరించలేదని బజ్రంగ్ పునియా ఏడీడీపీకి వివరణ ఇచ్చాడు. పరీక్షల కోసం నాడా అధికారులు గడువు దాటిన కిట్లను వాడడంతోనే యూరిన్ శాంపిల్ ఇచ్చేందుకు నిరాకరించానంటూ తెలిపాడు. అసలు ఎక్స్పైరీ అయిన కిట్లను ఎందుకు వాడుతున్నారని ప్రశ్నించానని, కానీ నాడా ఇప్పటికీ సమాధానం ఇవ్వలేదని ఏడీడీపీతో పేర్కొన్నాడు. బజరంగ్ పునియా వివరణతో ఏడీడీపీ కీలక ఆదేశాలు జారీ చేసింది. నాడా తదుపరి నోటీసులు ఇచ్చేదాకా బజ్రంగ్పై సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్టు తెలిపింది. ఈ నేపథ్యంలో బజ్రంగ్ పునియాకు నాడా ఛార్జ్ నోటీసులు పంపించిది. నిబంధనలు ఉల్లఘించాడంటూ సస్పెన్షన్ను తిరిగి విధించింది. కాగా, బజరంగ్ పునియా 2020 టోక్యో ఒలింపిక్స్లో కాంస్య పతకం గెలిచిన విషయం తెలిసిందే. 65 కేజీల విభాగంలో ఫ్రీస్టైల్లో మెడల్ సాధించాడు.

# జడేజాపై వేటు

### ఆస్ట్రేలియాతో తలపడే భారత తుది జట్టు ఇదే



టీ20 ప్రపంచకప్ 2024లో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా 24 గంటల వ్యవధిలోనే మరో కీలక పోరుకు సిద్ధమైంది. బంగ్లాదేశ్తో శనివారం జరిగిన రెండో సూపర్ 8 పోరులో 50 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించింది. ఆదివారం సెయింట్ లూసియాలోని డారెన్ సామీ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగే చివరి సూపర్-8 మ్యాచ్లో ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది.

ఈ మ్యాచ్లో విజయం సాధిస్తే టీమిండియా గ్రూప్-1 టాపర్గా సెమీఫైనల్లోకి అడుగుపెడుతోంది. ఓడినా సెమీస్ చేరే అవకాశం ఉన్నా.. ఇతర జట్ల ఫలితాలు, రనట్పై ఆధారపడాల్సి ఉంటుంది. కీలక నాకౌట్స్ ముందు ఆస్ట్రేలియా విజయం సాధించి సగర్వంగా టోర్నీలో ముందుడుగు వేయాలని భారత్ భావిస్తోంది. ఈ క్రమంలోనే టీమిండియా విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో ఎదురైన ఓటమికి ప్రతీకారి తీర్చుకోవాలని రోహిత్ సేన భావిస్తోంది. సూపర్-8లో ఒకే ఒక్క మార్పుతో బరిలోకి దిగిన టీమిండియా అదే కాంబినేషన్ను కొనసాగిస్తోంది. చివరి మ్యాచ్కు కూడా ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగే అవకాశం ఉంది. అయితే సెయింట్ లూసియాలోని డారెన్ సామీ స్టేడియం పేస్ బౌలింగ్కు అనుకూలంగా ఉంటుంది. అంతేకాకుండా ఈ మ్యాచ్కు వర్షం ముప్పు పొంచి ఉంది. ఈ క్రమంలోనే టీమిండియా వ్యూహాత్మక మార్పు చేసే అవకాశం ఉంది. ఈ టోర్నీలో దారుణంగా విఫలమైన రవీంద్ర జడేజాపై వేటు వేసి ఎక్స్ ట్రా బ్యాటర్ లేదా ఎక్స్ట్రా పేసర్ను తీసుకునే అవకాశం ఉంది.

**జడేజా ఔట్..** ఓవర్కాస్ట్ కండీషన్స్ నేపథ్యంలో ఎక్స్ట్రా బ్యాటర్తో బరిలోకి దిగడం ఉత్తమం. ఇలా ఆలోచిస్తే జడేజా స్థానంలో యశస్వి జైస్వాల్ బరిలోకి దిగే అవకాశం ఉంది. అతను ఓపెనర్గా ఆడితే కోహ్లీ ఫస్ట్ డౌన్లో బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది. ఎక్స్ట్రా పేసర్ కావాలనుకుంటే మాత్రం సిరాజ్ తుది జట్టులోకి వస్తాడు. ఇదొక్కటి మినహా తుది జట్టులో ఎలాంటి మార్పులు చేసే అవకాశం లేదు. శివమ్ దూబే అద్భుత ఇన్నింగ్స్ ఆడటంతో అతని ప్లేస్కు డోకా లేదు.

భారత తుది జట్టు(అంచనా) ఆస్ట్రేలియా:
రోహిత్ శర్మ(కెప్టెన్), విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్(కీపర్), సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్దీప్ సింగ్

## కమిన్స్ మరో హ్యాట్రిక్



టీ20 వరల్డ్ కప్-2024లో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ ప్యాట్ కమిన్స్ మరో సంచలనం సృష్టించాడు. సెయింట్ విన్సెంట్ వేదికగా అఫ్గానిస్థాన్తో జరుగుతున్న మ్యాచ్లో హ్యాట్రిక్ వికెట్లు సాధించాడు. ఇటీవల బంగ్లాదేశ్తో జరిగిన మ్యాచ్లోనూ కమిన్స్ హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టిన విషయం తెలిసిందే. 18వ ఓవర్ చివరి బంతికి రషీద్ ఖాన్ (2; 4 బంతుల్లో)ను ఔట్ చేసిన కమిన్స్ ఆ తర్వాత 20వ ఓవర్ తొలి రెండు బంతులకు వికెట్లు తీసి హ్యాట్రిక్ ఘనత అందుకున్నాడు. ఆఖరి ఓవర్ తొలి బంతికి షాట్కు యత్నించిన కరీమ్ జనత్ (13; 9 బంతుల్లో, 1 సిక్సర్)ను, రెండో బంతికి గుల్బాదిన్ను ఔట్ చేసి కమిన్స్ హ్యాట్రిక్ సాధించాడు. ఆ తర్వాతి బంతికి కూడా కమిన్స్ ఖాతాలో వికెట్ పడేది. ఖరోటే ఇచ్చిన క్యాచ్ను డేవిడ్ వార్నర్ జారవిడిచాడు. కమిన్స్ (3/28)తో పాటు ఆడమ్ జంపా (2/28) కూడా సత్తాచాటడంతో అఫ్గానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 148 పరుగులు చేసింది. అయితే అఫ్గాన్కు గొప్ప ఆరంభం లభించింది. ఓపెనర్లు గుర్బాజ్ (60; 49 బంతుల్లో, 4 ఫోర్లు, 4 సిక్సర్లు), ఇబ్రహీం జద్రాన్ (51; 48 బంతుల్లో, 6 ఫోర్లు) అర్ధశతకాలతో సత్తాచాటారు. వీరిద్దరు తొలి వికెట్కు 11.5 ఓవర్లలో 118 పరుగులు జోడించారు. అయితే అఫ్గాన్ ఓపెనర్లు క్రీజులో పాతుకుపోయినప్పటికీ ఆఖర్లో ధాటిగా బ్యాటింగ్ చేయలేకపోయారు. గేర్ మార్చి దూకుడుగా ఆడే యత్నంలో వికెట్లు చేజార్చుకున్నారు. ఎనిమిది బంతుల వ్యవధిలోనే పెవిలియన్కు చేరారు. అనంతరం ఆస్ట్రేలియా పైచేయి సాధించింది. అఫ్గానిస్థాన్ కోలుకోకుండా వరుసగా వికెట్లు తీసింది. దీంతో సులువుగా 170-180 పరుగులు సాధించేలా కనిపించిన అఫ్గాన్ 148 పరుగులతో సరిపెట్టుకుంది.

# హార్దిక్ పాండ్యా వల్లే గెలిచాం

### టీమిండియా కీలక ఆటగాడు : రోహిత్ శర్మ



స్టార్ ఆల్రౌండర్ హార్దిక్ పాండ్యాపై టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ప్రశంసల జల్లు కురిపించాడు. అటు బంతి.. ఇటు బ్యాట్తోనూ టీమిండియాకు హార్దిక్ పాండ్యా కీలకమని చెప్పాడు. అతని అసాధారణ ప్రదర్శనతోనే బంగ్లాదేశ్పై విజయం సాధించామని తెలిపాడు. టీ20 ప్రపంచకప్ 2024లో భాగంగా బంగ్లాదేశ్తో శనివారం ఏకపక్షంగా జరిగిన సూపర్-8 మ్యాచ్లో టీమిండియా 50 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో సెమీస్ అవకాశాలను మెరుగుపరుచుకుంది. ఈ మ్యాచ్ అనంతరం తమ విజయంపై స్పందించిన రోహిత్ శర్మ.. టీమ్ ప్రదర్శన పట్ల సంతోషం వ్యక్తం చేశాడు. 'టీ20ల్లో దూకుడుగా ఆడటం గురించి నేను చాలా రోజులుగా మాట్లాడుతున్నాను. ఈ మ్యాచ్లో మేం అన్ని విభాగాల్లో సత్తా చాటాం. పరిస్థితులను వేగంగా అందిపుచ్చుకున్నాం. ఈ మైదానంలో గాలులు వీచాయి. అయితే మేం అందుకు తగ్గట్లుగా తెలివిగా బ్యాటింగ్, బౌలింగ్ చేశాం. ఏది ఏమైనా జట్టులోని 8 మంది బ్యాటర్లు తమ పాత్ర పోషించాలి. ఒక్కరు హాఫ్ సెంచరీ చేసినా మేం 197 పరుగులు చేశాం. టీ20ల్లో హాఫ్ సెంచరీలు, శతకాలు అవసరం లేదు. బౌలర్లపై ఎంత ఒత్తిడి పెట్టావ్ అన్నదే ముఖ్యం. ప్రపంచంలో అందరూ ఇలానే ఆడుతున్నారు. మేం కూడా అలానే ఆడాలనుకుంటున్నాం. జట్టులో అనుభవం కలిగిన ఆటగాళ్లు చాలా మంది ఉన్నారు. వాళ్లందరికి మేం అండగా ఉన్నాం.

హార్దిక్ పాండ్యా గురించి నేను గత మ్యాచ్లోనే చెప్పాను. అతని బ్యాటింగ్ మమ్మల్ని మంచి పొజిషన్లో ఉంచుతుంది. టాప్-5, 6 బ్యాటర్లు అనంతరం కూడా మేం మంచి ముగింపు కోరుకుంటున్నాం. హార్దిక్ పాండ్యా.. హార్దిక్ పాండ్యానే. అతని సామర్థ్యం ఏంటో మాకు బాగా తెలుసు. అతను మాకు చాలా కీలకమైన ఆటగాడు. అతను ఇలానే అసాధారణ ప్రదర్శన కనబరిస్తే టీమిండియా కూడా మంచి పొజిషన్లో ఉంటుంది. ఈ మ్యాచ్లో బౌలర్లతో మట్లాడిన ప్రతీ విషయం మాకు ఫలితాన్నిచ్చింది.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 196 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా(27 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 50 నాటౌట్) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగగా.. శివమ్ దూబే(24 బంతుల్లో 3 సిక్సర్లతో 34), విరాట్ కోహ్లీ(28 బంతుల్లో ఫోర్, 3 సిక్సతో 37), రిషభ్ పంత్(24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సతో 36) మెరుపులు మెరిపించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో తంజిమ్ హసన్ షకీబ్(2/32), రిషద్ హొస్సేన్(2/43) రెండేసి వికెట్లు తీయగా.. షకీబ్ అల్ హసన్ ఓ వికెట్ పడగొట్టాడు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 146 పరుగులే చేసి ఓటమిపాలైంది. నజ్ముల్ హొస్సేన్ షాంటో(32 బంతుల్లో ఫోర్, 3 సిక్సతో 40), టన్జిద్ హసన్(31 బంతుల్లో 4 ఫోర్లతో 29), రిషద్ హొస్సేన్(10 బంతుల్లో ఫోర్, 3 సిక్సర్లతో 24 ) రాణించారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్(3/19) మూడేసి వికెట్లు తీయగా.. అర్ష్దీప్ సింగ్, బుమ్రా రెండేసి వికెట్లు పడగొట్టారు.

# అఫ్గానిస్థాన్కు జాక్పాట్

### భారత్-ఆసీస్కు మించి సెమీస్ అవకాశాలు



టీ20 వరల్డ్ కప్-2024 సంచలనాలకు వేదికగా మారుతోంది. లీగ్ దశలో పాకిస్థాన్పై అమెరికా గెలిచి ఈ ట్రెండ్ను ఆరంభించగా అఫ్గానిస్థాన్ దాన్ని అద్భుతంగా కొనసాగిస్తోంది. తొలుత న్యూజిలాండ్పై గెలిచిన అఫ్గాన్.. ఇవాళ ఆస్ట్రేలియాకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. ఈ గెలుపుతో గ్రూప్-1 టీమ్స్ సెమీస్ సమీకరణాలు ఒక్కసారిగా తారుమారయ్యాయి. అఫ్గాన్ సెమీఫైనల్స్ అవకాశాలను గణనీయంగా మెరుగయ్యాయి. ఎంతలా అంటే.. రేపటి మ్యాచ్లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమిపాలైనా, అఫ్గానిస్థాన్కు అవకాశాలు గొప్పగానే ఉన్నాయి. సూపర్-8లోని గ్రూప్-1లో భారత్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, ఆస్ట్రేలియా జట్లు ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం టీమిండియా (4 పాయింట్లు, +2.425 నెట్రన్రేటు) అగ్రస్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో ఆస్ట్రేలియా (2 పాయింట్లు, +0.223), అఫ్గానిస్థాన్ (2 పాయింట్లు, -0.650), బంగ్లాదేశ్ (-2.489 నెట్రన్రేటు) ఉన్నాయి. గ్రూప్-1లో ప్రతి జట్టుకు ఇంకా సెమీస్ అవకాశాలు ఉన్నాయి. ఆడిన రెండింట్లో ఓటమిపాలైన బంగ్లాదేశ్ కూడా సెమీస్ రేసులో ఉంది. అయితే బంగ్లా నాకౌట్ దశకు చేరాలంటే ఆస్ట్రేలియాపై భారత్ విజయం సాధించాలి. అలాగే అఫ్గానిస్థాన్పై బంగ్లా రికార్డు విజయం సాధించి.. ఆసీస్, అఫ్గాన్ కంటే మెరుగైన నెట్రన్రేటు సంపాదించుకుంటే సెమీస్కు చేరొచ్చు. ఇది జరిగే అవకాశాలు చాలా తక్కువ.

ఇక భారత్ విషయానికొస్తే..ఆస్ట్రేలియాపై గెలిస్తే సెమీస్ బెర్తు కన్ఫార్మ్ చేసుకుంది. ఒక వేళ టీమిండియా ఓటమిపాలైనా అవకాశాలు ఉంటాయి. అయితే బంగ్లాదేశ్ చేతిలో అఫ్గానిస్థాన్ ఓడాలి. కానీ బంగ్లాపై అఫ్గాన్ గెలిస్తే రోహిత్ సేన నెట్రన్రేటుపై ఆధారపడాల్సి ఉంటుంది. ఆస్ట్రేలియా విషయానికొస్తే.. భారత్పై తప్పక విజయం సాధించాలి. ఓటమిపాలైతే అఫ్గానిస్థాన్పై బంగ్లాదేశ్ గెలవాలని కంగారూలు పూజలు చేయాలి. అఫ్గానిస్థాన్ది డిఫ్రెంట్ స్టోరీ. మరో మ్యాచ్ మిగిలుండగానే భారత్ సెమీస్కు చేరే అవకాశాన్ని అఫ్గాన్ భగ్నం చేసింది. ఆస్ట్రేలియా చేతిలో అఫ్గాన్ ఓడి ఉంటే భారత్ ఇప్పటికే సెమీస్కు చేరుకునేదే. అయితే సంచలన విజయంతో అఫ్గాన్ సెమీస్ రేసులో దూసుకొచ్చింది. నాకౌట్ దశకు చేరాలంటే అఫ్గాన్ ముందు రెండు దారులు ఉన్నాయి. ఒకటి.. బంగ్లాదేశ్పై అఫ్గానిస్థాన్ విజయం సాధించాలి, అలాగే ఆస్ట్రేలియాపై భారత్ తప్పక గెలవాలి. ఇక రెండోది.. నెట్ రన్ రేటుకు సంబంధించింది. ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఒక్క పరుగు తేడాతో ఓటమిపాలైతే.. బంగ్లాదేశ్పై కనీసం అఫ్గాన్ 36+ పరుగుల తేడాతో గెలవాలి. అప్పుడు ఆస్ట్రేలియా నెట్రన్రేటును అఫ్గాన్ అధిగమించి సెమీస్కు చేరి చరిత్ర సృష్టించగలదు.

## ఆస్ట్రేలియాపై అఫ్గానిస్థాన్ చరిత్రాత్మక విజయం

సెమీఫైనల్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్లో అఫ్గానిస్థాన్ ఆల్రౌండ్ షోతో అదరగొట్టింది. స్ట్రాంగ్ టీమ్ ఆస్ట్రేలియాను 21 పరుగుల తేడాతో మట్టికరిపించింది. గత వన్డే వరల్డ్ కప్లో అఫ్గాన్ చేతిలో జట్టు ఓటమిని తప్పించిన గ్లెన్ మాక్స్వెల్ (59; 41 బంతుల్లో, 6 ఫోర్లు, 3 సిక్సర్లు) ఈ సారి అదే మ్యాజిక్ను రిపీట్ చేయలేకపోయాడు. మందకొడి పిచ్పై మాక్సీ పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించింది. గుల్బాదిన్ నైబ్ (4/20) అఫ్గానిస్థాన్కు చరిత్రాత్మక విజయాన్ని అందించాడు. ఆస్ట్రేలియాపై అఫ్గాన్కు ఇదే తొలి గెలువు.మొదట బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 148 పరుగులు చేసింది. ఓపెనర్లు గుర్బాజ్ (60; 49 బంతుల్లో, 4 ఫోర్లు, 4 సిక్సర్లు), ఇబ్రహీం జద్రాన్ (51; 48 బంతుల్లో, 6 ఫోర్లు) అర్ధశతకాలతో సత్తాచాటారు. వీరిద్దరు తొలి వికెట్కు 11.5 ఓవర్లలో 118 పరుగులు జోడించారు. అఫ్గాన్ ఓపెనర్లు క్రీజులో పాతుకుపోయినప్పటికీ ఆఖర్లో ధాటిగా బ్యాటింగ్ చేయలేకపోయారు. ప్యాట్ కమిన్స్ (3/28) హ్యాట్రిక్ వికెట్లు సాధించాడు. ఆడమ్ జంపా (2/28) రెండు వికెట్లు తీశాడు.అనంతరం ఛేదనకు దిగిన ఆస్ట్రేలియా 19.2 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. గుల్బాదిన్ నైబ్ (4/20) నాలుగు, నవీనుల్ హక్ (3/20) మూడు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించారు. ఛేజింగ్ ఆరంభంలోనే ఆస్ట్రేలియాను నవీనుల్ హక్ దెబ్బకొట్టాడు. ట్రావిస్ హెడ్ను క్లీన్ బౌల్డ్ చేశాడు. మూడు బంతులు ఎదుర్కొన్న హెడ్ డకౌట్గా వెనుదిరిగాడు. కాసేపటికే మిచెల్ మార్ష్ (12; 9 బంతుల్లో, 2 ఫోర్లు)ను నవీనుల్, డేవిడ్ వార్నర్ (3; 8 బంతుల్లో)ను నబీ ఔట్ చేయడంతో ఆసీస్ 32 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది.

ఈ దశలో బ్యాటింగ్కు వచ్చిన స్టొయినిస్తో కలిసి మాక్స్వెల్ ఇన్నింగ్స్ చక్కదిద్దడానికి ప్రయత్నించాడు. టిమ్ డేవిడ్ నిదానంగా ఆడగా, మాక్సీ తనదైన శైలిలో దూకుడుగా పరుగులు సాధించాడు.



## తృటిలో గెలుపును చేజార్చుకున్నాం

టీ20 వరల్డ్ కప్-2024లో అఫ్గానిస్థాన్ సంచలన ప్రదర్శన చేస్తోంది. గ్రూప్ స్టేజ్లో న్యూజిలాండ్ను చిత్తు చేసిన అఫ్గాన్ ఇవాళ సూపర్-8లో ఆస్ట్రేలియాను మట్టికరిపించింది. స్ఫూర్తిదాయక ప్రదర్శనతో ఆసీస్పై చారిత్రక విజయాన్ని అందుకుంది. అయితే గత వరల్డ్ కప్లోనే ఆస్ట్రేలియాపై నెగ్గేవాళ్లమని, కానీ తృుఎటిలో గెలుపును చేజార్చుకున్నామని అఫ్గానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ అన్నాడు. కానీ ఈ సారి ఎలాంటి పొరపాటు చేయకుండా విజయతీరాలకు చేరామని తెలిపాడు. కింగ్స్టౌన్లోని సెయింట్ విన్సెంట్ వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్లో ఆస్ట్రేలియాపై 21 పరుగుల తేడాతో అఫ్గానిస్థాన్ ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 148 పరుగులు చేసింది. ఓపెనర్లు గుర్బాజ్ (60; 49 బంతుల్లో, 4 ఫోర్లు, 4 సిక్సర్లు), ఇబ్రహీం జద్రాన్ (51; 48 బంతుల్లో, 6 ఫోర్లు) అర్ధశతకాలతో సత్తాచాటారు.ఆడమ్ జంపా (2/28) రెండు వికెట్లు తీశాడు. అనంతరం ఛేదనలో ఆస్ట్రేలియా 19.2 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. గుల్బాదిన్ నైబ్ (4/20) నాలుగు, నవీనుల్ హక్ (3/20) మూడు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించారు.గత వన్డే వరల్డ్ కప్ తరహాలో జట్టును గెలిపించాలనుకున్న గ్లెన్ మాక్స్వెల్ (59; 41 బంతుల్లో, 6 ఫోర్లు, 3 సిక్సర్లు)కు ఈసారి నిరాశే మిగిలింది. కాగా, మ్యాచ్ అనంతరం తమ జట్టు ప్రదర్శన గురించి రషీద్ ఖాన్ మాట్లాడాడు. ఇది ఆరంభం మాత్రమే అని, సెమీస్కు చేరడమే తమ తర్వాతి లక్ష్యమని తెలిపాడు. అలాగే భారత్తో జరిగిన మ్యాచ్లో తమ జట్టులో మార్పులు చేయడానికి, ఇవాళ ఆస్ట్రేలియాతో గత టీమ్ కాంబినేషన్ను కొనసాగించడానికి గల కారణాలు రషీద్ ఖాన్ వివరించాడు. ఆస్ట్రేలియాపై విజయం మా జట్టుకు, దేశానికి ఎంతో గొప్ప ఘనత. ఆసీస్పై గెలవడం మంచి అనుభూతి. 2023 వన్డే వరల్డ్ కప్, 2022 టీ20 వరల్డ్ కప్లోనే దీన్ని పొందాల్సింది. గుర్బాజ్-ఇబ్రహీం ఓపెనింగ్ జోడీని తుదిజట్టులో కొనసాగించడం మాకు ఎంతో కీలకం. అందుకే భారత్ మ్యాచ్లో భిన్నంగా తుదిజట్టు కూర్పుతో ఆడాం , ఈ పిచ్పై 140 మంచి స్కోరు. అయితే మేం గొప్పగా బ్యాటింగ్ను ముగించలేకపోయాం. దక్కిన శుభారంభంతో ఆ స్కోరు సాధించగలిగాం. ప్రశాంతతో ఉంటే లక్ష్యాన్ని కాపాడుకోగలమని తెలుసు. గుల్బాదిన్ నైబ్ గొప్పగా బౌలింగ్ చేశాడు. మా జట్టులో ఎక్కువ ఆల్రౌండర్లు ఉండటం గొప్ప విషయం. అతని అనుభవంతో చక్కగా బౌలింగ్ చేశాడు. ఇవాళ అది మాకు ఎంతో సాయం చేసింది. అతను డేవిడ్ వార్నర్ వికెట్ను తీసిన తీరు ఎంతో ఆకట్టుకుంది" అని రషీద్ ఖాన్ పేర్కొన్నాడు.

# ప్రభాస్ కల్కికి నాగ్ కామెంట్



పాన్ ఇండియా మోస్ట్ అవైటెడ్ ఫిల్మ్ కల్కి 2898 ఏడీ మరో నాలుగు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. స్టార్ హీరో ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ కాంబోలో తెరకెక్కుతున్న కల్కిని భారీ బడ్జెట్ తో వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై వేరే లెవెల్ లో అంచనాలు నెలకొన్నాయి. హాలీవుడ్ రేంజ్ లో ఉండనున్న ఈ చిత్రం కోసం అంతా ఎదురుచూస్తున్నారు. రీసెంట్ గా మేకర్స్ రిలీజ్ చేసిన సెకండ్ ట్రైలర్ ఎలా దుమ్మురేపుతుందో తెలిసిందే. యూట్యూబ్ లో నెంబర్ వన్ ప్లేస్ లో ట్రెండ్ అవుతూ రికార్డ్ స్థాయిలో వ్యూస్ దక్కించుకుంటోంది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తోంది. ఇప్పటికే డైరెక్టర్ రాజమౌళితో పాటు పలువురు సెలబ్రిటీలు కల్కి ట్రైలర్ పై నెట్టింట స్పందించారు. మూవీ టీమ్ కు బెస్ట్ విషెస్ తెలిపారు. తాజాగా కింగ్ నాగార్జున రెస్పాండ్ అయ్యారు. అయితే సోషల్ మీడియాలో ఎప్పుడూ పెద్దగా యాక్టివ్ గా ఉండని నాగ్.. నేడు కల్కి ట్రైలర్ పై ప్రశంసలు కురిపించారు. "ఏం ప్రపంచం.. సృష్టించారు మీరు నాగీ!!! మన భారతదేశపు అపురూపమైన కథలను తెరపైకి తీసుకువస్తున్నారు!! చిత్రాన్ని చూసేందుకు ఉబ్బితబ్బిబ్బవుతున్నాను.. ఎక్సైట్ గా ఫీల్ అవుతున్నాను!! అమిత్ జీ ఫైర్.. కమల్ జీ జస్ట్ వావ్!! ప్రభాస్.. ప్రయోగాలు చేసే నీ ధైర్యాన్ని మెచ్చుకుంటున్నాను" అని ట్వీట్ చేశారు. కల్కి మేకర్స్ అయిన అశ్వినీదత్, స్వప్న దత్, స్వీటీని తన ఫేవరేట్ నిర్మాతలుగా పేర్కొంటూ.. ఆల్ ది బెస్ట్ చెప్పారు నాగార్జున. దేవుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడని రాసుకొచ్చారు. ప్రస్తుతం నాగ్ ట్వీట్ సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతోంది. అయితే నాగార్జున.. సినిమాల కోసం పెద్దగా ట్వీట్ చేయడం ఎప్పుడూ చూడలేదని నెటిజన్లు చెబుతున్నారు. ఇప్పుడు ఇంతలా ప్రశంసలు కురిపించారంటే.. కల్కి రేంజ్ ఎలా ఉందో తెలుస్తుందని అంటున్నారు.



## కాశ్మీర్ వ్యాలీలో 'మిస్టర్ బచ్చన్' డ్యూయెట్

మాస్ మహారాజా రవితేజ, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ హరీష్ శంకర్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ "మిస్టర్ బచ్చన్" ప్రస్తుతం బ్యూటీఫుల్ కాశ్మీవ్యాలీలో టీం సాంగ్ షూట్ జరుపుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్పై టిజి విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే 90% షూటింగ్ పూర్తి చేసుకుని ముగింపు దశకు చేరుకుంది. తాజా షెడ్యూల్లో రవితేజ, భాగ్యశ్రీ బోర్స్ పై బ్యూటీఫుల్ మెలోడీ డ్యూయెట్ ని షూట్ చేస్తున్నారు. ఈ పాటకు స్టార్ కొరియోగ్రఫర్ శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. కాశ్మీర్లోని అద్భుతమైన లోకేషన్ లో ఈ పాట చిత్రీకరణ గత నాలుగు రోజులుగా కొనసాగుతోంది. ఈరోజు ఈ సాంగ్ షూట్ చివరి రోజు. లోకేషన్ సెలెక్షన్, సాంగ్ జానర్ సినిమాలో విజువల్ ఫీస్ట్, ఎమోషనల్ ఎలిమెంట్ ని యాడ్ చేస్తోంది.90% చిత్రీకరణ పూర్తి కావడంతో, మిగిలిన పార్ట్స్ ని చిత్రీకరించే దిశగా టీమ్ శరవేగంగా పని చేస్తోంది.



## శివ రాజ్ కుమార్, కార్తీక్ అద్వైత్ బైలింగ్వల్ మూవీ



కన్నడ ఫిల్మ్ ఇండస్ట్రీ "హ్యాట్రిక్ హీరో", కరుణడ చక్రవర్తి శివరాజ్ కుమార్ సౌత్ ఇండియాలో బిజియస్ట్ యాక్టర్స్ లో ఒకరు, లీడ్ రోల్స్ తో పాటు, జైలర్, కెప్టెన్ మిల్లర్. ఇతర ప్రముఖ చిత్రాలలో ప్రత్యేక పాత్రలు చేయడంలో శివన్న పాపులర్.నిన్న శ్రీమతి గీతా శివ రాజ్కుమార్ పుట్టినరోజు సందర్భంగా శివ రాజ్కుమార్ నెక్స్ట్ మూవీని అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ఈ కన్నడ తెలుగు బైలింగ్వల్ ఫిల్మ్ ని కార్తీక్ అద్వైత్ దర్శకత్వంలో పద్మజ ఫిలింస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో భువనేశ్వరి పిక్చర్స్ బ్యానర్పై ఎస్ఎన్ రెడ్డి, సుధీర్ పి నిర్మిస్తున్నారు. మేకర్స్ కొత్తగా విడుదల చేసిన పోస్టర్ ద్వారా శ్రీమతి గీతా శివ రాజ్కుమార్కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, అనౌన్స్ మెంట్ కి పర్శనల్ టచ్ జోడించి, ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న ఎక్సయిట్మెంట్ ని పెంచడం ద్వారా మూవీని అనౌన్స్ చేశారు. కార్తీక్ అద్వైత్ గతంలో విక్రమ్ ప్రభుతో 'పాయుమ్ ఒలి నీ యెనక్కు' తమిళ చిత్రానికి దర్శకత్వం వహించాడు. ఈ హై-ఆక్టేన్ యాక్షన్ థ్రిల్లర్ ప్రాజెక్ట్తో శాండల్వుడ్లోకి అడుగుపెట్టారు, ఇది అతని సెకెండ్ డైరెక్షనల్ వెంచర్. శివరాజ్ కుమార్ని కంప్లీట్ కొత్త లుక్, క్యారెక్టర్ లో ప్రజెంట్ చేసే ఈ మూవీపై అభిమానులలో భారీ అంచనాలు వున్నాయి. స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది, ఇప్పటికే మ్యూజిక్ కంపోజిషన్ జరుగుతోంది. అఫీషియల్ లాంచ్ వేడుక ఆగస్ట్లో వుంటుంది, షూట్ను ఫార్మల్ గా కిక్ స్టార్ట్ చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమలో విజయవంతమైన చిత్రాలతో మంచి పేరు తెచ్చుకున్న నిర్మాత ఎస్ ఎన్ రెడ్డి ఈ బైలింగ్వల్ వెంచర్ కోసం సుధీర్ పి.తో కొలబరేట్ అవుతున్నారు.

## మధురం టీజర్ చాలా ప్రామిసింగ్



యంగ్ హీరో ఉదయ్ రాజ్ హీరోగా స్టన్నింగ్ బ్యూటీ వైష్ణవి సింగ్ హీరయిన్ గా శ్రీ వెంకటేశ్వర ఎంటర్ టైన్మెంట్ పతాకంపై టాలెంటెడ్ డైరెక్టర్ రాజేష్ చికిలే దర్శకత్వంలో టేస్ట్ఫుల్ప్రొడ్యూసర్ యం.బంగార్రాజు నిర్మిస్తోన్న చిత్రం 'మధురం'. ఎ మెమొరబుల్ లవ్ అనేది టాగ్ లైన్. టీనేజ్ ప్రేమ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకొని .. సెన్సార్ కార్యక్రమాలను జరుపుకుంటోంది. కాగా ఈ చిత్రం టీజర్ ను రెటిరో స్టార్ నితిన్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరో ఉదయ్ రాజ్, దర్శకుడు రాజేష్ చికిలే, నిర్మాత బంగార్రాజు, ప్రొడక్షన్ మేనేజర్స్ వర్మ, టోనీ పాల్గొన్నారు. అనంతరం రెటిరో స్టార్ నితిన్ మాట్లాడుతూ.. 'మధురం సినిమా టీజర్ లాంచ్ చేయడం చాలా హ్యాపీగా ఉంది. టీజర్ చాలా ప్రామిసింగ్ గా ఉంది. డెఫినెట్ గా మంచి హిట్ అవుతుంది. స్వీట్, ఇన్నోసెంట్, ఒక జెన్యూన్ గా వుంది. చూస్తుంటే అవుట్ అండ్ అవుట్ లవ్ స్టోరీలా వుంది. ఈ సినిమా హిట్ అయి టీం అందరికీ మంచి బ్రేక్ రావాలి. నిర్మాత బంగార్రాజు, దర్శకుడు రాజేష్, హీరో ఉదయ్ అండ్ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ అన్నారు.

## అనుష్కకి అరుదైన సమస్య



తనకు కొన్ని నిమిషాల పాటు ఆగకుండా నవ్వే అరుదైన సమస్య ఉందని స్వీటీ అనుష్క శెట్టి వెల్లడించిన ఒక ఇంటర్వ్యూ అంతర్జాలంలో వైరల్గా మారింది. ఎప్పుడూ ప్రశాంతంగా ఆహ్లాదకరంగా కనిపించే అనుష్క శెట్టికి ఇలాంటి సమస్య ఉందా? అని అంతా ఆశ్చర్యపోయారు. ఇది సెట్లో కొందరికి తెలిసిన విషయమే అయినా.. చాలా మంది ప్రజలకు దీనిపై అవేర్ నెస్ లేదు. అసలింతకీ సౌతిండియా సూపర్ స్టార్ అనుష్క శెట్టి సమస్య ఏమిటి? అంటే ..అప్పటికప్పుడు నాన్‌స్టాప్గా కొన్ని నిమిషాల పాటు నవ్వు ఆపుకోలేకపోవడం తన సమ స్య. ఒక పాత వీడియో ఇంటర్వ్యూలో అను ష్క శెట్టి ఈ ప్రాబ్లెమ్ గురించి వెల్లడించారు. తాను నవ్వడం ప్రారంభించిన తర్వాత ఆప డం అసాధ్యమని తెలిపారు. అనుష్క మాట్లాడుతూ- 'నాకు నవ్వే వ్యాధి ఉంది. నవ్వడం సమస్యేనా? అని అందరూ ఆశ్చర్యపోవ చ్చు. నేను నవ్వడం ప్రారంభిస్తే, 15 నుండి 20 నిమిషాలు ఆపలేను. కామెడీ సన్నివే శాలను చూస్తున్నప్పుడు లేదా షూటింగ్ చేస్తున్నప్పుడు పడి పడి నవ్వుతూ నేను అక్షరాలా నేలపై పడిపోతాను. దానివల్ల షూటింగ్ చాలాసార్లు ఆగిపోయింది'అని గతంలో వెల్లడించారు. చాలామంది లాఫింగ్ డిసీజ్ అని పిలుస్తున్నా.. వైద్య పరిభాషలో 'సూడోబుల్బార్ ఎఫెక్ట్ అని పిలుస్తారని న్యూరాలజిస్ట్ డాక్టర్లు చెబుతున్నారు.

## 'రేవు' పార్టీలో హేమా హేమీలు



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా రేవు. ఈ చిత్రంలో గురు తేజ్, సుమేష్ మాధవన్, హేమంత్ ఉద్భవ్, లీలా వెంకటేష్ కొమ్మూరి ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని సంహిత్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై నిర్మాత డా. మురళీ గింజుపల్లి నిర్మిస్తున్నారు. నవీన్ పారుపల్లి సమర్పకులు గా ఉన్నారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ పర్వతనేని రాంబాబు. సినిమా ప్రొడక్షన్ పర్యవేక్షకులుగా సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ ప్రభు వ్యవహరిస్తున్నారు. హరినాథ్ పులి దర్శకత్వం వహించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న "రేవు" సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ఈ మూవీ టీమ్ ఫ్యాషన్ షో మరియు స్పెషల్ పార్టీ నిర్వహించారు. ఈ పార్టీలో చిత్ర బృందం తో పాటు మురళీ మోహన్, ఆర్జీవీ, అనన్య నాగళ్ల, సంపత్ నంది, ఉత్తేజ్ గెస్టులుగా పాల్గొని సందడి చేశారు.

మురళీ మోహన్ మాట్లాడుతూ.. రేవుల దగ్గర జీవనం గడిపే మత్స్యకారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటారు. ముఖ్యంగా వడ్డీ వ్యాపారులు వారి శ్రమను దోచుకుంటారు. చేపలను వారు చెప్పిన రేటుకే కొనాలని షరతులు విధిస్తారు. మత్స్యకారుల జీవితాల్లోని ఇలాంటి ఇబ్బందులను నేపథ్యంగా ఎంచుకుని రేవు సినిమా చేయడం మంచి ప్రయత్నం. ప్రభు నాకు ఈ సినిమాను అంతా కొత్తవాళ్లు చేస్తున్నారు, బాగా చేశారని చెప్పినప్పుడు ఆసక్తిగా అనిపించింది. ప్రభు మనకున్న ఫిలిం జర్నలిస్టుల్లో ది బెస్ట్ పర్సన్. ఆయనను ఈ సినిమాకు పర్యవేక్షకుడిగా పెట్టుకోవడం మంచి నిర్ణయం. అలాగే మరో సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ పర్వతనేని రాంబాబు ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా చేస్తున్నారు. స్టార్స్ ఉన్న సినిమా హిట్ అవ్వడం కంటే కొత్త వాళ్లతో చేసిన సినిమా హిట్ అయితే ఆ కిక్కే వేరు. ఆ సంతోషం పర్వతనేని రాంబాబుగారికి, ప్రభు గారికి, ప్రొడ్యూసర్ డాక్టర్ మురళీ గింజుపల్లి గారికి దక్కాలని కోరుకుంటున్నా. దర్శకుడు హరినాథ్ పులి చూడటానికి చిన్నవాడైనా సినిమా బాగా తెరకెక్కించాడు. స్టార్ సినిమాలకు ఓపెనింగ్స్ బాగా వస్తాయి కానీ చిన్న సినిమాకు బాగుందని మౌత్ టాక్ మొదలైతే హౌస్ ఫుల్స్ అవుతాయి.

## మృణాల్ సక్సెస్ స్టెప్



బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్.. తెలుగులో సీతారామం మూవీతో ఎలాంటి క్రేజ్ దక్కించుకుందో అందరికీ తెలిసిందే. ఫస్ట్ సినిమాతోనే ఓవర్ నైట్ స్టార్ గా మారిపోయింది. హను రాఘవపూడి దర్శకత్వం వహించిన సీతారామంలో తన అందం, అభినయంతో అందరి మనసులు దోచేసింది. టాలీవుడ్ సీతగా పేరు సంపాదించుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు వచ్చినా.. ఆచితూచి ఎంచుకుంది మృణాల్ ఠాకూర్. సీతారామం తర్వాత.. టాలీవుడ్ నేచురల్ స్టార్ నానితో కలిసి హాయ్ నాన్న సినిమా చేసింది. ఈ మూవీతో మరో హిట్ ను తన ఖాతాలో వేసుకుంది అమ్మడు. తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ఆ తర్వాత ఫ్యామిలీ స్టార్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది మృణాల్. కానీ ఆ సినిమా.. బాక్సాఫీస్ వద్ద అనుకున్నంత స్థాయిలో మెప్పించలేకపోయింది. దీంతో హ్యాట్రిక్ మిస్ చేసుకుంది. అయితే సినిమాలో యాక్టింగ్ తో మాత్రం మృణాల్ మెప్పించింది. ఫ్యామిలీ స్టార్ తర్వాత ఒక్క తెలుగు మూవీ కూడా అనౌన్స్ చేయలేదు మృణాల్. కానీ పలు సినిమాల్లో నటిస్తున్నట్లు తెలుస్తోంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కల్కి 2898 ఏడీ మూవీలో కూడా మృణాల్ క్యామియో రోల్ పోషిస్తున్నట్లు కొద్దిరోజులుగా వార్తలు వస్తున్నాయి. దీనిపై మేకర్స్ ఇంకా అఫీషియల్ గా అనౌన్స్ చేయకపోయినా.. ఆమె సినిమాలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అయితే కల్కిలో మృణాల్ రోల్ కోసం ఇప్పుడు నెట్టింట చర్చ నడుస్తోంది. సినిమాలో మృణాల్ తల్లి పాత్రలో నటించినట్లు తెలుస్తోంది. భైరవ చిన్ననాటి రోల్ కు మృణాల్ తల్లిగా కనిపించనుందని సమాచారం. దీంతో ఆమె డేరింగ్ స్టెప్ వేసిందని సినీ పండితులు చెబుతున్నారు. ఇప్పటి వరకు చేసిన సినిమాల్లో యువతిగా ఎలిగెంట్ రోల్స్ లో కనిపించిన మృణాల్.. ఇప్పుడు తల్లిగా నటించడం గ్రేటేనని అంటున్నారు.

## లక్కీ రుహానీ



టాలీవుడ్ లో చిలసౌ చిత్రంతో 2018 సంవత్సరంలో ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ రుహానీ శర్మ. అంతకు ముందు తమిళ సినిమా చేసినా కూడా పెద్దగా గుర్తింపు రాలేదు. టాలీవుడ్ లో మొదటి సినిమాతోనే మంచి పేరును దక్కించు కోవడంతో పాటు ఆఫర్లు సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. నటనకు ఆస్కారం ఉన్న సినిమాలు చేయడం ద్వారా తనను తాను నిరూపించుకుంటూ వస్తున్న ముద్దుగుమ్మ చిలసౌ రుహానీ శర్మ తాజాగా తమిళ క్రేజీ దర్శకుడు వెట్రిమారన్ నిర్మాణంలో నటించే అవకాశం దక్కింది. ఆయన దర్శకత్వంలో నటించాలని చాలా మంది హీరోయిన్స్ కోరుకుంటారు. వెట్రిమారన్ దర్శకత్వంలో నటించే అవకాశం రాకున్నా ఆయన బ్యానర్ లో సినిమాను చేసే అవకాశం రావడం అనేది రుహానీ శర్మకి కచ్చితంగా పెద్ద ఆఫర్ అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు మాట్లాడుకుంటున్నారు. తెలుగు మరియు తమిళంలో ఈ అమ్మడు మరింత బిజీ అవ్వాలంటే ఈ సినిమా హిట్ అవ్వాలి. కవిన్ తో కలిసి రుహానీ శర్మ మాస్క్ సినిమాలో స్క్రీన్ షేర్ చేసుకుంటుంది. సినిమాకు సంబంధించిన వర్క్ శరవేగంగా జరుగుతుంది. విక్రమ్ అశోక్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవ్వబోతున్నాడు. థ్రిల్లర్ ఎలిమెంట్స్ తో రూపొందుతున్న ఈ సినిమాలో ఆండ్రియా జెరెమియా నటిస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. ఒక వైపు విడుతలై పార్ట్ 2 షూటింగ్ తో బిజీగా ఉన్నా కూడా దర్శకుడు వెట్రిమారన్ 'మాస్క్' సినిమా మేకింగ్ విషయంలో శ్రద్ధ తీసుకుంటున్నాడు.

**PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD**, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. **PRINTED AT SPR PRINTING PRESS,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, **TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. **EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232** RNI Registration No. **APTEL/2007/22044**